అనుదినం... జనస్వరం


www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 17-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 258 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00



రాష్ట్రాల హక్కులకు భంగం

జమిలికి మేం వ్యతిరేకం



- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై బీజేపీ సర్కారు వివక్ష
- సర్వమత సమ్మేళనమే కాంగ్రెస్ వైఖరి
- 'ఇండియా' కూటమిని బలోపేతం చేయాలి
- 5 రాష్ట్రాల ఎన్నికల్లో వీలైనంత త్వరగా సీట్ల సర్దుబాటు
- సీడబ్ల్యూసీ సమావేశంపై కాంగ్రెస్ నేత చిదంబరం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ పార్టీ జమిలి ఎన్నికల ప్రతిపాదనను తిరస్కరిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పీ చిదంబరం తెలిపారు. జమిలి ఎన్నికలు నిర్వహించడమంటే రాష్ట్రాల హక్కులను అణచివేయటమేనని అభిప్రాయపడ్డారు. ఈ ఎన్నికలు నిర్వహించాలంటే అనేక రాజ్యాంగ సవరణలు అవసరమనీ, దానికి తగిన సంఖ్యా బలం అధికార పక్షానికి లేదని చెప్పారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలు శుక్రవారంనాడిక్కడి ఓ ఐదు నక్షత్రాల హోటల్‌లో ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ప్రారంభమైన ఈ సమావేశంలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సహా పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో సీడబ్ల్యుసీ సభ్యులు జైరాంరమేష్, పవన్‌ఖేరాతో కలిసి ఆయన విలేకర్లతో ...15లో

చరిత్రలో నిలిచేలా..

- నేడు తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో కాంగ్రెస్ విజయ భేరి సభ
- వేదికపై సీడబ్ల్యూసీ సభ్యులు, అగ్రనాయకులు వివరాలు 6లో..

కాంగ్రెస్‌లో చేరిన తుమ్మల

మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే...ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కర్నాటక సీఎం సిద్ధరామయ్య, కేసీ.వేణుగోపాల్, రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితర నేతలు ...5లో



దేశ రక్షణే కమ్యూనిస్టుల ధ్యేయం

భారత స్ఫూర్తికి బీజేపీ విఘాతం

- సనాతన ధర్మం అమలే దాని లక్ష్యం వివరాలు 6లో..
- 'ఇండియా' సాకుతో పొత్తు ధర్మానికి కేసీఆర్ తూట్లు
- బీజేపీకి దగ్గరయ్యేందుకే..కమ్యూనిస్టులకు దూరం
- వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

తెలంగాణ సిద్ధించిన నాడు నా మనసు ఎంత పులకరించి పోయిందో.. ఈ రోజు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా కృష్ణా జలాలు పైకి ఉబికి వస్తుంటే అంతే పులకరించిపోయిందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. సెప్టెంబర్ 16 సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని అన్నారు. తెలంగాణ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నీటి ఎత్తిపోతలను సీఎం కేసీఆర్ శనివారం ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్ వద్ద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. సీఎం కేసీఆర్ నార్లాపూర్ పంప్‌హౌస్ వద్ద 145 మెగావాట్ల సామర్థ్యమున్న మోటర్లను కంప్యూటర్‌పై మీట నొక్కి ఎత్తిపోతలను ప్రారంభించారు. అనంతరం అంజనగిరి రిజర్వాయర్‌లోకి చేరిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలహారతి పట్టారు.

పాలమూరుకు కృష్ణా జలాలు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు ప్రారంభం

నార్లాపూర్ పంపుహౌస్ వద్ద మోటార్లను ఆన్‌చేసిన సీఎం కేసీఆర్

- గత పాలకుల వైఫల్యమే పాలమూరు వెనుకబాటు అని విమర్శ
- కృష్ణా వాటా తేల్చమని మోడీనడగాలని వ్యాఖ్య
- కొల్లాపూర్, మహబూబ్‌నగర్‌కు వరాల జల్లు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

సింగోటం చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ... కాషాయ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ప్రారంభోత్సవం చేసిన సీఎం కేసీఆర్, అనంతరం కొల్లాపూర్, సింగోటం క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభల్లో మాట్లాడుతూ 'బస్సులో వస్తున్న సమయంలో ఇద్దరు ముగ్గురు పిల్లలు బీజేపీ జెండా పట్టుకొని బస్సుకు అడ్డం వచ్చారు, ఏం తప్పు చేశాను నేను. ఏం మోసం చేశాం. నేను ...15లో



దేశ రక్షణే కమ్యూనిస్టుల ధ్యేయం

- వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో తన ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ ఇండియా కూటమిలో ఉందనే పేరుతో.. కమ్యూనిస్టులతో పొత్తు ధర్మానికి బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖరరావు తూట్లు పొడిచారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బీజేపీ ప్రమాదకరంగా పరిణమిస్తున్న దశలో కమ్యూనిస్టుల సహాయంతో మునుగోడు ఎన్నికల్లో గట్టెక్కిన కేసీఆర్ ఆ విషయాన్ని మరిచారన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్ బలోపేతం అవుతున్న దృష్ట్యా బీజేపీకి దగ్గరయ్యేందుకే కమ్యూనిస్టులకు దూరమ య్యారని విమర్శించారు. 'అసెంబ్లీలో నిన్ను రక్షిస్తా.. పార్లమెంట్లో నన్ను రక్షించు' అనే రీతిలో బీజేపీ, బీఆర్ఎస్ ఏకమవుతున్నాయన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో తమ్మినేని ప్రసంగించారు.

మునుగోడు ఎన్నికల ఆసరాతో తెలంగాణలో రాజ్యాధికారం కోసం బీజేపీ వ్యూహం పన్నిందని తెలిపారు. ఈ ప్రమాదాన్ని గుర్తించే కమ్యూనిస్టులు కేసీఆర్ విజ్ఞప్తి మేరకు బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చారని చెప్పారు. భవిష్యత్తులోనూ ఈ పొత్తు ధర్మాన్ని కొనసాగించాలన్న కేసీఆర్.. ఆ తర్వాత కాంగ్రెస్ ఉన్న ఇండియా కూటమిలో కమ్యూనిస్టులు ఉన్నారనే సాకుతో తమకు దూరమయ్యారని తెలిపారు. కమ్యూనిస్టులకు ఓట్లు, సీట్లు ప్రధానం కాదన్నారు. కేరళలో కాంగ్రెస్‌తోనే కమ్యూనిస్టులు పోరాడు తున్న విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో కాంగ్రెస్ కమ్యూనిస్టులతో పొత్తును కాంక్షిస్తోందని చెప్పారు. త్వరలో చర్చలు కొలిక్కి వస్తాయన్నారు.

అఖండ భారత పోరాట స్ఫూర్తిని దెబ్బతీసే సిద్ధాంతం బీజేపీదన్నారు. సనాతన ధర్మాన్ని వదలాలన్న ఉదయనిధి స్టాలిన్‌పై బీజేపీ సాగిస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. సనాతన ధర్మం అంటే మనుధర్మం, కుల ధర్మం అన్నారు. భూమి సమస్య సామాజిక అణచివేత, ప్రజాస్వామ్య హక్కుల హరింపుకు వ్యతిరేకంగా సాగిన పోరాటమే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు.

సాయుధ పోరాటంతో బీజేపీకి సంబంధం ఏమిటి? : పోతినేని

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో బీజేపీకి సంబంధం ఏమిటని? సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ప్రశ్నించారు. మత వైషమ్యాల కోసం నీచ ప్రయత్నాలు చేస్తోందన్నారు. సాయుధ రైతాంగ పోరాటాన్ని ముస్లిం రాజుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తుందని విమర్శిం చారు. 38 ఈ కౌలుదారు చట్టాలు, భూ పంపిణీ తదితర చట్టాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనని చెప్పారు. అంతకు ముందు ఖమ్మం నలు మూలల నుంచి ర్యాలీగా ప్రజలు సభా ప్రాంగణానికి చేరు కున్నారు. ఈ కార్యక్రమం లో సీపీఐ(ఎం) సీనియర్ నాయ కులు పి.సోమయ్య, ఎం.సుబ్బారావు, అఫ్రోజ్ సమీన, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వర్‌రావు, వై. విక్రమ్, భూక్యా వీరభద్రం, చింతలచెర్వు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నలుగురు పిల్లలను కాల్వలో విసిరేసిన తల్లి

- ముగ్గురి మృతదేహాలను బయటకు తీసిన స్థానికులు

నవతెలంగాణ- మొఫసిల్

ప్రేమించి పెండ్లి చేసుకున్నారు.. నలుగురు పిల్లలను కన్నారు.. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలతో విసిగిపోయిన భార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాక.. బయటికెళ్లి నలుగురు పిల్లలను కాలువలో విసిరేసి చంపేసింది. ఈ హృదయ విదారక ఘటన నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

బిజినేపల్లి మండలం మంగనూరు గ్రామానికి చెందిన శరబంద, వసూరతండాకు చెందిన లలిత ఎనిమిదేండ్ల కిందట ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. వీరికి మహాలక్ష్మి(5), సాత్విక (4), మంజుల(3), మారుకొండయ్య (ఏడు నెలలు) సంతానం. కాగా, పది రోజుల కిందట దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ గొడవ ముదరడంతో భర్త శరబందపై శనివారం బిజినేపల్లి పోలీసు స్టేషన్‌లో లలిత ఫిర్యాదు చేసింది. అనంతరం స్టేషన్ నుంచి బయటకొచ్చిన లలిత నలుగురు పిల్లలతో కలిసి బిజినేపల్లి మండల కేంద్రానికి సమీపంలోని ఎంజీకేఎల్ఐ కాల్వ వద్దకు వెళ్లింది. పిల్లలను ఆ కాల్వలో విసిరేసింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే కాల్వలోకి దూకి పిల్లల కోసం గాలింపు చేపట్టారు. కానీ లాభం లేకపోయింది. ముగ్గురు చిన్నారులు మహాలక్ష్మి, సాత్విక, మంజుల మృతదేహాలు లభ్యమయ్యారు. ఏడు నెలల పిల్లాడి ఆచూకీ దొరకలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏ పార్టీ చేయని విధంగా పార్టీ సభ్యులకు ఇన్సూరెన్స్ : పద్మాదేవేందర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ఏ రాజకీయ పార్టీ అమలు చేయని విధంగా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ సభ్యులకు ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబాలకు శనివారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మిదేండ్లుగా ప్రాణాలు కోల్పోయిన వేలాది పార్టీ సభ్యుల కుటుంబాలకు రూ.రెండు లక్షల చొప్పున అందించినట్టు తెలిపారు. సభ్యుల ఇన్సూరెన్స్ కోసం రూ.100 కోట్లను బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియం ద్వారా చెల్లించిందని తెలిపారు. ఆయా వర్గాల వారీ కోసం కూడా బీమా పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ 60 లక్షల మంది సభ్యుల కోసం 2023-24 ఏడాదికి రూ.25.54 కోట్లు ప్రీమియం చెల్లించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్సురెన్స్ ఇన్ ఛార్జీ సోమ భరత్ కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 59,890	▲ 220
క్యారెట్లు	- 54,900	▲ 200
కిలో వెండి	- 78,200	▲ 700



చికెన్ ధరలు హైదరాబాద్ బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 117
రిటైల్ (లైవ్)	రూ. 139
స్కిన్‌తో	రూ. 202
స్కిన్‌లెస్	రూ. 229

దళిత సమస్యలపై డిసెంబర్ 4న పార్లమెంట్ మార్చ్

దేశవ్యాప్తంగా కోటి సంతకాలు సేకరణ

- వ్యవసాయ కార్మిక, దళిత సంఘాల నేతల పిలుపు



న్యూఢిల్లీ: దేశంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై డిసెంబర్ 4న పార్లమెంట్ మార్చ్‌కు వ్యవసాయ కార్మిక, దళిత సంఘాల నేతలు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఆగస్టు 26, 27తేదీల్లో జరిగిన నేషనల్ దళిత్ సమ్మిట్ రూపొందించిన మ్యానిఫెస్టోను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కోటి సంతకాలు సేకరిస్తామన్నారు. అన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర స్థాయి సదస్సులు నిర్వహించాలని అన్నారు. శనివారం నాడిక్కడ ఏఐఏడబ్ల్యూయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నేతలు దళిత్ సమ్మిట్ ఆమోదించిన డిక్లరేషన్‌ను విడుదల చేశారు. ఏఐఏడబ్ల్యూయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. విజయరాఘవన్, బి.వెంకట్, దళిత్ శోషణ్ ముక్తి మంచ్ ఉపాధ్యక్షురాలు సుభాషిణి అలీ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని ప్రతి రంగంలో దళితులపై జరుగుతున్న దాడులను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ముఖ్యమైన అంశంగా లేవనెత్తుతామని తెలిపారు. సంక్షేమ పథకాలను ధ్వంసం చేస్తూ ప్రయివేటీకరణ విధానాల అమలు వేగాన్ని పెంచిన మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు దళిత వర్గాలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయన్నారు. దేశంలో వ్యవసాయ కూలీల్లో 60 శాతం మంది దళితులేనని, భూమిలేని వ్యవసాయ కార్మికులను మోడీ ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తున్నదని అన్నారు. ఉపాధి హామీ పథకానికి ఆటంకం కలిగిస్తున్నదని, బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలవల్ల ఉన్నత విద్యారంగంలో దళిత విద్యార్థులు తీవ్ర వేధింపులను ఎదుర్కోవాల్సి వస్తున్నదని విమర్శించారు. దళితులు, ఇతర పేద వర్గాలకు నూతన జాతీయ విద్యా విధానం విద్యావకాశాలను మరింత దూరం చేస్తుందని, మనువాదం, హిందూయిజంపై ఆధారపడిన బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపు నిచ్చారు. దేశంలోని దళితుల డిమాండ్లను ఉమ్మడి ఎజెండాగా రూపొందించాలని కూడా హైదరాబాద్ సదస్సు నిర్ణయించిందన్నారు. కుల గణన కోసం డిమాండ్ బలంగా పెరుగుతుందని, మిగులు భూమిని దళితులకు పంచాలని డిమాండ్ చేశారు. దళితులకు కేటాయించిన భూమిలో ఆక్రమణలపై విచారణ జరిపి రికవరీ చేసేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో కమిషన్‌ను నియమించాలని నాయకులు డిమాండ్ చేశారు.

విలేఖరుల సమావేశంలో డీఎస్ఎంఎం ప్రధాన కార్యదర్శి రామచంద్రడోమ్, గుల్జార్ సింగ్ గోరియా (బీకేఎంయూ), ఎస్. సాయి బాలాజీ (ఏఐఏఆర్ఎల్ఏ), రామ్ మూర్తి (ఏఐడీఆర్ఎం), అసిత్ గంగూలీ (ఏఐఎస్‌కేఎస్), ధర్మేందర్ (ఏఐఏకేఎస్ యు), ఆదికందా (ఎన్సిడిహెచ్ఆర్), విక్రమ్ సింగ్ (ఏఐఏడబ్ల్యూయూ) తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా..

నేడు తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో కాంగ్రెస్ విజయ భేరీ సభ

- వేదికపై సీడబ్ల్యూసీ సభ్యులు, అగ్రనాయకులు
- 50 ఎకరాల్లో సభ ప్రాంగణం, 100 ఎకరాల్లో పార్కింగ్, 5 ఎకరాల్లో మూడు సభావేదికలు
- 700 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- టీపీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో కాంగ్రెస్ నిర్వహించే విజయభేరి సభ వేదిక కాంగ్రెస్ చరిత్రలోనే నిలిచిపోనుంది. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో సీడబ్ల్యూసీ, ఏఐసీసీ సభ్యులు ఒకే వేదికపై కూర్చున్న సందర్భాలు లేవు. ఈ అద్భుత ఘట్టానికి రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో నిర్వహించే విజయభేరి సభ వేదిక కానుంది. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, యువ నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఒకే వేదికపై కన్పించనున్నారు. సుమారు 50 ఎకరాల్లో సభ ప్రాంగణం, వంద ఎకరాల్లో పార్కింగ్, ఐదెకరాల్లో మూడు సభావేదికలు ఏర్పాటు చేశారు. టీపీసీసీ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ఈ సభకు భారీ సంఖ్యలో జన సమీకరణ చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ అగ్ర నాయకులు సమాయత్తం చేశారు. ఈ సభ వేదికగా ఆరు గ్యారంటీలను సోనియా గాంధీ ప్రకటించనున్నారు. అవి ఏంటివి అనే దానిపై రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సీడబ్ల్యూసీ నేతలతో పాటు నలుగురు ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీలు, పీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలు ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. సీడబ్ల్యూసీ సమావేశాలకు హాజరైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ముఖ్య నేతలకు శంషాబాద్ విమానాశ్రయంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఇతర సీనియర్ నాయకులు ఘనస్వాగతం పలికారు. వీరంతా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రత్యేక బస్సులో ర్యాలీగా తుక్కుగూడ సభాస్థలికి చేరుకోనున్నారు. సభకు వచ్చే ముఖ్య నేతలకు దారి పొడవునా ఘన స్వాగతం పలకాలని పార్టీ నాయకులు నిర్ణయించారు. దీనికి తగ్గ ఏర్పాట్లు చేయాలని కింది స్థాయి నాయకులు ఆదేశాలు ఇచ్చారు.

5 ఎకరాల్లో వేదిక.. 500 మందికి అవకాశం

సభ ప్రాంగణంలో ప్రధానంగా మూడు వేదికలు ఏర్పాటు చేశారు. ప్రధాన వేదికపై సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక సహా హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖు, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ భగేల్‌తో పాటు 84 మంది సీడబ్ల్యూసీ సభ్యులు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కూర్చుంటారు. సభ ప్రాంగణానికి కుడి వైపున ఏర్పాటు చేసిన వేదికపై కేంద్ర మాజీ మంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులు కూర్చోను న్నారు. ఎడమ వైపున ఏర్పాటు చేసిన మూడో వేదికపై డీసీసీలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కళాకారులకు కేటాయించారు. ఈ మూడు వేదికల పై సుమారు 500 మందికి పైగా ముఖ్య నేతలు ఉంటారు. కార్యకర్తలకు సోనియా గాంధీ అభివాదం చేసేందుకు ప్రధాన వేదిక నుంచి మీడియా గ్యాలరీ వరకు సుమారు 600 ఫీట్ల పొడవు ర్యాంపు ఏర్పాటు చేశారు. వర్షానికి వేదిక కుంగిపోకుండా కింది భాగంలో కాంక్రీట్ వేశారు. సభా వేదికపై సోనియా, రాహుల్, ఖర్గే సహా తెలంగాణ నుంచి టీపీసీసీ చీఫ్ రేవంత్, సీఎల్పీ నేత భట్టి విక్రమా ర్కలు మాత్రమే ప్రసంగించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

సోనియాగాంధీని సన్మానించనున్న నాయకులు

ప్రత్యేక తెలంగాణ కలను సాకారం చేసిన సోనియాగాంధీ సభకు హాజరుకానున్న నేపథ్యంలో ఈ సభ వేదికపై పార్టీలకు అతీతంగా ఆమెను ఘనంగా సన్మానించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ నాయకులు, విద్యార్థి సంఘాలు, జేఏసీ నాయకులు, పలు ఇతర పార్టీల నాయకుల ఆధ్వర్యంలో సోనియా గాంధీని సత్కరించనున్నట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

700 మందితో బందోబస్తు

సభ ప్రాంగణం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సభకు కాంగ్రెస్ ముఖ్య నేతలంతా హాజరు కానుండటంతో పోలీసులు అప్రమత్తమ య్యారు. ఇప్పటికే ఆ సభా ప్రాంగణాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

తుక్కుగూడకు వచ్చి, వెళ్లే నాలుగు ప్రధాన రహదారులపై భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 27 మంది సీఐలు, 61 మంది ఎస్ఐలు, 600 మంది కానిస్టేబుల్స్ విధులు నిర్వహించనున్నారు.

ఊపిరి తీసుకున్న రోజు

- గవర్నర్ డాక్టర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పూర్వ హైదరాబాద్ సంస్థానం ఊపిరి తీసుకున్న రోజు హైదరాబాద్ లిబరేషన్ డే అని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణ, మరఠ్వాడ, హైదరాబాద్-కర్ణాటక ప్రాంతాలకు స్వేచ్ఛ కోసం పోరాడుతూనే ఉన్నాయని గుర్తుచేశారు. 1948 సెప్టెంబర్ 17న ఈ ప్రాంతాలు విముక్తమయ్యాయని తెలిపారు. ఆ స్వేచ్ఛ కోసం పోరాడిన వారిని ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాలని సూచించారు.

వ్యక్తిగత ప్రయోజనాలతో బదిలీల షెడ్యూల్‌ను ఆటంకపర్చొద్దు

- అడ్డుకునే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి : టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యక్తిగత ప్రయోజనాలతో ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను ఆటంక పర్చొద్దని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) టీచర్లను కోరింది. అకారణంగా ప్రస్తుత బదిలీల షెడ్యూల్‌ను అడ్డుకునే వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎనిమిదేండ్లుగా పదోన్నతులు, బదిలీల్లేక ఉపాధ్యాయులు, విద్యార్థులకు తీరని నష్టం జరుగుతున్నదని తెలిపారు.

షెడ్యూల్ విడుదలైన తర్వాత కూడా ఎనిమిది నెలలుగా రేపోమాపో బదిలీలు, పదోన్నతులు అవుతాయంటూ ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు దాన్ని ఏదోరకంగా ఆటంకం కలిగించేలా, సమస్యాత్మకం చేసి స్వార్థపూరితంగా వ్యవహరిస్తూ కొందరు ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు ప్రయత్నాలు చేయడం శోచనీయమని విమర్శించారు. ఇలాంటి ప్రయత్నాలు సామాన్య ఉపాధ్యాయులను, విద్యారంగ ప్రయోజనాలని దెబ్బతీస్తాయని వారు తెలిపారు. ఎన్నికల డ్యూటీని సాకుగా చూపుతూ లాంగ్ స్టాండింగ్ అయిన పాఠశాలల నుంచి బదిలీని తప్పించుకోవాలనే ప్రయత్నంలో భాగంగా సాంకేతిక కారణాలు చూపి కోర్టు ఉత్తర్వుల ద్వారా ప్రస్తుత బదిలీల నుంచి మేడ్చల్ జిల్లాలోని కొందరు ప్రధానోపాధ్యాయులు (సత్యప్రసాద్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, రవికిరణ్, రాంరెడ్డి, కిషన్) మినహాయింపు పొందడం సోదర ప్రధానోపాధ్యాయులను నివ్వెరపరుస్తున్నదని పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యా యులెవరైనా ఎన్నికల విధుల్లో ఉన్నట్టయితే దానికి ఆటంకం కలుగకుండా ఎన్నికల విధులు ముగిసిన తర్వాత కొత్త స్థానంలో చేరేటట్టు ఉత్తర్వులు ఇవ్వొచ్చని సూచించారు. అధికారులు ఆ విధంగా కోర్టును ఒప్పించే ప్రయత్నం చేయాలని కోరారు. అయితే తాము చేసిన సూచనను సైతం విద్యాశాఖ సంచాలకుల స్థాయి అధికారులు పట్టించుకోకపోవటం ఆశ్చర్యం కలిగిస్తున్నదని విమర్శించారు. ఇలాంటి ఉత్తర్వుల కోసం మరికొంత మంది కోర్టు బాట పట్టే ప్రమాదం కనిపిస్తున్నదనీ, ఇది షెడ్యూల్‌పై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందేమోననే ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మరి కొందరు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులు సీనియార్టీ జాబితాపై కోర్టులో కేసులు వేశారని పేర్కొన్నారు. సీనియార్టీ జాబితా సిద్ధం కాకుండానే, అప్పీల్ చేసుకునే అవకాశం ఉన్నా వాటిని వినియోగించు కోకుండా హైకోర్టును ఆశ్రయించటం సమంజసంగా లేదని తెలిపారు.

అధికారులు అడ్డుకట్ట వేయాలి

సెక్టోరియల్ ఆఫీసర్‌గా మూడేండ్ల కాలానికి బదిలీపై వెళ్లిన మేడ్చల్ జిల్లా కౌకూరు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఆర్నెల్లు తిరగకుండానే దాన్ని రద్దు చేయించుకుని తిరిగి కౌకూరు పాఠశాలలోనే చేరారని వారు పేర్కొన్నారు. ఇది లాంగ్ స్టాండింగ్ బదిలీని తప్పించుకోవడానికేనని స్పష్టమవుతున్నదని తెలిపారు. మూడేండ్ల కాలానికి విధుల్లో చేరిన వారిని డైరెక్టరేట్ అధికారులు ఆర్నెల్లలోనే ఎందుకు రిలీవ్ చేయాల్సి వచ్చిందో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. లాంగ్ స్టాండింగ్‌గా ఆ పాఠశాలలో ఐదేండ్లు పూర్తైనందున సెక్టోరియల్ అధికారిగా వెళ్లి మళ్లీ అక్కడే చేరడంతో లాంగ్ స్టాండింగ్ బ్రేక్ అయ్యి, తిరిగి మరో ఐదేండ్లు అక్కడ ఉండేందుకే ఆ హెచ్ఎం పన్నిన పన్నాగాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులు అర్థం చేసుకోకపోవడం విడ్డూరమని విమర్శించారు. సంచాలకుల స్థాయి అధికారులు ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉత్తర్వుల్లోని సాంకేతిక అంశాల అభ్యంతరాలతో ఆటంకం కలిగించే వారిపట్ల ముఖ్యమైన బదిలీలు, పదోన్నతుల సమయం లో సానుకూలత ప్రదర్శించడం మిగతా ఉపాధ్యాయులకు తీరని నష్టం కలిగి స్తుందని తెలిపారు. వ్యక్తిగత స్వార్థంతో బదిలీలు, పదోన్నతులకు ఆటంకాలు కల్పించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అసోం సీఎం భార్యకు అడ్డగోలుగా లబ్ది

(మొదటిపేజీ తరువాయి)

కొనుగోలు చేశారు. రినికి శర్మ నేతృత్వంలోని మీడియా హౌస్ వంద బీఘాలకు పైగా భూమిని కొనుగోలు చేయడమే కాకుండా ఆ ప్రాంతంలో ఆగ్రో పరిశ్రమను నెలకొల్పుతున్నామంటూ ఆహార ప్రాసెసింగ్ శాఖ నుంచి రూ.10 కోట్లు సబ్సిడీకూడా పొందింది. కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ దీని గురించి ట్వీట్ చేయడంతో ఈ వివాదం బయటకు వచ్చింది. కేంద్ర సబ్సిడీ కింద రూ.10కోట్లు అందుకోవడానికి సంబంధించిన పత్రాన్ని కూడా ఆయన చూపించారు. కేంద్ర ప్రభుత్వం నుండి తాము ఎలాంటి సబ్సిడీ పొందలేదని ముఖ్యమంత్రి చెబుతూ వచ్చారు. పైగా ఈ ఆరోపణలు రుజువైతే ఆ మరుసటి రోజే రాజీనామా చేస్తానని అన్నారు. తొలుత స్థానిక మీడియా ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. రాన్రానూ పెద్ద వివాదంగా మారడంతో ఇక దానిపై దృష్టి పెట్టింది.

రూ.10 కోట్ల పరువు నష్టం దావా వేస్తా : రినికి శర్మ

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, బిజెపి ఎంపి దాస్ పేర్లు కూడా పెట్టండి : గొగోయ్

ఈలోగా గౌరవ్ గొగోయ్ చేస్తున్న రగడకు ఆయనపై రూ.10 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని రినికిశర్మ హెచ్చరించారు. అదే గనుక జరిగితే ఆ పరువు నష్టం దావా పత్రంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, అస్సాం బిజెపి ఎంపి పల్లవ్‌లోచన్ దాస్‌ల పేర్లు కూడా పెట్టాల్సిందిగా గొగోయ్ కోరారు. పార్లమెంట్‌లో దాస్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ గోయల్ ఈ విషయాన్ని బయటపెట్టారని తెలిపారు.

ఆదివాసీల పేరుతో ఆస్తుల విస్తరణ ?

ఆదివాసీల పేరుతో ఆస్తులను విస్తరించుకోవాలని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ భావిస్తున్నారని అంకాలిక్ గణమోర్చాకు చెందిన రాజ్యసభ సభ్యుడు అజిత్ భూయాన్ విమర్శించారు. అక్కడ వున్న ముస్లిములతోపాటు హిందువులు, గిరిజనులు అందరినీ బలవంతంగా తరలించి, తన కుటుంబ సభ్యుల ఆస్తులను విపరీతంగా పెంచుకున్నారని చెప్పారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా తరలింపులు వుంటే ఆమోదయోగ్యమే కానీ హిమంత ప్రభుత్వం న్యాయానికి సంబంధించిన అన్ని చట్టాలను దారుణంగా ఉల్లంఘించిందన్నారు. హిమంత సిఎం అయ్యాకా... ఆయన ఆస్తులు కలియాబార్‌లోనే కాకుండా అనేక ప్రదేశాల్లో రిసార్ట్‌లు, వాణిజ్య సముదాయాలు, టీతోటలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. గౌహతి హైకోర్టుతోసహా ప్రభుత్వ కార్యాలయాలను ఉత్తర గౌహతికి మార్చాలని ప్రతిపాదించారని చెప్పారు. ఆ ప్రాంతాన్ని అర్బన్ సెక్టార్‌గా వర్గీకరించారని, తమ కుటుంబ లబ్దికోసమే సిఎం ఇదంతా చేస్తున్నారని చెప్పారు.

అసెంబ్లీలో చర్చకు స్పీకర్ నిరాకరణ... ప్రతిపక్షాల వాకౌట్

సిఎం భార్యకు ఆయాచిత లబ్దికి సంబంధించి వచ్చిన కథనాలపై చర్చించాలంటూ ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసును 14న స్పీకర్ బిశ్వజిత్ డైమరీ నిరాకరించారు. దీనిని నిరసిస్తూ అస్సాం అసెంబ్లీ నుంచి ప్రతిపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, స్వతంత్ర ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్, సిపిఎం ఎమ్మెల్యే మనోరంజన్ తాలూక్దార్ వాకౌట్ చేశారు.

సీఎం రాజీనామా చేయాలి : కాంగ్రెస్ ఎంపీ

ఈ సబ్సిడీ వివాదంపై ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ సబ్సిడీలనేవి వాస్తవంగా అవసరమున్న రైతులకు, స్థానిక పారిశ్రామికవేత్తలకు అందజేయాలి, కానీ ఇక్కడ ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులే తీసుకున్నారని ఆయన విమర్శించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ఈ లావాదేవీలన్నీ కూడా చాలా వేగంగా జరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పారదర్శకతను పాటిస్తూ, నైతిక ప్రమాణాలు పరిరక్షిస్తూ దర్యాప్తు సాగించాల్సిన అవసరముందన్నారు.

నా భార్య మీడియా సంస్థకు వ్యాపారాలుంటే తప్పేంటి? : సీఎం ఎదురుదాడి

ఈవిషయంలో ఇప్పటివరకు రక్షణాత్మక వైఖరిని ప్రదర్శిస్తూ వచ్చిన సీఎం శుక్రవారం ఎదురుదాడికి దిగారు. రాష్ట్రంలోని అన్ని మీడియా సంస్థలకు వేరే వ్యాపారాలున్నాయని, అలాంటి సమయంలో ప్రైడ్‌కు వుండడంలో తప్పులేదని అన్నారు. ప్రజలు తనపై దాడి చేస్తే పరవాలేదు, కానీ స్వతహాగా పారిశ్రామికవేత్త అయిన తన భార్యను ఈ వివాదంలోకి ఎందుకు లాగుతారని ప్రశ్నించారు.

ముంచుకొస్తున్న ఆహార ద్రవ్యోల్బణం

చేరుకుంది. నిపుణుల హెచ్చరికలు మన దేశంలో గత ఎనిమిది సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా ఈ రుతుపవన సీజన్‌లో ఇప్పటి వరకూ సగటు వర్షపాతంలో 11% లోటు కన్పిస్తోంది. దీంతో రాబోయే రోజులలో ద్రవ్యోల్బణం మరింత పెరగడం అనివార్యమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలు, పప్పులు, వంట నూనెల ధరలు సామాన్యుల వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేయబోతున్నాయి.

ఎన్నికల వేళ ఆందోళన

రాబోయే కాలంలో ఆహార ద్రవ్యోల్బణం అధికంగా ఉంటుందన్న వార్తలు ప్రధాని మోడీని, బీజేపీని ఆందోళనకు గురిచేస్తున్నాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, ఛత్తీస్‌ఘర్ రాష్ట్రాలలో కీలకమైన శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో విజయం సాధించి, హ్యాట్రిక్ కొట్టాలంటే ఈ అసెంబ్లీ ఎన్నికలు కమలనాథులకు అగ్నిపరీక్ష వంటివి. కర్నాటక ఎన్నికల సమయంలో ఇంధన ధరలు...ముఖ్యంగా వంటగ్యాస్ ధర పేదలకు అందుబాటులో లేకపోవడంతో వారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఫలితంగా ఆ ఎన్నికలలో బీజేపీ ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. అయినప్పటికీ డీజిల్, పెట్రోల్ ధరలు మాత్రం అధికంగానే ఉన్నాయి.

అంచనాలు పెరిగితే అనర్థమే

ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ అంచనాలు పెరిగితే పరిస్థితిని తిరిగి గాడిలో పెట్టడం చాలా కష్టం. ఉక్రెయిన్ యుద్ధం గత సంవత్సరం అధిక ద్రవ్యోల్బణ అంచనాలను సృష్టించింది. ఆహార, ఇంధన ధరలు ఆకాశాన్ని తాకడంతో అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణంలో అసాధారణ పెరుగుదల కన్పించింది. వర్ధమాన ఆర్థిక వ్యవస్థలు కోలుకోలేని దెబ్బతిన్నాయి. ఇప్పటికీ అవి ద్రవ్యోల్బణంపై అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నాయి. వాటిలో మన దేశం కూడా ఉంది.

ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో పరిస్థితి కొంత కుదుటపడిందని కొందరు ఆర్థికవేత్తలు అంచనా వేసినప్పటికీ 2019-20 నుండి 2022-23 వరకూ నాలుగు సంవత్సరాల పాటు మన జీడీపీలో కేవలం 3.5% వార్షిక పెరుగుదల మాత్రమే కన్పిం చింది. కోవిడ్ కారణంగా ఆర్థికంగా చిన్నాభిన్నమైన ప్రజల బతుకులు ఇంకా గాడిన పడలేదు. వాస్తవ పరిస్థితి నుండి ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడలకు స్వస్తి చెప్పాలని, పెరుగుతున్న ద్రవ్యోల్బణంపై దృష్టి సారించాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే శుక్రవారం ప్రధానికి హితవు పలికారు. దేశ జనాభాలో 20%గా ఉన్న నిరుపేదలు ప్రభుత్వ దోపిడీ విధానాల కారణంగా ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.

ధరలు మరింతగా పెరుగుతాయని ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో మెజారిటీ ప్రజలు అభిప్రాయపడ్డారు. అయితే పెరిగే ధరలకు అనుగుణంగా తమ ఆదాయాలు మాత్రం పెరగడం లేదని వారు వాపోయారు. ప్రధాని మోడీ మాత్రం జీ-20 సదస్సుతో తన ప్రతిష్ట ఇనుమడించిందంటూ సంబరపడుతున్నారు. ఈ ఊపులో 'భారత్ వెలిగిపోతోంది' తరహాలోనే మరో ప్రచారాస్త్రం సంధించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అయితే అమృత్‌కాల్ వంటి నినాదాలు ప్రజలను ఏ మాత్రం ప్రభావితం చేయలేకపోతున్నాయి. వారికి తాము అనుభవిస్తున్న కష్టనష్టాలు బాగా తెలుసు. ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించి సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొని పాలకులకు తగిన గుణపాఠం చెప్పేందుకు వారు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు.

21 నుంచి డిగ్రీ ఖాళీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

- 25 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు సంబంధించి డిగ్రీ కాలేజీల్లో మిగిలిపోయిన ఖాళీ సీట్ల భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 21 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, విద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ శనివారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 19, 20 తేదీల్లో ఇంట్రా కాలేజీ రెండో విడతకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని తెలిపారు. 21న అందుకు సంబంధించిన సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఈనెల 21 నుంచి 24 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వారు రూ.400 చెల్లించాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయని వారు, రిజిస్ట్రేషన్ చేసుకున్నా ఇప్పటి వరకు సీట్లు పొందనివారు, సీట్లు కేటాయించినా కాలేజీల్లో చేరని వారు అర్హులని వివరించారు. ఈనెల 21 నుంచి 25 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని తెలిపారు. ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులు (వికలాంగులు, సీఏపీ, ఎన్‌సీసీ, ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టీవిటీస్) అభ్యర్థులకు ఈనెల 25న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 29న సీట్లు కేటాయిస్తామని తెలిపారు. అదేనెల 29, 30 తేదీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. ఆయా తేదీల్లోనే కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు.

3 నుంచి స్పాట్ అడ్మిషన్లు

వచ్చేనెల మూడు, నాలుగు తేదీల్లో ప్రయివేటు, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలతో పాటు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని లింబాద్రి, వాకాటి కరుణ తెలిపారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీని తిప్పికొట్టాలి

తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే.. : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-రాజపేట

వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, దున్నేవారికే భూమి కోసం సాగిన వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నడిపిన ఘన చరిత్ర కమునిస్టులది.. దీనికి మతరంగు వేయడానికి బీజేపీ చేసే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా రాజపేట మండలం రేణికుంటలోని చింతలపూరి రాంరెడ్డి విగ్రహం వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చింతలపూరి రాంరెడ్డి పాత్ర గొప్పదని చెప్పారు. సాయుధ పోరాటంలో రామిరెడ్డిని ఎదిరించలేక రజాకార్లు దొంగచాటుగా హత్య చేశారన్నారు. హిందూ భూస్వాములు, ముస్లిం రజాకార్లు ఒక్కటై పేద రైతుల్ని చిత్రహింసలు పెట్టారని.. ఆ సమయంలో కులమతాలకతీతంగా ప్రజలను సాయుధులుగా తీర్చిదిద్ది కమ్యూనిస్టులు జరిపిన పోరాటమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని వివరించారు. ఆనాటి పోరాట ఘటనలకు, బీజేపీ మతం రంగు వేయాలని చూస్తోందని, కుటిల యత్నాలను మానుకుని ఈ ప్రాంత ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) పోరాడుతుందని చెప్పారు. ముందుగా చింతలపూరి రాంరెడ్డి విగ్రహం వద్దకు భారీ ప్రదర్శన నిర్వహించారు. రాంరెడ్డి విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగ నర్సింహులు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, సింగిల్‌విండో చైర్మెన్ భాస్కర్‌రెడ్డి, మదర్‌డెయిరీ డైరెక్టర్ చింతలపూరి వెంకటరామిరెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజ్‌గౌడ్, సభ్యులు బబ్బూరి పోశెట్టి, మండల కార్యదర్శి బబ్బురి శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, పీఎస్ఎం జిల్లా కార్యదర్శి హీర్లపల్లి ముత్యాలు, రాష్ట్ర కమిటీ సభ్యులు రవి, కొండ భిక్షపతి, శివ తదితరులు పాల్గొన్నారు.



వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా సాగినదే సాయుధ పోరాటం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు

గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సభ

నవతెలంగాణ-మియాపూర్

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం సాగినదే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులు మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సభ నిర్వహించారు. ఈ సభలో డీజీ నర్సింహారావు మాట్లాడుతూ.. సాయుధ పోరాటంతో సంబంధం లేని వారు నేడు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. చరిత్రను వక్రీకరించే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాంతంలో జాతి, కులం, మతం, ప్రాంతానికి అతీతంగా నిజాం నవాబుకు వ్యతిరేకంగా నిర్వహించిన మహత్తర పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని గుర్తు చేశారు. ఇంతటి పోరాటాన్ని బీజేపీ, దాని పరివారం కేవలం ముస్లిం రాజుకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటంగా అభివర్ణిస్తున్నాయని విమర్శించారు. ఈ పోరాటానికి బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటంలో కమ్యూనిస్టులు వీరోచితంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. సాయుధ పోరాటంలో అమరులైన వారందరికీ నివాళి అర్పించాల్సిన అవసరం ఉందన్నారు. నాటి చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీకే సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలి

- జేడీ కార్యాలయం ముందు గొర్రెల మేకల పెంపకందారుల ధర్నా

నవతెలంగాణ -కొత్తగూడెం

గొర్రెలు, మేకల పెంపకందారులకు రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం నాయకులు శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జేడీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చల కూర శ్రీను, నాయకులు మల్లె బోయిన లింగయ్య మాట్లాడుతూ.. రెండో విడతలో గొర్రెల పంపిణీ ఇంకా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీడీ కట్టిన గొర్ల, మేకల పెంపకం దారులందరికీ వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని, గ్రామాల్లో రాజకీయ ప్రమేయంతో యూనిట్లు పంచుతున్నారని ఆరోపించారు. తూతూ మంత్రంగా ఒకటి, రెండు యూనిట్లు పంచి అందరికీ ఇచ్చామని ప్రగర్బాలు పలుకుతున్నారని విమర్శించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ జేడీకి మెమోరాండం ఇచ్చారు. జేడీ స్పందిస్తూ.. ఎన్నికలు రాకముందే డీడీ కట్టిన గొర్రెల పెంపకం అందరికీ గొర్రెలు పంచే విధంగా ప్రభుత్వంతో మాట్లాడతానన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకల, పెంపకందారుల సంఘం నాయకులు రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట వారసులు కమ్యూనిస్టులు మాత్రమే..

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ



బోడకొండ ఖిల్లాను సందర్శించిన సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ-మంచాల

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు మాత్రమేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ళ భాస్కర్ అన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సందర్భంగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఎల్లమ్మతండా గ్రామానికి చెందిన గునుకుల మల్లయ్య, గునుకుల సోమయ్యను బోడకొండ ఖిల్లాపై నైజాం రజాకార్లు సజీవ దహనం చేశారు. ఆ ప్రాంతాన్ని శనివారం సీపీఐ(ఎం) బృందం సందర్శించింది. అనంతరం మీడియా సమావేశంలో నేతలు మాట్లాడుతూ.. పన్ను శిస్తులకు వ్యతిరేకంగా రైతులను ఏకం చేస్తున్న గునుకుల మల్లయ్య సోమయ్యను రజాకార్లు బోడకొండ గుట్టపైకి తీసుకెళ్లి అతిదారుణంగా సజీవ ఖననం చేశారని తెలిపారు. తర్వాత ప్రజలంతా ఏకమై రజాకార్ల మూకలతో పోరాటం సాగించారని గుర్తు చేశారు. రాచకొండ కేంద్రంగా కామ్రేడ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అనేక భూ పోరాటాలు జరిగాయని చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో సంబంధం లేని రాజకీయ పార్టీలు నేడు తమ రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. నాడు నిజాంకు వ్యతిరేకంగా పోరాడింది కేవలం కమ్యూనిస్టులేనని గుర్తు చేశారు. ఈ పోరాటంలో నాలుగు వేల మంది అమరులయ్యారని తెలిపారు. మూడు వేల గ్రామాలకు నిజాం రాచరిక పాలన నుంచి విముక్తి లభించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పోరాటానికి మతం రంగు పూసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సాయుధ పోరాట చరిత్రను తెలుసుకుని భవిష్యత్ ఉద్యమాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, బి.సామేల్, మండల కార్యదర్శి నాగిల్ల శ్యామ్‌సుందర్, నాయలకు దుబ్బాక రాంచందర్, కె.శ్రీనివాస్‌రెడ్డి, ఏ.నర్సింహ, ఆర్.జంగయ్య, సిహెచ్.జంగయ్య, జీ.నర్సింహ, పి.అంజయ్య, డి.కిషన్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుమలత తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నుంచి విముక్తి చేసింది కమ్యూనిస్టులే..

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



నవతెలంగాణ జహీరాబాద్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వేలాదిమంది ప్రాణత్యాగం చేశారని, ఈ ప్రాంత ప్రజలను వెట్టిచాకిరీ నుంచి విముక్తి చేసింది కమ్యూనిస్టులేనని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభను సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శనివారం జహీరాబాద్ పట్టణంలోని భీంభవన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సీపీఐ(ఎం) జహీరాబాద్ ఏరియా కార్యదర్శి బి.రాంచందర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో చుక్క రాములు ప్రసంగించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నాలుగువేల మంది కమ్యూనిస్టులు, రైతులు, ప్రజలు నైజాం రజాకార్లు, జాగీర్దారులు, జమీందారులు, భూస్వాముల గూండాల చేతిలో బలయ్యారని గుర్తు చేశారు. అనేక మంది జైల్లో బంధించబడ్డారన్నారు. ఇంతకంటే మహోన్నతమైన పోరాటం భారతదేశంలో ఎక్కడా జరగలేదని వివరించారు. దోపిడీకి, అన్యాయానికి, దౌర్జన్యానికి వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటమన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తోందన్నారు. బీజేపీ ఏరోజూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన లేదని చెప్పారు. కమ్యూనిస్టుల కారణంగానే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. బీజేపీవాదులు ఆంగ్లేయులకు బానిసలుగా ఉన్నారన్నారు. నేటికీ ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంపై మువ్వల జెండా ఎగరదన్నారు.

ప్రజల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకునే రాజకీయం బీజేపీ ప్రభుత్వం ప్రారంభించిందని విమర్శించారు. ఈ విధానాన్ని ప్రజలు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.జయరాజ్, జహీరాబాద్ ఏరియా కార్యదర్శి బి.రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

- సమ్మెను విరమింపజేసేందుకు చర్యలు తీసుకోవాలి
- సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. వారు చేస్తున్న సమ్మెను విరమింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు వారి సమస్యల పరిష్కారం కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు గత 45 ఏండ్లుగా ఐసీడీఎస్‌లో పనిచేస్తున్నారని వివరించారు. పేద ప్రజలకు వివిధరకాల సేవలందిస్తున్నారని తెలిపారు. వారందరూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద మహిళలని పేర్కొన్నారు. నేటికీ కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత వంటి చట్టబద్ధ సౌకర్యాలకు నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చినా పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. కర్నాటకలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. కేరళ, బెంగాల్, అస్సాం తదితర రాష్ట్రాలు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నాయని వివరించారు. శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ గతనెల 18న అంగన్‌వాడీ ఉద్యోగ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తామంటూ నిర్దిష్టమైన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్స్, టీచర్లకు రూ.లక్ష, మినీ టీచర్లు, హెల్పర్లకు రూ.50 వేల చొప్పున ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పెన్షన్, ఈఎస్ఐ వంటి వాటికి సంబంధించి ఎలాంటి స్పందన లేకపోవడంతో విధిలేక సమ్మెకు దిగారని పేర్కొన్నారు. కావున అంగన్‌వాడీ ఉద్యోగుల విషయంలో సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని ప్రధానమైన డిమాండ్ల పరిష్కారంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలనీ, సమ్మెను విరమింపజేయాలని కోరారు.

ప్రధానమైన డిమాండ్లు

- అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి.
- కనీస వేతనం రూ.26 వేలివ్వాలి.
- పెన్షన్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటి సౌకర్యాలు కల్పించాలి.
- ఉద్యోగ విరమణ సమయంలో టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ. ఐదు లక్షలు చెల్లించాలి.
- రిటైర్మెంటు వయస్సును 60 ఏండ్లుగా నిర్ణయించాలి.
- ఐసీడీఎస్ పథకానికి నిధులు పెంచి మరింత బలోపేతం చేయాలి.



శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.తారకరామారావు తెలిపారు. మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు మూడు రోజుల పర్యటన కోసం వచ్చిన 250 మంది రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులతో కేటీఆర్ శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్లలో చేపట్టిన ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలను వివరించారు. విద్యుత్, తాగునీటి సరఫరా సంక్షోభాలను అధిగమించినట్టు తెలిపారు. మౌలిక వసతుల కల్పనతో ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్టు వెల్లడించారు. ఐటీ ఉద్యోగాల కల్పనలో వరసగా రెండో సారి బెంగుళూరు నగరాన్ని హైదరాబాద్ దాటేసిందనీ, ఐటీ ఎగుమతులు, వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర ప్రతినిధులు తెలంగాణ బుల్లెట్ ట్రైన్ కన్నా వేగంగా అభివృద్ధి చెందుతున్నదని ప్రశంసించారు.

ఐఆర్, ఫిట్‌మెంట్ అందించాలి

- కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ - ముషీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఐఆర్ ఫిట్‌మెంట్ అందించి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఐఆర్, ఫిట్‌మెంట్ సాధనకు శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంగ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 40 వేల మంది కాంట్రాక్ట్ పద్ధతిన, సుమారు 90 వేల మంది ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తామని వాగ్దానం చేసి నేటికీ క్రమబద్ధీకరించకుండా అన్యాయం చేస్తోందన్నారు. లక్షా ముప్పై వేల మందికి పైగా ఉన్న ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, డైలీవేజ్ తదితర సిబ్బందిని దశల వారీగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించి కాంట్రాక్ట్ ఏజెన్సీలను రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా వేతనం చెల్లించాలని కోరారు. ఇప్పటికీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్యలో ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతున్నదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. రాష్ట్రం ఏర్పడిన 9 ఏండ్ల కాలంలోనూ నికరంగా, నిబద్ధతతో ఫెడరేషన్ ఉద్యమిస్తున్నదని తెలిపారు. విజ్ఞప్తులు, వినతులతో ఈ ప్రభుత్వం మనగోడు పట్టించుకోదన్నారు.

సంఘటిత, ఐక్యశక్తిగా కదిలితేనే పాలకుల మెడలు వంచగల మని, హామీలు సాధించుకోగలమని అన్నారు. సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 15 వరకు నేటి బహిరంగ సభ ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 20 నుంచి 30 వరకు ఉమ్మడి జిల్లాల ఫెడరేషన్ సదస్సులు, అక్టోబర్ 1 నుంచి 5 వరకు డిమాండ్ బ్యాడ్జీలు, లంచ్ అవర్ డెమోన్‌స్ట్రేషన్‌లు, అక్టోబర్ 12, 13 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 15లోపు డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెతో సమరశీల కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

జె.వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ నియామకాల్లో ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్, ఎన్ఎంఆర్ తదితర వర్కర్లకు ప్రాముఖ్యతనివ్వాలని కోరారు. వారి సర్వీసు ఆధారంగా దశల వారీగా రెగ్యులరైజ్ చెయ్యాల న్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు అమలు చేసిన తేదీ నుంచే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పీఆర్సీ ఇవ్వాలని కోరారు. అలాగే, హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. రూ.10 లక్షలు ప్రమాద బీమా, జీవిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, కృష్ణారెడ్డి, పద్మశ్రీ, కుమార్, మధు సోమన్న, సాంబయ్య, సురేష్, జనమా, పదీష్, సుమిత్ర, జగదీష్, విజయవర్థన్ రాజులు పాల్గొన్నారు.

సింగూర్ గురుకుల విద్యార్థి అదృశ్యం.. ఆత్మహత్య

- ఆరు రోజుల తర్వాత మృతదేహం లభ్యం

నవతెలంగాణ-పుల్కల్:


ఆరు రోజుల కిందట అదృశ్యమైన సింగూరు గురుకుల విద్యార్థి మృతదేహం శనివారం లభ్యమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం అక్సాన్‌పల్లి గ్రామానికి చెందిన భార్గవ్‌ప్రసాద్ పుల్కల్ మండల పరిధిలోని సింగూరు గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 11న ఎవరికీ చెప్పకుండా అతడు పాఠశాల నుంచి బయటకు వెళ్లాడు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ రామకృష్ణ విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు చుట్టుపక్కల, బంధువుల దగ్గర వెతికితే ఆచూకీ లభ్యం కాలేదు. అయితే, శనివారం ఉదయం ఇంటి వెనకాల నుంచి దుర్వాసన వస్తుండటంతోటా ప్రాంతంలో పరిశీలించగా.. భార్గవ్ ప్రసాద్ మృతదేహం లభించింది. మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడు అని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యాలయాల ముట్టడి

కనీస వేతనాట, చట్టపరమైన హక్కుల సాధన, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఉధృత రూపం దాల్చింది. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల క్యాంపు కార్యాలయాలను ముట్టడించారు. ఖమ్మం కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పలు చోట్ల నేతలు, అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు.

ఉధృతమైన అంగన్‌వాడీల సమ్మె

- ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి.. ఉద్రిక్తత
- పలుచోట్ల అరెస్టులు





నవతెలంగాణ- విలేకరులు

సీఐటీయూ, ఏఐటీయూసీ జేఏసీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో నుంచి జిల్లా కలెక్టరేట్ ప్రధాన ముఖద్వారం వరకు ప్రదర్శనగా చేరుకొని బైటాయించారు. కార్యాలయం ప్రధాన ద్వారం ఎక్కి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట, వాగ్వివాదం చోటుచేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం ఐదుగురిని కలెక్టర్ ప్రియాంక అలాతో మాట్లాడించేందుకు తీసుకెళ్లారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన నాయకులు.. సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టే ప్రయత్నం మానుకోవాలని కోరారు. సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వానికి నివేదిస్తానని కలెక్టర్ తెలిపారు. అనంతరం పీడీ విజేత అంగన్వాడీల వద్దకు వచ్చి.. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని ఇప్పటికైనా సెంటర్లకు వెళ్లాలని సూచించడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకూ కేంద్రాలను తెరిచేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్) అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్, అధ్యక్షులు బ్రహ్మాచారి, అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మెకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జైపాల్ మద్దతు తెలిపారు. శేరిలింగంపల్లి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు తరలిస్తున్న వంట సామాగ్రి, బలామృత ప్యాకెట్లను అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. సీఎం కేసీఆర్ మహబూబ్‌నగర్ పర్యటన నేపథ్యంలో ఆమనగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ యూనియన్ టీచర్లు, ఆయాలు, సీఐటీయూ జిల్లా నాయకులు గుమ్మడి కురుమయ్యను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వికారాబాద్ జిల్లా తాండూర్‌లో చేపట్టిన సమ్మెకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలు ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట వంటావార్పు చేపట్టారు. దహెగాం, ముధోల్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో డీసీఎంఎస్ కార్యాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాన్వాయ్‌ని అంగన్‌వాడీ ఉద్యోగులు అడ్డుకుని మంత్రికి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో మంత్రి క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. యాదాద్రి భువనగిరిలో ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నేతలను అరెస్టు చేశారు.



చరిత్రా చైతన్యం

సంపాదకీయం

ప్రజా ఉద్యమ చరిత్ర ఎప్పుడూ చైతన్యాన్ని నింపుతూనే ఉంటుంది. ఎందుకంటే అది దుర్మార్గంపై, దోపిడీపై, అన్యాయంపై తిరగబడే పోరాట చరిత్ర కావున. ఒక సంఘటితమైన జన సమూహపు సజీవ సంఘర్షణాంశం కనుక. బతుకు పోరాట మెప్పుడూ ప్రేరణాత్మకమే. అసలు చరిత్రంతా పోరాటాల ఫలితంగా ఏర్పడినదే. అందుకే సెప్టెంబర్ 17 వినపడగానే ఒక మహోత్తర ప్రజా సమరగాథ ప్రతిధ్వనిస్తుంది. అందుండి విద్యుత్తులా చైతన్యం మన హృదయంలోకి ప్రవహిస్తుంది. తమను తాము విముక్తం చేసుకోవటానికి సాయుధ పోరాటంలోకి ప్రజలు దుమికిన చారిత్రక ఘటనా జ్ఞాపిక అది. 'ఒక వ్యక్తిని మరొక వ్యక్తీ, ఒక జాతిని వేరొక జాతీ పీడించే సాంఘిక ధర్మం ఇంకానా? ఇకపై సాగదు' అంటూ మార్క్స్ సిద్ధాంతం ఆచరణాత్మకంగా రుజువు చేసిన పోరాటపు ఆనవాలు అది. సాంస్కృతిక అణచివేతపై ఎగసిన నిరసన, తిరుగుబాటుతో ఆరంభమై, దోపిడీపై సాయుధ పోరుగా పరిణమించిన సామాన్యుల చరిత్ర అందించే చైతన్యాలు కూడా. అలాంటి చరిత్రను మసిపూయాలని యత్నిస్తే వాస్తవాలు తూటాలై పేలుతాయి. వక్రబుద్ధులను దునుమాడుతాయి.

ప్రపంచ చరిత్రలోనే అరుదైన పోరాటంగా పేరొందిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, 1940కు ముందు భారతదేశంలో ఎక్కడా జరగని మహత్తర విప్లవ పోరాటం. ఇది మొదట భాషా సాంస్కృతిక ఉద్యమంగా ఆరంభమయింది. తమ సంస్కృతీ పరమైన భాష, విద్య, సంప్రదాయాలు, జీవన విధానంలోని వ్యవహారాలు అణచివేయబడటంతో, వాటి పరిరక్షణకు తెలంగాణ నేల తిరుగుబాటుకు బీజం వేసింది. ఈ సాంస్కృతిక చైతన్యోద్యమం భూమి సమస్యను తీసుకుని 'దున్నేవాడికే భూమి' నినాదంతో భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు జెండాను ఎగరవేసింది. ఇది భారతదేశంలోని వర్గ సమస్యను ప్రధాన ఎజెండాలోకి తీసుకువచ్చింది. భారతావని సాధించాల్సిన విప్లవ కార్యాచరణకు ప్రాతిపదికను ఏర్పరచింది. అశేష ప్రజానీకంలో విప్లవ చైతన్యాన్ని నింపి, దిశానిర్దేశం చేసింది. భాషా సాంస్కృతిక ఉద్యమంగా మొదలైన ఈ ఉద్యమం, విప్లవోద్యమంగా మారటంలో కమ్యూనిస్టులు నిర్వహించిన పాత్ర ప్రధానమైనది. చరిత్ర విస్మరణకు తావులేనిది. ఈ రోజు ఎవరు ఎన్ని తీరులుగా దాన్ని వివరించాలనుకున్నా ఎర్రని జెండా రెపరెపలే చరిత్ర పొడుగునా త్యాగాలనద్దుకుని మెరుస్తాయి. సామాన్యుడు సాయుధుడై యోధుడై నిలిచినా, మట్టి చేతుల మనుషులు మహారచయితలుగా ఉద్యమానికి ఉత్తేజాన్ని నింపినా అది అరుణ పతాకకు మాత్రమే సాధ్యమయిన పని. అందుకే 'నీ బాంచన్ కాల్మొక్తా' అన్న అణగారిన వర్గాలు నీ గోరీ కడ్తం కొడకా అని నినదించగలిగారు.

ప్రజలను కదిలించడానికి, చైతన్య పరచడానికి సాంస్కృతికమైన అంశాలు చాలా ఉపయోగపడతాయని ఈ పోరాటం ద్వారా మనం తెలుసుకోవచ్చు. వర్గ పోరాటాన్ని విజయవంతంగా ముందుకు తీసుకుపోవటానికి సాంస్కృతిక అంశాలను జోడించాల్సిన అవశ్యకత నేడు చాలా ఉన్నది. తెలంగాణ సాయుధ పోరాటంలో సకల జనులను కదిలించడానికి ముందు ఈ సాంస్కృతిక ఉద్యమం చాలా పాత్ర నిర్వహించింది. 'ఆంధ్ర మహాసభ' ఒక విశాల ప్రాతిపదికన ప్రజలను జాగరూకపరిచిన సంస్థగా నిలిచింది. నైజాం పాలనలో అందరికీ విద్య అందుబాటులో లేదు. అక్షరాస్యత కేవలం 5శాతం మాత్రమే. ఉర్దూ ఆధిపత్యం రుద్దబడింది. అందుకే గ్రంథాలయోద్యమం, భాషా ఉద్యమం ప్రజలను కదిలించింది. రావిచెట్టు రంగారావు కొమర్రాజు లక్ష్మణరావు, వెంకట రంగారావులు, సురవరం ప్రతాపరెడ్డి, కొండా వెంకటరంగారెడ్డి, మాడపాటి హనుమంతరావులు ఈ కృషిలో ముందున్నారు. 1930లో ఏర్పడిన ఆంధ్రమహాసభ, 1944లో రావినారాయణరెడ్డి ఆధ్వర్యంలో భువనగిరిలో జరిగిన సభ సాయుధ పోరాట చైతన్యాన్ని పొందింది. ఆనాడు జానపద కళలు, సామాన్య కళారూపాలే ప్రజా ఉద్యమానికి, విప్లవ ప్రచారానికి దోహదం చేశాయి. అందులో పాట ప్రధాన ఆయుధంగా తెలంగాణ సాయుధ పోరులో నిలిచింది. ఒక చేతితో గన్నూ, పెన్నూ పట్టిన రచయితలు ఎందరో ప్రజలను ఉత్తేజ పరిచి ఉద్యమంలోకి ప్రేరేపించారు. యాదగిరి, తిరునగరి, సుద్దాల హనుమంతు, మఖ్దూం మొహియుద్దీన్ లాంటి కలం యోధులు ఎందరో... జైలు గోడలపైనే నిజాము నిరంకుశత్వాన్ని ఎదిరించిన దాశరథి, వట్టికోట, ప్రజల జీవనాన్ని బాధలను నాటకం చేసిన సుంకర, వాసిరెడ్డి, కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రపంచ కవులను, కళాకారులను ప్రేరేపించిన పోరాటం ఇది. ఆరుద్ర 'త్వమేవాహం', సోమసుందర్ 'వజ్రాయుధం', దాశరథి 'అగ్నిధార' కావ్యాలను చదువుతుంటే, హరీంద్రనాథ్ చటోపాధ్యాయ పద్యాలను ఉచ్చరిస్తుంటే తెలుస్తుంది సమర తెలంగాణకు సారథులెవ్వరనేది. ఫకీరు సాబు కళారూపంలో బందగీ చరిత్రను విను, 'వేయ్, వేయ్, దెబ్బకు దెబ్బ' అనే సుద్దాల గానం చేసి పల్లవిని అడుగు ఈ నేలను పొంగిన చైతన్యమెవ్వరిదని. ఇప్పటికీ తెలంగాణ వారసత్వంగా మనలోకి ప్రవేహించేది చైతన్యధారనే. అందుకు కారణం వీర తెలంగాణ విప్లవ పోరాటమే.

సాయుధ పోరాట లక్ష్యం ఇంకా మిగిలేవుంది...

> హైదరాబాద్ సంస్థాన విలీనం లేక విమోచనతో గానీ ఏమాత్రం సంబంధం లేని సంఘ్ పరివార్, దాని రాజకీయ సంస్థ అయిన బీజేపీ 'విమోచనదినం' గురించి అదేపనిగా గొంతుచించుకుంటున్నాయి. సెప్టెంబర్ 17 గురించి వీరు చేస్తున్న హడావిడి జుగుప్స కలిగిస్తున్నది. ఎవరినుండి ఎవరు విమోచన పొందారు? విమోచన ఉద్యమానికి పూనుకున్నవారెవరు? దానికి త్యాగాలు చేసినవారెవరు? అని అంటే గుటకలు మింగుతాయి. వారివద్ద ఒక్కటే సమాధానం ఉంటుంది. నిజాం నవాబు ముస్లిం కాబట్టి, సంస్థానంలోని ప్రజలు అత్యధికులు హిందువులు కాబట్టి, సెప్టెంబరు 17న నిజాం పాలన అంతమయినందున ముస్లిం రాజు నుండి హిందూ ప్రజలకు విమోచన జరిగినట్లు చెపుతున్నది. ఇది ఎంత చవకబారు వాదనో వేరే చెప్పనవసరం లేదు. ఆగస్టు 15 రోజును ఇంగ్లండు రాణి విక్టోరియా పాలననుండి హిందూ ప్రజలు విమోచన పొందిన దినంగా ప్రకటిస్తే ఎంత వికృతంగా ఉంటుందో తెలంగాణ విమోచన గురించి బీజేపీ వాదన కూడా అలాగే ఉంది.

> ఫ్యూడల్ నైజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కమ్యూనిస్టుల పాత్రను అంగీకరించడానికి బీఆర్ఎస్‌కుగాని, కాంగ్రెస్‌కుగాని ఇష్టంలేదు. అవి భూస్వాములకు వత్తాసునిచ్చే పార్టీలు. పోరాట కాలంలో గ్రామసీమలలో దొరలు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్‌దార్ల భూములు వేల ఎకరాలను తీసి రైతాంగానికి కమ్యూనిస్టులు పంచిపెట్టారు. కౌల్దార్ల బేదఖళ్ళను అరికట్టారు. వెట్టిచాకిరీని తుదముట్టించారు. ఆడబాపలు, దేవదాసీ వ్యవస్థలను తుదముట్టించారు. కులవివక్షను అడ్డుకున్నారు. ప్రజా ఉద్యమానికి భయపడి పట్టణాలకు పారిపోయిన భూస్వాములు టోపీలు మార్చి సెప్టెంబర్ 17 తర్వాత ధైర్యం తెచ్చుకుని, మిలిటరీ సహాయంతో రైతులనుండి భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు గ్రామాలకు వచ్చారు. రైతాంగం సాధించుకున్న హక్కుల రక్షణ కోసం కమ్యూనిస్టులు 1951 దాకా ప్రతిఘటన కొనసాగించారు. వారి సహాయంతో రైతులు ప్రతిఘటించారు. బడా భూస్వాముల నుండి లక్షలాది ఎకరాలను కాపాడుకోగలిగారు.

సెప్టెంబరు 17న ప్రధాన రాజకీయ పార్టీలన్నీ సభలు, ఇతర కార్యక్రమాలు జరపడానికి సన్నద్ధం అవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ రోజును జాతీయ సమైక్యదినంగా విస్తృతంగా వేడుకలు జరపాలని పిలుపు నిచ్చింది. విమోచన దినోత్సవం పేరుతో బీజేపీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్యఅతిధిగా బహిరంగసభను నిర్వహించనున్నది. కాంగ్రెస్ పార్టీ కూడా ఇదేరోజు ఎన్నికల శంఖారావంగా భారీ సభ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నది. ఈ సభలో సోనియాగాంధీ తదితర నాయకులు పాల్గొంటారని ప్రకటించింది. ఈ పార్టీలు ఇంత హడావుడి చేయడం వెనక నైజాం ఫ్యూడల్ పాలన నుండి తెలంగాణకు విముక్తి జరిగిన సందర్భాన్ని నెమరు వేసుకోవడం కన్నా, రాబోయే శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న యావ ఎక్కువగా కనిపిస్తున్నది. అందుకే ఈ పార్టీలు ఎవరి రాజకీయ, ఎన్నికల అవసరాలకు తగినట్టు వారు సెప్టెంబరు 17 చారిత్రాత్మక సందర్భాన్ని వ్యాఖ్యానిస్తూ, వక్రీకరిస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులోను బీజేపీ, సంఘ్ పరివార్ శక్తులు ఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన వీరోచిత ప్రజాపోరాటానికి మతం రంగు పులిమి దానిని ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు చేసిన తిరుగుబాటుగా అబద్ధాలతో, వక్రీకరణతో చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయి. వీటికి భిన్నంగా కమ్యూనిస్టులు మాత్రమే నిజాం పాలన నుండి హైదరాబాద్ రాజ్య విముక్తి కోసం జరిగిన వీరోచిత రైతాంగ పోరాట వారసత్వాన్ని, వాస్తవాలను ప్రజల ముందుంచుతున్నారు.


బి.వి. రాఘవులు

సెప్టెంబరు 17ను విలీనదినమని, విమోచనదినమని, నవాబు లొంగిపోయిన దినమని... ఎవరి దృక్పథాలను, అవసరాలను బట్టి వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యాఖ్యానాలన్నింటిలో కొన్ని వాస్తవాలు ఉండవచ్చు. సెప్టెంబర్ 17న నైజాం సైనికులు యూనియన్ సైన్యాలకు లొంగిపోయాయి. హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం జేయడానికి నిజాం అంగీకరించాడు. ఆ రకంగా నిజాం పాలననుండి హైదరాబాద్ ప్రజలకు విమోచన కలిగింది. ఈ వివరాలతో ఎవరికీ పేచీ ఉండదు. ఈ వివరాలు మాత్రమే ప్రస్తావించుకుంటే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట గొప్పతనాన్ని మరుగుపరిచే ప్రయత్నమే అవుతుంది. ఇంకాస్త ముందుకుపోయి బీజేపీ, సంఘ్ పరివార్ శక్తులు సెప్టెంబర్ 17 ప్రత్యేకతను ఆసరా చేసుకుని చేస్తున్న దుష్ప్రచారాలు, వక్రీకరణలు తెలంగాణ రైతాంగ త్యాగాలను అవమానపరుస్తున్నాయి.

హైదరాబాద్ సంస్థాన విలీనం లేక విమోచనతో గానీ ఏమాత్రం సంబంధంలేని సంఘ్ పరివార్, దాని రాజకీయ సంస్థ అయిన బీజేపీ 'విమోచనదినం' గురించి అదేపనిగా గొంతుచించుకుంటున్నాయి. సెప్టెంబర్ 17 గురించి వీరు చేస్తున్న హడావిడి జుగుప్స కలిగిస్తున్నది. ఎవరినుండి ఎవరు విమోచన పొందారు? విమోచన ఉద్యమానికి పూనుకున్నవారెవరు? దానికి త్యాగాలు చేసినవారెవరు? అని అంటే గుటకలు మింగుతాయి. వారివద్ద ఒక్కటే సమాధానం ఉంటుంది. నిజాం నవాబు ముస్లిం కాబట్టి, సంస్థానంలోని ప్రజలు అత్యధికులు హిందువులు కాబట్టి, సెప్టెంబరు 17న నిజాం పాలన అంతమయినందున ముస్లిం రాజు నుండి హిందూ ప్రజలకు విమోచన జరిగినట్లు చెపుతున్నది. ఇది ఎంత చవకబారు వాదనో వేరే చెప్పనవసరం లేదు. ఆగస్టు 15 రోజును ఇంగ్లండు రాణి విక్టోరియా పాలననుండి హిందూ ప్రజలు విమోచన పొందిన దినంగా ప్రకటిస్తే ఎంత వికృతంగా ఉంటుందో తెలంగాణ విమోచన గురించి బీజేపీ వాదన కూడా అలాగే ఉంది. హైదరాబాద్ సంస్థానం కన్నా ముందే 1947 అక్టోబర్ 26న కాశ్మీర్ సంస్థానం దేశంలో విలీనమైంది. కానీ బీజేపీ కాశ్మీర్‌లో విమోచన సంబరాలను చేయదు. ఎందుకంటే అక్కడ హిందూ రాజు నుండి ముస్లిం ప్రజలు విమోచన పొందినట్లుగా చెప్పాల్సివస్తుంది. కమ్యూనిస్టుల నాయకత్వాన జరిగిన సమరశీల పోరాటం వలన ట్రావెంకూర్ సంస్థానం 1947 జూన్ 30న యూనియన్‌లో విలీనమయ్యింది. బీజేపీ భాష్యం ప్రకారం అయితే అక్కడ హిందూ రాజుకు వ్యతిరేకంగా హిందూ ప్రజలు పోరాటంలో పాల్గొన్నారని చెప్పాలి. త్రిపుర సంస్థానం 1949 సెప్టెంబర్ 9న కమ్యూనిస్టుల నాయకత్వాన జరిగిన సాయుధ పోరాటం ప్రభావంతో దేశంలో విలీనమైంది. అక్కడ గిరిజన రాజరికానికి వ్యతిరేకంగా గిరిజన ప్రజలు కమ్యూనిస్టుల నాయకత్వాన తిరుగుబాటు చేసారని చెప్పాలి. బీజేపీ వీటి గురించి మాట్లాడదు. ఎందుకంటే మత వక్రీకరణలతో వ్యాఖ్యానించడం కుదరదు కాబట్టి.



నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి త్యాగాలు చేసినవారిలో హిందువులున్నారు. ముస్లింలున్నారు. అన్ని మతాలవారున్నారు. గ్రామీణ సమాజంలోని అన్ని కులాలు, వర్గాలవారున్నారు. అన్నిరకాల భాషల వారున్నారు. నిజాం ఫ్యూడల్ పాలన అన్యాయాలు, అక్రమాలు ఏ తరగతినీ వదిలిపెట్టలేదు. సామాజిక వ్యత్యాసాలన్నింటినీ మర్చిపోయి అందరూ ఐక్యంగా ప్రతిఘటించారు. ఈ ఐక్యతను సాధించడంలో దేశవ్యాపితంగా ప్రజ్వరిల్లిన స్వాతంత్ర్యోద్యమంతో ప్రభావితమైన జాతీయవాదులు, ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు ముఖ్యపాత్రను పోషించారు. ఈ పోరాటంలో ఆర్ఎస్ఎస్ ఎక్కడా కనిపించదు. అది దేశంలో పెల్లుబికిన జాతీయోద్యమానికి దూరంగా ఉంది. బ్రిటిష్ ప్రభుత్వానికి బాసటగా నిలిచింది. దేశంలో ఉన్న సంస్థానాధీశులకు అండగా నిలిచింది. అటువంటి ఆర్ఎస్ఎస్ రాజరిక నిజాం వ్యతిరేక పోరాటంలో ఎక్కడా కనిపించకపోవడం యాదృచ్ఛికం కాదు. ఆనాడు కాంగ్రెస్ కూడా జమీందారీ, సంస్థానాధీశుల ప్రాంతాలలో ఉద్యమాలను



నిరుత్సాహపరిచింది. కాంగ్రెస్ పాల్గొన కూడదని నిర్ణయించింది. అందుకే తెలంగాణ పోరాటంలో కాంగ్రెస్ చురుకుగా వ్యవహరించలేకపోయింది. ఒక రాజకీయ సంస్థగా కమ్యూనిస్టు పార్టీ, అలాగే మరికొన్ని అభ్యుదయ శక్తులు నైజాం ఫ్యూడల్ వ్యతిరేక పోరాటాన్ని నిర్వహించాల్సి వచ్చింది. తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొని, అశేష త్యాగాలు చేసి ఆ బాధ్యతను నిర్వర్తించింది. ఈ వీరోచిత పోరాట ఫలితమే సెప్టెంబరు 17న నిజాం లొంగుబాటైనా, హైదరాబాదు సంస్థానం విలీనమైనా!

కమ్యూనిస్టులను ఖాశీం రజ్వీ నిజాం రజాకార్లకన్నా దుర్మార్గులుగా సంఘ్ పరివార్ శక్తులు చిత్రీకరిస్తాయి. వారికి రైతులు, కూలీలు, వృత్తిదారులు, దళితులు, మహిళలపై భూస్వాములు, వారి గూండాలు చేసే దౌర్జన్యాలు కనిపించవు. నిజాం ఫ్యూడల్ పాలనలో జమీందార్లు, జాగీరుదార్లు అత్యధికులు హిందువులేనన్న విషయాన్ని వారు చెప్పరు. ఫ్యూడల్ దోపిడీకి మతం రంగు అంటదు అని తెలిసినా, గమనించనట్టు నటిస్తారు. ఎందుకంటే ఫ్యూడల్ దోపిడీకి, అణచివేతకు వత్తాసు పలికే వీరు భూస్వాముల రక్షణకు మత వైషమ్యాలే సమర్థమైన సాధనమని నమ్ముతారు.

నైజాం పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కాదు, ఆర్య సమాజం పోరాడిందని చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేసారు. ఆర్య సమాజ్ హైదరాబాద్ సంస్థానంలో మరాట్వాడా ప్రాంతాలలో ఎక్కువగా పనిచేసింది. శుద్ధి కార్యక్రమాలను, హిందూమత హక్కులకోసం కార్యక్రమాలను నిర్వహిస్తూ హిందూమత పునరుద్ధరణ కార్యక్రమాలను నిర్వహించింది. ముస్లిం మత చాందస శక్తులు కూడా రజాకార్ల మద్దతుతో చురుకుగా ఉండేవి. ఈ పరిస్థితి మత వైషమ్యాలకు దారితీసేదిగా ఉండేది. సెప్టెంబర్ 17 అనంతరం ఈ వాతావరణం తీవ్ర మతఘర్షణలకు దారితీసింది. సుందర్‌లాల్ కమిటీ నివేదిక ప్రకారం ఈ ఘర్షణల్లో 40వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఆర్యసమాజ్ ఎప్పుడూ భూస్వాముల జోలికి పోలేదు. వెట్టిచాకిరీ గురించి, ఆడబాపలు, జోగినీ వ్యవస్థ గురించి మాట్లాడలేదు. హిందూ ముస్లిం వ్యత్యాసాన్నే ముందుకు తెచ్చింది. దీనికి పూర్తి భిన్నంగా తెలంగాణలో ప్రజలు కులమతాలతో నిమిత్తం లేకుండా ఐక్యమై ఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా పోరాడినందునే ఎటువంటి మత కలహాలు జరగలేదు. మారణకాండ లేదు. ఇప్పటికి కూడా ఆ మతసామరస్య వాతావరణం కొనసాగడానికి ఆ వారసత్వమే కారణం. అప్పుడు సృష్టించలేని వైషమ్యాలను ఇప్పుడు సృష్టించాలనే దురుద్దేశంతోనే సంఘ్ పరివార్ శక్తులు తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నది.


ఫ్యూడల్ నైజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కమ్యూనిస్టుల పాత్రను అంగీకరించడానికి బీఆర్ఎస్‌కుగాని, కాంగ్రెస్‌కుగాని ఇష్టంలేదు. అవి భూస్వాములకు వత్తాసునిచ్చే పార్టీలు. పోరాట కాలంలో గ్రామసీమలలో దొరలు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్‌దార్ల భూములు వేల ఎకరాలను తీసి రైతాంగానికి కమ్యూనిస్టులు పంచిపెట్టారు. కౌల్దార్ల బేదఖళ్ళను అరికట్టారు. వెట్టిచాకిరీని తుదముట్టించారు. ఆడబాపలు, దేవదాసీ వ్యవస్థలను తుదముట్టించారు. కులవివక్షను అడ్డుకున్నారు. ప్రజా ఉద్యమానికి భయపడి పట్టణాలకు పారిపోయిన భూస్వాములు టోపీలు మార్చి సెప్టెంబర్ 17 తర్వాత ధైర్యం తెచ్చుకుని, మిలిటరీ సహాయంతో రైతులనుండి భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు గ్రామాలకు వచ్చారు. రైతాంగం సాధించుకున్న హక్కుల రక్షణ కోసం కమ్యూనిస్టులు 1951 దాకా ప్రతిఘటన కొనసాగించారు. వారి సహాయంతో రైతులు ప్రతిఘటించారు. బడా భూస్వాముల నుండి లక్షలాది ఎకరాలను కాపాడుకోగలిగారు. అటువంటి భూస్వామ్య శక్తులకు అండగా ఉండే పార్టీలకు ఈ పోరాటం నచ్చుతుందని చెప్పలేము. అందుకే ఈ పార్టీలు కమ్యూనిస్టుల పాత్రను గుర్తించడానికి నిరాకరిస్తాయి.

నైజాం ఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ఆనాడు దేశవ్యాపితంగా ప్రారంభమైన పోరాటాల వెల్లువలో అగ్రభాగాన ఉన్నది. ముఖ్యంగా పున్నప్రవాయిలార్, తెభాగా, వర్లీ, త్రిపుర పోరాటాలు ఈ కోవలోకి వస్తాయి. వీటన్నింటిలో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన పాత్ర పోషించింది. ఈ పోరాటాలు, సంస్థానాలన్నీ దేశంలో విలీనం కావాల్సిన భూమికను సృష్టించాయి. భూసమస్యను, సమాఖ్య రూపం అవసరాన్ని, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, కౌల్దారీ రక్షణ చర్యల అవసరాన్ని రాజకీయ అజెండాలోకి తెచ్చాయి. ఇటువంటి ముఖ్యపాత్ర కమ్యూనిస్టు పార్టీ పోషించినందునే దేశంలో మొదట జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కమ్యూనిస్టులకు బ్రహ్మరథం పట్టారు. అత్యధిక మెజార్టీలతో ప్రజాప్రతినిధులుగా గెలిపించారు. తెలంగాణలో సైతం అత్యధిక స్థానాలు కమ్యూనిస్టులు పోటీ చేసిన పీడీఎఫ్‌కు దక్కడం యాదృచ్ఛికం కాదు. కమ్యూనిస్టుల గురించి అవాకులు చవాకులు మాట్లాడేవారు, ఇప్పుడు సెప్టెంబర్ 17 వారసత్వం గురించి వెంపర్లాడుతున్న పార్టీలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవడం మంచిది.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నైజాం ఫ్యూడల్ పాలన అంతమొందించి యూనియన్‌లో విలీనం కావడంలో ముఖ్యపాత్ర నిర్వహించి పాక్షిక విజయాన్ని సాధించింది. రైతాంగం పొందిన భూమి అత్యధికం తిరిగి భూస్వాముల స్వాధీనం కాకుండా నిరోధించగలిగింది. అయితే భూస్వామ్య వ్యవస్థ కూకటివేళ్ళతో పెకలించి వేయాలన్న లక్ష్యం తెలంగాణలోను, దేశంలో ఇంకా మిగిలే ఉంది. ■

సనాతన జపంతో మోడీ ఎన్నికల పాచిక

రాజకీయ ప్రత్యర్థులను దెబ్బకొట్టడానికి ఇంకా చెప్పాలంటే వారి... దాడినీ, ధాటినీ తట్టుకోవడానికి ఎప్పుడు ఏ అస్త్రం దొరికితే దాన్ని ప్రయోగించడం గొప్ప వ్యూహంగా, సమర్థనీయంగా చలామణి చేస్తుంటారు పాలక నేతలు, మీడియా పండితులు. ప్రతిపక్ష ఇండియా వేదిక సనాతన ధర్మాన్ని నాశనం చేయడానికే పుట్టిందని ప్రధాని నరేంద్రమోడీ మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచార సభలో ప్రకటించడం అలాంటిదే. ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలతో రగులుతున్న ఈ వివాదం నిజానికి మోడీ ప్రాథమిక విధానం, నినాదం. ఆ మాట చెప్పడానికి తిలక్‌నూ, గాంధీజీని, వివేకానందుడినీ అడ్డు పెట్టుకోవడం అలాంటి కుటిల నీతి. ఎందుకంటే భారత రాజ్యాంగం 20 శతాబ్దపు రాజకీయ పత్రమే తప్ప సనాతన ధర్మ పునరుల్లేఖన కాదు. అంతెందుకు మోడీజి ప్రధానిగా దానిపైన లేదా భగవంతుడిపైన అంతఃకరణపైన ప్రమాణం చేయగలరే గాని సనాతన ధర్మంపైన ప్రమాణం చేసే అవకాశమే లేదు. భగవాన్ అని ప్రమాణం చేసినప్పుడు కూడా ఫలానా సనాతన మత విశ్వాస దేవుడిపైన అనే పరిస్థితి అంతకన్నా లేదు. ఇదే ప్రమాణం ఒక సిక్కు లేదా ముస్లిం లేదా క్రైస్తవ ప్రజా ప్రతినిధి చేసినప్పుడు అది వారిదేవుడు లేదా విశ్వాసం ఏదైనా కావచ్చు. మరో హేతువాది చేస్తే అంతఃకరణతో ఆగొచ్చు... రాజ్యాంగమే సనాతన ధర్మాన్ని కొలబద్దగా ఎప్పుడో తిరస్కరించింది. కనుక ఇందుకు పెద్ద చర్చ అవసరమే లేదు. ఇక గాంధీజి, తిలక్ వంటివారి వారసత్వాన్ని మోడీ ప్రస్తావించడం విషయానికి వద్దాం. నిజంగా తిలక్ మహాశయుడు గాంధీకన్నా ముందుతరంలో అగ్రనాయకుడు. కార్మికులను సంఘటిత పరిచినవాడు. ఆయన అరెస్టుపై ముంబాయి కార్మికులు సమ్మె చేస్తే లెనిన్ అభినందిస్తూ లేఖ రాశారు. తిలక్ గణేష్ ఉత్సవాలను దేశభక్తి రగిలించేందుకు ఉపయోగించారు. భగవద్గీత తనను కర్తవ్యనిర్దేశానికి ఉత్తేజపరిచిందని చెప్పారు. కానీ ఎక్కడా ఆయన కులాల వివక్షను సమర్థించిన దాఖలాలు లేవు. గాంధీజి కూడా అంతే... పైగా గీతలో చెప్పిన చాతుర్వర్ణ సిద్ధాంతానికి తనవైన భాష్యాలు చెప్పిన గాంధీ అస్పృశ్యత నివారణ ఉద్యమం ఒక గొప్ప లక్ష్యంగా చేసుకున్నారు. సంస్కరణ కోణంలో మరుగుదొడ్లు శుభ్రపరిచే కార్యక్రమం, దళితుల ఆలయ ప్రవేశం వంటివి స్వాతంత్ర పోరాటంలో కీలక భాగంగా చేశారు. సనాతన ధర్మం మార్చాల్సిన అవసరాన్ని ఆ విధంగా ఆచరణలో చూపించారు. భగత్‌సింగ్ ప్రవేశానికి ముందు జాతీయ సాయుధ విప్లవవాదులు దుర్గాదేవి ముందు ప్రతిజ్ఞ చేస్తుంటే దాన్ని మార్పించారు. ఇందులో ఎక్కడా సనాతన ధర్మ ప్రసక్తిలేదు. స్వాతంత్ర పోరాటం తప్ప.


తెలకపల్లి రవి

మోడీ మాట మార్గం వేరే

స్వాతంత్రం కన్నా సనాతన ధర్మం ఇంకా చెప్పాలంటే హిందూమతమే ముఖ్యమని భావించడం వల్లనే మోడీ మాతృసంస్థ ఆరెస్సెస్ అందుకు దూరంగా ఉండిపోయింది. అందుకు ముస్లిం వ్యతిరేకిత ప్రధాన ప్రేరణ అయింది. మతసామరస్యం బోధించిన గాంధీజీ ఆగర్భశత్రువు అయ్యాడు. రామనామస్మరణ చేస్తూనే గాంధీజీ ప్రాణం విడిచాడని చెబుతున్న మోడీ ఆయన మామూలగా చనిపోయినట్టు మాట్లాడటం దారుణం. జీవితమంతా రామనామస్మరణ చేసిన గాంధీజీ గాడ్సేకు సనాతన వ్యతిరేకిగా కనిపించాడు గనక దారుణంగా కాల్చి చంపేశాడు. అది కూడా ప్రార్థన చేయబోతుండగా ఆపేసి మరీ చంపాడు. మోడీ అన్నట్టు గాంధీజీ రామనామస్మరణతో ఆగలేదు మరి! ఈశ్వర్ అల్లా తేరేనాం అన్నారే? సనాతన ధర్మం కన్నా పరమత ద్వేషం ఎక్కువైన గాడ్సే ఎలా సహిస్తాడు? ఆయన గురువైన వినాయక్ దామోదర్ సావర్కార్ చెప్పింది అదే కదా! గాంధీ, తిలక్ పేర్లు చెప్పే ప్రధాని ఈ వాస్తవాన్ని ఎందుకు మరుగు పరుస్తున్నారు? బీజేపీ నేతలు గాడ్సే దేశభక్తి గురించి మాట్లాడటం, సావర్కార్‌ను పోటీ జాతిపితగా పార్లమెంటులో ప్రతిష్టించడం యాదృచ్ఛికం కాదు. ఈ మతద్వేష భావన కారణంగానే ఉదయనిధి స్టాలిన్ మాటలు అంత తప్పుగా కనిపిస్తున్నాయి. నిజానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచిత భోజన పథకం సందర్భంగా ఒక దేవాలయంలో వివక్ష చూపి దళితులను రానివ్వకుండా దౌర్జన్యం చేసిన ఘటన ఆయనతో ఈ మాటలనిపించిందని తెలుస్తున్నది,

సనాతనం అంటే ఏమిటి? పురాతనం అంటే పాతది. అధునాతనం అంటే ఆధునికమైంది. కానీ సనాతనం అంటే శాశ్వతత్వం లాంటిది. అనాది. కృష్ణుడిని పూజించేటప్పుడు సనాతన అనే పదం కూడా వాడతారు. ఆ కృష్ణుడు కూడా ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే అన్నాడే గాని శాశ్వతంగా ఒకటే ఉంటుందనలేదు. అసలు ధర్మమంటే దుష్టశిక్షణ శిష్ట రక్షణ అని కర్తవ్యం చెప్పాడు. దుష్టం అంటే మనుషులే కాదు పద్ధతులు కూడా. ఆచారాలను పాటించాలనుకున్నా అన్నీ మంచివి కావు, దుర్మార్గమైనవి ఉన్నాయి గనకే దురాచారాలు అన్నారు. వివేకానందుడిని ఉటంకించిన మోడీజీ ఆయన మతాల మధ్య శాఖల మధ్య విభేదాలు ఎంత విపత్కరమో చెప్పిన మాట దాటేశారు. విజ్ఞానశాస్త్రంలో పురోగమనం లేకుండా మూఢాచారాల వెంట పరుగుపెట్టడం వల్లనే భారత దేశం వెనకబడిపోయిందని వివేకానందుడే చెప్పాడు. ఆయన్ను కూడా తమ జాబితాలో చేర్చుకుంది సంఘ్ పరివార్. మోడీ అదే చేశారు. ఇక మరీ కీలకమైంది రాజరామ్మోహనరాయ్ వారసత్వం, దేశ పునరుజ్జీవనంలో అగ్రగణ్యుడైన రామ్మోహన్‌రాయ్ సతీసహగమనంపై వీరోచితంగా పోరాడారే గాని సనాతనమని నెత్తిన పెట్టుకోలేదు. దురాచారాల దురాగతాలను తుదముట్టించిన అగ్ని తరంగం వీరేశలింగం కూడా అదే కోవ. ఈ స్వాతంత్ర యోధులు సంస్కర్తల్లో ఎవరైనా సనాతనం గొప్పదని చెప్పారేమో దేశాధినేత చూపించగలరా? 'భూతకాలపు సరీసృపాలను/ పాత రాతియుగంలో పాతెయ్' అన్న శ్రీశ్రీ



మాటలను నిజం చేశారు. 'రాజుకట్టిన కోట/ రాణి మెట్టిన తోట/ జిల్లేడు మొలచిందిలే/ పల్లేరు పాకిందిలే అని తొలినాటి సంద్రాలు ఇంకిపోతున్న వైనాన్ని చూపారు.(పురిపండా అప్పలస్వామి) వెనకబడితే వెనకేనోయ్ అని గురజాడ అంటే పదండి ముందుకు అని శ్రీశ్రీ పరిగెత్తించారు. ఆ సంస్కర్తల ఆశయరంగం నీవు నిలిచిన ఈ సంఘం అని నారాయణరెడ్డి వంటివారు గానం చేశారు. కాలం ముందుకు పోతుంది తప్ప వెనక్కు నడవదు. అనుమానమున్నవారు గడియారం చూసి తెలుసుకోవచ్చు. ముల్లు వెనక్కుపోదని. ఏ సనాతనం అంటూ శాశ్వతంగా ఉండదని. అరనిమిషం గడిచేసరికదే నాకు గతశతాబ్ది అన్న మహాకవి మాట అదే. సంఘ సంస్కరణ, స్వాతంత్రం పోరాటం, సామ్యవాద భావజాలం త్రివేణీ సంగమంలా ఈ దేశ ప్రజల వికాసానికి విముక్తికి బాట వేశాయి. చంద్రమండలానికి పయనించే స్వావలంబనకు కారణమైనాయి. ఇస్రో శాస్త్రజ్ఞులు వ్యక్తిగతంగా పూజలు చేసి ఉండొచ్చు గానీ అది కూడా విమర్శలను ఎదుర్కొన్నది.

చందమామపై చంద్రమౌళి పేరా?

బీజేపీ ఎంపి జీవిఎల్ నరసింహారావు నాతో ఒక టీవీ చర్చలో ఇస్రో వారి పూజలు సనాతనానికి ఆమోదంలాగా చెప్పడం హాస్యాస్పదమైంది. అయితే అందులోనూ మరో విడ్డూరముంది. పురాణాలు ఈశ్వరుణ్ణి చంద్రమౌళిగా అభివర్ణించాయి. అంటే తలలో చంద్రుడు కలిగివున్నాడని. కాని మానవ చోదిత... నౌకద్వారా చంద్రునిపై దిగిన స్థలానికి మోడీ శివస్థల్ అని నామకరణం చేస్తారు. తలపై ఉన్నవారు కాలూనడం ఏమిటి? ఇక్కడేమన్నా పొంతన కనిపిస్తుందా? పైగాదేశం తరపున జరిపిన ప్రయోగాన్ని ఒక మతానికే ఎలా ఆపాదిస్తారు? సనాతనం పేరిట హిందూత్వను రుద్దడమే ఇక్కడ రహస్యం. ఇంతకూ సనాతనంలో హిందూత్వ పదం ఉందా? సావర్కార్ దాన్ని 1927లో కదా కనిపెట్టింది? అంతా రాజకీయమే. కసిరి బుసకొట్టునాతని గాలి సోక నాల్గుపడగల హైందవ నాగరాజు అని గుర్రం జాషువా హెచ్చరించింది అందుకే. మోడీ సనాతన సమర్థనలో రాజకీయ కోణమదే. మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో దాన్ని రెచ్చగొట్టడానికే ఆయన ఈ ప్రస్తావన తెచ్చారు. దాన్ని సూటిగా తిరస్కరించకపోతే దేశంలో ప్రజాస్వామ్యం సామాజిక చైతన్యం మానవత్వం వంటి మాటలకు అర్థమే ఉండదు .రాజకీయంగా నేరుగా ఖండించడం నష్టమని సన్నాయి నొక్కులు నొక్కే కొందరు మేధావులు దాన్ని నిరాఘాటంగా అనుమతిస్తే మరెంత ఘోరం జరుగుతుందో తెలుసుకోలేని అజ్ఞానంలో చిక్కుకున్నారు. పరోక్షంగా ఆ శక్తులకు పావులవుతున్నారు మోడీని విశ్వగురువుగా కీర్తించేవారు. ఈ మధ్యనే ఆయన కోరి నెత్తునెత్తుకున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఢిల్లీలో జరిపిన చర్చలలో కూడా మానవ హక్కుల రక్షణ గురించి క్లాసు పీకారంటే ఏమనాలి? ఇక్కడ చెప్పకుండా వియత్నాంలో మీడియాకు ఆయన ఈ విషయాలు వెల్లడించారు. ఇక అమెరికాలో మతస్వాతంత్ర్యా పరిరక్షణకు పనిచేసే యుఎస్‌సిఆర్ఎఫ్ నేరుగానే భారత దేశంలో మతస్వాతంత్రంపై దాడులు జరుగుతున్న పరిస్థితిని ప్రస్తావించింది. మత మార్పిడి నిషేధం, గోరక్షణపై వివాదాలు, బిల్లులు, పౌరసత్వ చట్టాల సవరణలు, స్వచ్ఛంద సంస్థలపై మత కోణంలో ఆంక్షలు వంటి పరిణామాలను కూడా పేర్కొంది. ఇండియాను ప్రత్యేకంగా ఆందోళన కలిగించే దేశంగా పరిగణించాలని సిఫార్సు చేసింది. ఇతరులకు నీతులు చెప్పే హక్కు అమెరికాకు ఉందా అనే ప్రశ్న ఒకటైతే, పెరిగిన విద్వేష వాతావరణం అంతర్జాతీయంగా భారతీయులకు తలవంపులు తెస్తున్న వాస్తవం మాత్రం నిజం. వివేకానందుడు అమెరికాలోని చికాగోలోనే దేశ ఔన్నత్యాన్ని చాటి సామరస్య సందేశం ఇస్తే మోడీ సర్కారు ఆ వారసత్వాన్ని తలకిందులు చేస్తున్నది. దీన్ని విమర్శనాత్మకంగా ఎదుర్కోకుండా సన్నాయి నొక్కులు నొక్కితే ప్రయోజనం ఉండదు. ఆలోచనా పరులందరికీ శాంతి ప్రియతములందరికీ ఇది నేటి కర్తవ్యం.

> చివరగా రాజకీయ కోణానికి వస్తే డిఎంకె నాయకుడైన జూనియర్ స్టాలిన్ మాట్లాడిన దానిపై 'ఇండియా' వేదికలో రకరకాల అభిప్రాయాలుండొచ్చు. ఉదాహరణకు ఆప్ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తాను సనాతనవాదాన్ని సమర్థిస్తానన్నారు. ఈ విషయంలో ఏ విధమైన తీర్మానాన్ని గాని, విధానాన్ని గాని ప్రకటించింది లేదు. మతసామరస్యం కోసం మతోన్మాదానికి వ్యతిరేకంగా పనిచేయడం అన్న ఆశయం లౌకిక పక్షాలను ఈ వేదికపై కలిపింది. సమస్యలు పరిష్కరించుకుంటూ సీట్ల పంపిణీపై అవగాహన దిశలో నడుపుతున్నది. ఈ కార్యాచరణే బీజేపీని, మోడీని భయపెడుతున్నది.

ఇండియాకు ఆపాదించనేల?

చివరగా రాజకీయ కోణానికి వస్తే డిఎంకె నాయకుడైన జూనియర్ స్టాలిన్ మాట్లాడిన దానిపై 'ఇండియా' వేదికలో రకరకాల అభిప్రాయాలుండొచ్చు. ఉదాహరణకు ఆప్ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తాను సనాతనవాదాన్ని సమర్థిస్తానన్నారు. ఈ విషయంలో ఏ విధమైన తీర్మానాన్ని గాని, విధానాన్ని గాని ప్రకటించింది లేదు. మతసామరస్యం కోసం మతోన్మాదానికి వ్యతిరేకంగా పనిచేయడం అన్న ఆశయం లౌకిక పక్షాలను ఈ వేదికపై కలిపింది. సమస్యలు పరిష్కరించుకుంటూ సీట్ల పంపిణీపై అవగాహన దిశలో నడుపుతున్నది. ఈ కార్యాచరణే బీజేపీని, మోడీని భయపెడుతున్నది. అందుకే ప్రతిపక్షాలు సనాతన ధర్మాన్ని నాశనం చేయాలనుకుంటున్నాయని అస్త్రం వదిలి మతపరమైన విభేదాలు పెంచాలనుకుంటున్నారు. మతచాందసాలను మూఢనమ్మకాలను దురాచారాలను తప్పక వ్యతిరేకించాల్సిందే గాని ఏ మత విశ్వాసంపైన 'ఇండియా' దాడి చేసే ప్రసక్తి ఉండదు. ప్రతిపక్షాల లౌకిక పార్టీల సమైక్య కదలికతో హడలెత్తిన మోడీ వేసిన పాచిక ఇది. దురాచారాలతో పాటు ఈ దుస్తంత్రాలను కూడా తిప్పికొట్టి ముందుకు సాగడమే ఇందుకు సరైన సమాధానమవుతుంది. ఈ దేశ ప్రజలూ ఆ విధమైన సమాధానమే ఇస్తారని ఆశించాలి. ■

అర్హులకు అందని గృహలక్ష్మి పథకం

అనర్హులను ఎంపికచేశారని మహిళల ధర్నా



నవతెలంగాణ - గన్నేరువరం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న గృహలక్ష్మి పథకం అర్హులకు అందడం లేదని గన్నేరువరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం మహిళలు ధర్నా చేశారు. అనర్హులను గహలక్ష్మి పథకం జాబితాలో చేర్చారని ఆగ్రహం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం కోసం నిరుపేదలైన ఇండ్లు లేని తాము చాలామంది దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఎంపిక చేసిన జాబితాలో సగానికి పైగా సొంత ఇండ్లు ఉన్నవారు, రెండేసీ ఇండ్లు ఉన్నవారు, ఇల్లు కట్టుకొని ఇండ్లలోకి పోయినవారి పేర్లు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసెలో ఉన్నవారిని, నిరుపేదలను విస్మరించి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. విడుదల చేసిన జాబితాను రద్దుచేసి గ్రామసభ నిర్వహించి అర్హులైన నిరుపేదలను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే స్పందించి అర్హులనే జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని.. లేకుంటే మండలంలో తిరగనియ్యబోమని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అనసూర్య, భారతి, సహస్ర, రాజమ్మ పావని, రేణుక, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వీరోచిత త్యాగాలు.. రైతాంగ పోరాటం

- వెట్టికి వ్యతిరేకంగా సామాన్యులే సాయుధులై తిరుగుబాటు
- వీరుల చెరగని జ్ఞాపకాలు.. నిజాం గుండెల్లో ఫిరంగుల మోత
- మానాల కేంద్రంగా గెరిల్లా పోరాటం
- తడియారని జ్ఞాపకం.. కరీంనగర్ పెద్ద గడియారం
- నేడు తెలంగాణ 'విలీన దినం'

చరిత్రలో మరుగున పడిన ఎన్నో విషయాలు ఈ తరం గుర్తించకపోవచ్చు. గడిచిన కాలం నిండా ఎందరో మట్టి మనుషుల వీరోచితమైన త్యాగాలను చరిత్రను మట్టి పదిలం చేసింది. ప్రజలను చైతన్యవంతులను చేసిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాట కాలం 1946 నుంచి 1951అక్టోబర్ దాకా జరిగిన రైతాంగ పోరాటాలు ప్రపంచ విప్లవోద్యమాలకు ప్రేరణగా నిలిచాయి. 3000గ్రామాలను విముక్తి చేయడంతో పాటు లక్షల ఎకరాల భూములను పేదలకు పంచింది. ఆ మహత్తర పోరాటంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి కీలకంగా పనిచేసి ప్రాణాలను తునప్రాయంగా అర్పించిన కమ్యూనిస్టు నాయకులు ఎందరో ఉన్నారు. ఆనాటి సిరిసిల్లలో మాడపాటి హనుమంతరావు అధ్యక్షతన జరిగిన నాలుగవ ఆంధ్ర మహాసభలకు బద్దం ఎల్లారెడ్డి కార్యదర్శిగా పనిచేశారు. జిల్లా పరిధిలోని తొలితరం నాయకులు బద్దం ఎల్లారెడ్డి. సింగిరెడ్డి భూపతి రెడ్డి, గడ్డం తిరుపతి రెడ్డి, అమతలాల్ శుక్లా. కర్రోళ్ల నరసయ్య లాంటి ఎంతో మంది నాయకుల నిస్వార్థమైన త్యాగాలను గుర్తు చేస్తూ నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం..

- నవతెలంగాణ, సిరిసిల్ల రూరల్



రైతాంగ పోరాటంలో అమరులు బద్దం ఎల్లారెడ్డి, అమతలాల్ శుక్ల, కర్రోళ్ల నరసయ్య, గడ్డం తిరుపతి రెడ్డి

ఒకవైపు దేశంలో స్వాతంత్రం కోసం పోరాటాలు జరుగుతున్న కాలం మహాత్మా గాంధీ అహింసాహియుత పోరాటాలతోపాటు ఆనాటి సమాజంలోని ప్రజలు స్వేచ్ఛ స్వాతంత్ర్యాల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న కాలం. దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటాలు ప్రజలకు ప్రేరణ అందిస్తున్నాయి. భారతదేశంలో 1947లో విలీనమైన సంస్థానాలకు భిన్నంగా కాశ్మీర్, గుజరాత్ రాష్ట్రంలోని జూనాగడ్, తెలంగాణ సంస్థానాలు ఉంటాయి. నిజాం నవాబు భారత ప్రభుత్వానికి లొంగిపోయిన 1948 సెప్టెంబర్ 17సంస్థానాన్ని విలీనం చేయక తప్పని పరిస్థితుల వెనుక ఇక్కడ జరుగుతున్న రైతాంగ పోరాటాల ఒత్తిడి ఉన్న విషయం గమనంలో ఉంచుకోవాలి. భారత సైన్యాలు 1951అక్టోబర్ దాకా ఇక్కడ జరిగిన రైతాంగ పోరాటాలను అణిచివేయడం కోసం తెలంగాణ ప్రాంతంలో నెత్తుటేరులు పారించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ తీరుపై ఇప్పటికి మేధావులు విమర్శలు చేస్తూనే ఉంటారు.

బద్దం ఎల్లారెడ్డి...

ప్రధానంగా భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి గ్రామానికి చెందిన బద్దం ఎల్లారెడ్డి తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించారు. రైతాంగ పోరాటాల వ్యాప్తిలో ఆయన కీలకంగా పని చేసినట్లు ఆ తరం నాయకులు చెబుతుంటారు. ముఖ్యంగా రజాకార్ల దాడులను ప్రజలు మూకుమ్మడిగా తిప్పి కొట్టిన కందేన కుంట చెరువు పోరాటం 1947 సెప్టెంబర్ 17న జరిగిన పోరాటాన్ని ప్రస్తావించవలసి ఉంది. గ్రామంలో బద్దం ఎల్లారెడ్డి సోదరునితో సహా పదిమంది గ్రామస్తులు ప్రాణాలను కోల్పోయారు. బద్దం ఎల్లారెడ్డి సాయుధ పోరాట అనంతరం కాలంలో కమ్యూనిస్టు పార్టీ నుండి పార్లమెంటు సభ్యుడిగా అనంతరం శాసనసభ్యుడిగా బాధ్యతలు నిర్వహించి నిస్వార్థమైన ప్రజానాయకుడిగా ఆదర్శంగా జీవించారు.

సింగిరెడ్డి భూపతిరెడ్డి

తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి భూపతిరెడ్డి కమ్యూనిస్టు విలువలకు ప్రతిరూపంగా నిలిచారు. ధనిక రైతు కుటుంబం నుంచి వచ్చిన భూపతి రెడ్డి తనకున్న భూములను ప్రజలకు పంపిణీ చేశారు. తొలి ఎన్కౌంటర్‌గా చరిత్రలో నిలిచిన హుస్నాబాద్ ప్రాంతంలోని మహమ్మదాపూర్ గుట్టల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో నిజాం రజాకార్లతో పోరాడుతూ ప్రాణాలు విడిచారు.

గడ్డం తిరుపతి రెడ్డి, రాఘవరెడ్డిలు

ధనిక రైతు కుటుంబాన్ని నుంచి వచ్చిన గడ్డం తిరుపతిరెడ్డి, రాఘవరెడ్డి సోదరులు చందుర్తి మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన వాళ్లు. తెలంగాణ సాయుధ పోరాటంలో తిరుపతిరెడ్డి, రాఘవరెడ్డి సోదరులు చేసిన సాహసాలను ఈ ప్రాంతంలో కథలు కథలుగా చెప్పుకుంటారు. పోరాట కాలంలో నిజామాబాద్ జైలు నుంచి తిరుపతి రెడ్డి సోదరులు తప్పించుకున్న తీరు అప్పట్లో ఈ ప్రాంతంలోని గెరిల్లా యోధులకు ఆదర్శంగా నిలిచిందని ఈ ప్రాంత ప్రజలు చెప్పుకుంటారు. జీవితమంతా ప్రజల కోసమే ధారబోసిన తిరుపతి రెడ్డి, నారాయణ రెడ్డిలు కమ్యూనిస్టులుగా తమ జీవితాలను ఈ తరానికి ఆచరణగా అందించారు.

అమృత్ లాల్ శుక్లా..

అమృత్ లాల్ శుక్లా ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే తెలంగాణ సాయుధ పోరాటంలో భాగమై సాగిండు. ఉపాధ్యాయ వృత్తిని వదిలేసి ఆనాడు రైతాంగ పోరాటాలు నిర్మిస్తూ దళ నాయకుడిగా సిరిసిల్ల కేంద్రంగా ఎన్నో విరోచితమైన సాహసాలు చేసినట్టు ఆ తరం నాయకుల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ చెబుతున్న మాట. ప్రధానంగా రుద్రంగి గ్రామంలో నిజాం మూష్కరులతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒకే తూటాతో ఇద్దరినీ హతమార్చిన విషయాన్ని ఈ ప్రాంతంలో ఇప్పటికీ ప్రజలు గుర్తు చేసుకుంటారు. తెలంగాణ సాయుధ పోరాట విరమణ అనంతరం అమృత శుక్లా శాసనసభ్యులుగా పీడీఎఫ్ నుంచి శాసనసభ్యులుగా గెలుపొంది ప్రజలకు సేవలు అందించారు.

కర్రోళ్ల నరసయ్య..

సమాజంలోని అట్టడుగు వర్గాల నుంచి తెలంగాణ సాయుధ పోరాటంలో దళసభ్యుడిగా మొదలై అనేక పోరాటాల్లో భాగమై సాగిండు. కొనరావుపేట్ మండలం మల్కాపేట్ గ్రామానికి చెందిన నరసయ్య సాధారణ జీవితాన్ని ప్రజలతో మమేకమైన తీరును ఇప్పటికీ గుర్తుచేస్తూనే ఉంటారు. పిడిఎఫ్ నుండి ఆయన కూడా నేరెళ్ల నియోజకవర్గ శాసనసభ్యులుగా గెలుపొంది ప్రజలకు సేవలు అందించారు. అదే తరానికి చెందిన కొనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన చెన్నమనేని రాజేశ్వరరావు సిరిసిల్ల నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా నాలుగుసార్లు గెలుపొందారు. బోయినపల్లి మండలం మనువాడ గ్రామానికి చెందిన శ్రీనివాసరావు కూడా సేవలు అందించారు. ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎంతోమంది ఈ ప్రాంతం నుంచి సామాన్య ప్రజలు నాయకులుగా ఎదిగి వచ్చిన పరిస్థితి ఉంది.

చాందా క్యాంపులో మంథనివాసులు

ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ రాష్ట్రాన్ని విలీనం చేయాలని పోరాటంలో మంథనికి చెందిన పదిమంది రెండేళ్లు అజ్ఞాతంలో ఉన్నారు. సుభాష్ చంద్రబోస్ పోరాటస్ఫూర్తితో ఇక్కడివాసులు స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమం మహారాష్ట్రలోని చాందాలోని శిక్షణ పొందారు. మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు ఆధ్వర్యంలో నడిచిన క్యాంపులో పని చేశారు. ఇండియన్ యూనియన్ ఆధ్వర్యంలో గెరిల్లా, ఐఎన్ఎ శిక్షణపొంది పోలీస్ స్టేషన్లు, నాకా లపై దాడులు, రోజుల తరబడి దట్టమైన అడవుల్లో తలదాచు కున్నారని కిష్టయ్య వివరించారు.



మానాల అడవుల్లో ప్రజలతో సమావేశమైన తెలంగాణ సాయుధ పోరాట దళం

నిజాంకు గుబులు పుట్టించిన గట్టెపల్లి బిడ్డ

గట్టెపల్లి ముద్దబిడ్డా మురళీధర్రావు రజాకార్ల నిరంకుశ పరిపాలనకు ఎదురొడ్డాడు. సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామానికి చెందిన మురళీధర్రావు కమ్యూనిస్టు సాయుధ దళ సభ్యుడిగా పనిచేశారు. అనభేరి ప్రభాకర్‌రావు సాయంతో రజకార్లపై ఎన్నో దాడులు నిర్వహించారు. 1943లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. హుస్నాబాద్ సమీపంలో అనభేరి నాయకత్వంలో సైన్యాన్ని ఎదిరించినప్పుడు జరిగిన ఎన్‌కౌంటర్‌లో మురళి గుట్టపై నుంచి దూకి తప్పించుకున్నాడు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ విలీనమైనా.. జమీందారు వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాడు. రజాకార్లపై అలుపెరగని పోరాటం చేసి 1988, జూన్ 2న మరణించాడు.



తెలంగాణ సాయుధ కాలంలో మానాల అటవీ ప్రాంతంలో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరం

తడియారని జ్ఞాపకం.. పెద్ద గడియారం

ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనమైన తీరు చరిత్రాత్మకం. కరీంనగర్‌తోపాటు జిల్లావ్యాప్తంగా వేలాదిమంది ఈ పోరులో ఆసువులు బాశారు. 1947 సెప్టెంబర్ 2న పెద్దగడియారం ప్రదేశంలో జె.రామేశ్వరరావు, హన్మంతరావు, జె.మురళీధర్రావు ఆధ్వర్యంలో జాతీయ పతాకాలతో నినాదాలు చేశారు. వారిని పోలీసులు జైలుకు పంపించారు. జిల్లాకు చెందిన జేఆర్. గోపాలరావు హైదరాబాద్ విద్యార్థి సంఘంలో చురుకైన కార్యకర్త. బీఏ ఫైనల్ చదువుతూ క్విట్ కాలేజ్ ఉద్యమంలో భాగంగా కాలేజీలు బహిష్కరించారు. జువ్వాడి గౌతమ్రావు ఉద్యమంలో జిల్లా ఇన్చార్జి. తనదగ్గర ఉన్న 50 మంది లిస్టు ఆధారంగా గోపాలరావుతో సహా 30మందిని పోలీసులు అరెస్టు చేశారు. బోయినపల్లి వెంకటరామారావు అజ్ఞాతానికి ముందు బెజ్జంకిలో ఒక గ్రంథాలయాన్ని, హరిజన పాఠశాలను నిర్వహించి ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. కరీంనగర్‌కు చెందిన జె.దామోదర్రావు, జేఆర్ గోపాలరావు, పి.రామారావు, చాందా క్యాంపు ఇన్చార్జిలుగా పనిచేశారు. నిజాం నిరంకుశత్వాన్ని ప్రపంచానికి చాటేందుకు కరీంనగర్లో ఆర్య సమాజం ఏర్పడింది. దీనికి అధ్యక్షుడిగా శివనారాయణ పనిచేశారు.

నిజాం గుండెల్లో 'రణభేరి'

నిజాం గుండెల్లో రణభేరి మోగించిన అనభేరి ప్రభాకర్‌రావు 1910ఆగస్టు 15న తిమ్మాపూర్ మండలం పొలంపెల్లిలో జన్మించారు. పేదలకు భూమి, భుక్తికోసం జాగీర్ దార్ వ్యవస్థకు వ్యతిరేకంగా గ్రామాల్లో విస్తతంగా ప్రచారం చేశారు. ఒకదశలో నిజాం నవాబ్ తాలుకాదారు కలెక్టర్ పదవి ఇస్తానన్నా కాలదన్ని ప్రజలపక్షాన పోరాటం చేశారు. ప్రభాకర్రావుపై నిజాం ప్రభుత్వం 'నజర్ బంద్' హుకుం జారీ చేసింది. ప్రభాకర్రావుని పట్టుకోవడానికి ప్రత్యేక మిలటరీ ఫోర్సును ఏర్పాటు చేసింది. 1948 మార్చి 14న ప్రభాకర్ సాయుధ దళాన్ని హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ పోలీస్ పటేల్ భోజనానికి పిలిచి ఆ సమాచారాన్ని నిజాం ప్రభుత్వానికి అందించారు. మహ్మదాపూర్ గుట్టలను మిలటరీ, రజాకార్లు చుట్టుముట్టారు. అనభేరి గెరిల్లాదళంపై పోలీసులు కాల్పులు జరిపారు. వారి తూటాలకు ఎదురొడ్డి పోరాడి 'అనభేరి'తో పాటు మరో పదిమందికి పైగా ఉద్యమం కోసం ప్రాణాలు అర్పించారు.

ఇంకా ఎందరో వీరుల చరిత్రను వెలుగులోకి తేవాల్సి ఉంది. సెప్టెంబర్ 17ను గుర్తు చేసుకోవడం అంటే కమ్యూనిస్టు నాయకుల నిస్వార్థ ప్రజా జీవితాన్ని అసమానమైన వారి త్యాగాలను మననం చేసుకోవడమేనని చెప్పుకోవచ్చు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

నవతెలంగాణ - కరీంనగర్ : విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను (అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్, సిస్టం అనలిస్ట్, టెక్నికల్ పర్సన్స్, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్, యుఆర్ఎస్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, ఎంఐఎస్, డాటా ఎంట్రీ ఆపరేటర్, డీఎల్ఎంటీ మెసెంజర్, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్స్, ఐఈఆర్ పీ) వెంటనే రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు మినీమం టైం స్కేల్ అమలు చేయాలని శనివారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం 16వ రోజుకు చేరుకున్నాయి. టీపీసీసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మద్దతుగా వచ్చి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం శ్రీనివాస్, సీఆర్పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా రాజిరెడ్డి, ఎంఐఎస్‌లు దీప్తి, సుకన్య, రజని, కంప్యూటర్ ఆపరేటర్ల జిల్లా అధ్యక్షులు జిలాని, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్లు కనుకుల రమేష్, మహేష్, అశోక్, అయోధ్య, డీపీఓ స్టాఫ్ శ్రీనివాస్, ప్రభాకర్, అన్ని మండలాల నుంచి 450 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - గంగాధర : సబ్బండ వర్గాల సంక్షేమం సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే సాధ్యమని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని శుభమస్తు ఫంక్షన్ హాలులో జరిగిన చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల బ్యాండ్ కళాకారుల ఆత్మీయ సమ్మేళనం సుంకె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత ఎన్నికల్లో మద్దతు ఇచ్చినట్లుగానే ఈ ఎన్నికల్లోనూ బ్యాండు కళాకారుల సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. మీ ఇంటి బిడ్డను, మీ అన్న గా నాకు అండగా నిలవాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి రైతుబంధు, రైతుబీమా, రైతు రుణమాఫీ, 24 గంటలు ఉచిత కరెంటు, ఆసరా పెన్షన్లు వంటి బృహత్తర సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నట్టు చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా నిలుస్తుందని అన్నారు. ఎటు చూసినా కాళేశ్వరం నీళ్ల, ఎర్రటి ఎండాకాలంలో మత్తడి దుంకుతున్న చెరువులు, పచ్చని పంటలతో కళకళలాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల బ్యాండ్ మేళాల కళాకారులు, ఆయా గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి వీడాలి

కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిరసన



నవతెలంగాణ - కరీంనగర్ : అంగన్వాడీ టీచర్స్, ఆయాలు జాయింట్ ఆక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆరు రోజుల నుంచి కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట సమ్మెలో భాగంగా శనివారం మోకాళ్లపై కూర్చుని ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రజిత, డి.రజిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి అంగన్వాడీ టీచర్స్, ఆయాల జేఏసీతో చర్చలు జరపాలన్నారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం అమలు చేయాలని, గ్రావిటీ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మెకు ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.దామోదర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రజిత, డి.రజిత, జిల్లా నాయకులు అనురాధ, విజయ, రాజా దేవి, సంధ్య, అరుణ, శారద, ప్రేమలత, అంజలి, రాజేశ్వరి పాల్గొన్నారు.

తక్షణమే రేషన్ కార్డులు ఇవ్వాలి

డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి



వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్ : రాష్ట్రంలో తక్షణమే నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. తొమ్మిది సంవత్సరాల కాలంలో నూతన రేషన్ కార్డులు, పిల్లల పేర్లు రేషన్ కార్డులో చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం వల్ల అర్హులైన వారు సంక్షేమ పథకాలు, ఆరోగ్యశ్రీ వైద్యసేవలు తీసుకోవడంలో నష్టపోతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేష్ పటేల్, తిరుపతి, జిల్లా నాయకులు రాజుతో కలిసి వినతిపత్రం అందించారు.

మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణ

కలెక్టర్ డాక్టర్ బి.గోపి



నవతెలంగాణ - కరీంనగర్ : గణేష్ నవరాత్రులలో మట్టితో చేసే గణపతి విగ్రహాలను మాత్రమే వాడాలని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించగలమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి తెలిపారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో పర్యావరణ విభాగం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ భిక్షపతి, సహాయ ఇంజనీర్ సిహెచ్.వీరేష్, సహాయ సైంటిస్టు కనకజ్యోతి, కలెక్టరేట్ ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రులకు అన్ని ఏర్పాట్లు చేయాలి

49వ డివిజన్ కార్పొరేటర్ సోహన్ సింగ్ కమల్జిత్ కౌర్

నవతెలంగాణ - కరీంనగర్ : వినాయక చవతి నవరాత్రులకు అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు 49వ డివిజన్ కార్పొరేటర్ సోహన్ సింగ్ కమల్జిత్ కౌర్ కోరారు. నగరంలో వినాయక చవితి సందర్భంగా 49వ డివిజన్, 51వ డివిజన్‌కు దేవుని దర్శనాలకు వచ్చే నగర ప్రజలు, రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి కమాన్ చౌరస్తాకు వెళ్లే దారిలో సీసీ ప్యాచ్ వర్క్, సిక్కు వాడి మెయిన్ రోడ్డు అధ్వానంగా మారి నగర ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. సమస్యలు పరిష్కరించి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

పంట రుణమాఫీపై రైతులకు అవగాహన



నవతెలంగాణ - చొప్పదండి : పంట రుణమాఫీ పైన చొప్పదండి మండలంలోని అన్ని రైతు వేదికల్లో శనివారం చొప్పదండి మండల వ్యవసాయ అధికారి వి.వంశీకృష్ణ అన్ని బ్యాంకు మేనేజర్లతో రైతులకు అవగాహన కల్పించారు. చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 867 మంది రైతుల పంట రుణాల కోసం 5,29,86000 రూపాయలు పంపించగా, ఇప్పటివరకు 515 మంది రైతులకు రూ.2,30,45,757 వచ్చిందని, ఇంకా 352మంది రైతులకు రూ.2,99,40,243 రావాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, సింగిల్‌విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, కౌన్సిలర్ గంగారాజు, ఎస్బిఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, కేడీసీసీబీ బ్యాంకు మేనేజర్లు, రైతులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల హామీలు నెరవేర్చకుంటే మళ్లీ సమ్మె చేస్తాం

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ - ఇల్లందకుంట : గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే అక్టోబర్ 2 నుండి నిరవధిక సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. ఈ మేరకు ఇల్లందకుంట ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేసి ఆయన మాటాడారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ (జేఏసీ) ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు 34రోజులు సమ్మె చేశారన్నారు. తెలంగాణ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమ్మె విరమించి చర్చలకు వస్తే సమస్యలు పరిష్కరిస్తా మని మాట ఇచ్చి ఇప్పటివరకు ఏ హామీని నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా జేఏసీ నాయకులతో జరిపిన చర్చలను అమలు చేసి కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని, లేని పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా మళ్లీ సమ్మె చేయడానికి కార్మికులందరి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి సంపత్, మండల అధ్యక్షుడు మల్లయ్య, బాబు, ఐలయ్య, కార్మికులు పాల్గొన్నారు.

కరీంనగర్-వరంగల్ హైవే పనులపై ఎంపీ సమీక్ష



ఎన్‌హెచ్ విభాగం అధికారులతో మాట్లాడుతున్న బండి సంజయ్

నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్-వరంగల్ (ఎన్‌హెచ్-563) జాతీయ రహదారి పనుల విస్తరణ పనుల ప్రగతిపై కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎన్‌హెచ్ విభాగం అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. సమావేశానికి జాతీయ రహదారుల అథారిటీ పీడీ మాధవి, మోహనాచారి, కమలేశ్, త్రిపాఠి, నిర్మాణ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కరీంనగర్-వరంగల్ (ఎన్‌హెచ్-563) జాతీయ రహదారి పనుల విస్తరణ పనులు ఎంత వరకు వచ్చాయనే వివరాలను బండి సంజయ్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంపై ఆరా తీశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసిన బండి సంజయ్ నిర్ణీత వ్యవధిలోనే విస్తరణ పనులను పూర్తి చేయాలని కోరారు. ఇందుకోసం అవసరమైన సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

చరిత్రను వక్రీకరిస్తే కాలగర్భంలో కలిసిపోతారు

- రైతాంగా సాయుధ పోరాటం స్ఫూర్తితో ఉద్యమాలు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి
- జమ్మికుంటలో వారోత్సవాల సభ

నవతెలంగాణ - జమ్మికుంట : భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం నాడు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మతం రంగు పులిమి చరిత్రను వక్రీకరిస్తే బీజేపీకి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో కొప్పుల శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశత్వానికి, దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలే సాయుధులై తిరగబడి 3000 గ్రామ స్వరాజ్యాలను ఏర్పాటు చేసుకొని, 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేసి 4000 మంది అమరులైన రైతాంగ పోరాటం చరిత్ర అసాధారణమైందన్నారు. నాడు తెలంగాణలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలు స్వచ్ఛందంగా తిరుగుబాటుకు నాయకత్వం వహించింది ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని తెలిపారు. రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల భూమి పంచి నాలుగున్నర వేల మంది అమరవీరులను రక్త తర్పణ చేసి, వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తే కేంద్రంలో ఉన్న బీజేపీ పాలకులు ఈ పోరాటాన్ని విమోచన దినంగా పేర్కొంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు చేసిన పోరాటంగా తప్పుడు వక్రీకరణలు చేయడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ సమైక్యతను ప్రజల ఐక్యతను దెబ్బతీస్తూ, మత ప్రాతిపదిక మీద ఈ దేశ, ఈ రాష్ట్ర ప్రజలని విడగొట్టాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదని.. రాష్ట్ర ప్రజలందరూ దీనిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో, భూ పోరాటాలు ఇండ్ల స్థలాల పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నికరమైనటువంటి రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని.. ఈ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరని స్పష్టం చేశారు. ముమ్మాటికి నాటి సెప్టెంబర్ 17 విలీన దినమేనన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జోన్ కార్యదర్శి శీలం అశోక్, జోన్ కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, దండిగారి సతీష్, బాసిర సంపత్‌రావు, తిప్పరబోయిన శ్రీకాంత్, జక్కుల రమేష్, నాయకులు రావుల ఓదెలు, బిజిగిరి శ్రీకాంత్, మారేపల్లి కిరణ్, గీరా రాజకుమారి, కన్నం సదానందం, సారయ్య మల్లయ్య, వైకుంఠం, రవీందర్రావు, పి.అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి



హాజరైన కార్యకర్తలు

కల్లుగీత కార్మికులకు సేఫ్టీ మోకు, బైకులు ఇవ్వాలి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి

నవతెలంగాణ - కరీంనగర్ : కల్లుగీత సొసైటీలలో టీఎఫ్‌టీలలో సభ్యత్వం ఉన్న వాళ్లందరికీ మోటారు బైకులు, సేఫ్టీమోకులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ప్రజాసంఘాల కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకుడు తాళ్లపల్లి తిరుపతి అధ్యక్షతన జిల్లా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూడిద గోపి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు కరీంనగర్ జిల్లా కేంద్రంలో నీరా ఉత్పత్తుల తాటి ఉత్పత్తుల కేంద్రాలను నెలకొల్పి కల్లుగీత నిరుద్యోగ యువతను, మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ద్వారా శిక్షణను ఇచ్చి కల్లుగీతను పరిశ్రమగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గీతకార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న హైదరాబాద్‌లో జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవీందర్‌గౌడ్ మాట్లాడారు. అనంతరం కరీంనగర్ జిల్లా నూతన కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా తాళ్లపల్లి తిరుపతిగౌడ్, కో కన్వీనర్‌గా కొమిరి నవీన్ కుమార్ గౌడ్, కమిటీ సభ్యులుగా గోలి మనీష్ కుమార్, మడ్డి శ్రీకాంత్, బండి గంగ మల్లు, చిన్నం శ్రావణ్ కుమార్ గౌడ్, బండి శ్రీనివాస్ గౌడ్, మేకల మహేష్ గౌడ్, పచిమట్ల లింగమూర్తి, నేలం తిరుపతి గౌడ్, తాళ్లపల్లి కిషోర్ గౌడ్, గిరగాని విజయగిరి గౌడ్, విగ్నేష్ గౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం 'హలో గీతన్న చలో హైదరాబాద్' పోస్టర్‌లు ఆవిష్కరించారు.

రైతు రుణమాఫీపై సదస్సులు

నవతెలంగాణ - తిమ్మాపూర్ :

మండలంలోని నుస్తులాపూర్, తిమ్మాపూర్, మల్లాపూర్, పర్లపల్లి, రేణికుంట రైతు వేదికలలో పంట రుణమాఫీపై వ్యవసాయ అధికారులు శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. సంబంధిత గ్రామాల్లో బ్యాంక్ అధికారులు పాల్గొని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సురేందర్, ఉద్యానవన శాఖ అధికారి స్వాతి, సర్పంచులు రావుల రమేష్, మధాడి భారతి, దన్నమనేని శోభానర్సింగావు, ఎంపీటీసీలు కొత్త తిరుపతిరెడ్డి, ముప్పిడి సంపత్‌రెడ్డి, ఉపసర్పంచ్ బేతి తిరుపతిరెడ్డి, ఆత్మ చైర్మన్ పాశం అశోక్‌రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు మొరపెల్లి రాజిరెడ్డి, శంకరయ్య, సదానదం, వ్యవసాయ విస్తరణ అధికారులు స్వామి, షభన, ప్రవీణ్, రఘు, భావన, బ్యాంక్ అధికారులు గౌతమి, వెంకట్రజం, ఆంజనేయులు, రోహన్ కార్తిక్, వంశీకృష్ణ, ఉపాధి హామీ టిప హరీష్, శేఖర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ 6
జగిత్యాల
ఆదివారం | సెప్టెంబర్ 17, 2023 | www.navatelangana.com

లైంగిక దాడుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలి

● జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్

నవతెలంగాణ-మెట్‌పల్లి

అసాంఘిక శక్తులు, లైంగిక దాడులు, దోపిడీలు, నేరాల పట్ల విద్యార్థులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్‌కుమార్ సూచించారు. మెట్‌పల్లి మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో రవీంద్ర జూనియర్ బాలికల కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అమ్మాయిలతో పాటు మహిళల్ని కూడా అక్రమ రవాణా చేసి విక్రయించడతో పాటు, వారితో వ్యభిచార నేరాలకు పాల్ప డుతున్న ముఠాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



ఇలాంటి బాధితుల కోసం జాతీయ లీగల్ సర్వీసెస్ రక్షణ, పునరావశం కల్పింస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు మగ్గిడి వెంకట నర్సయ్య, గాజ రఘు, కళాశాల ప్రిన్సిపాల్ , అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో రసాయన ఎరువుల వాడకం

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఇఫ్కో ఎరువులను డ్రోన్ సాయంతో వెదజల్లే విధానాన్ని కల్వకోట గ్రామంలో చేపట్టారు. ఇఫ్కో నానో యూరియా, ఇఫ్కో నానో పొటాస్, పెస్టిసైడ్‌లు స్ప్రే విధానాన్ని రైతులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రవీందర్‌రావు, ఎంపీటీసీ ఆధే రాజన్న, సర్పంచ్ ఆధే హన్మక్క, మాజీ సర్పంచ్ లక్ష్మీరాజం డైరెక్టర్ కమలాకర్‌రావు, ఏఎంసీ డైరెక్టర్ గాజీపాషా, సీఈవో గోపి, రైతులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో రథం ఏర్పాటు

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో నిర్వహించే ఉత్సవ మూర్తుల ఊరేగింపు, శోభయాత్ర కోసం గ్రామానికి చెందిన దాతల సహకారంతో రూ.3 లక్షలతో రథం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రథన్ని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కుంట శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం సత్యనారాయణరెడ్డి, తుమ్మనపల్లి నరసింహాచారి, ముద్దం గంగాధర్,గడ్డం జగదీశ్వర్ రెడ్డి, ఏలేటి భూమారెడ్డి ,నాంపల్లి గంగాధర్, బత్తుల రాజేందర్, రాజన్న, నోముల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కల్వకోటలో హై లెవెల్ వంతెన నిర్మాణం చేపట్టాలి

నవతెలంగాణ-మేడిపల్లి



ప్రవహిస్తున్న నీరు

మేడిపల్లి మండలంలోని కల్వకోట గ్రామం నుంచి దమన్నపేటకు వెళ్లే మార్గంలో ఉన్న లెవెల్ వంతెనపై నుంచి నీరు ప్రవహి స్తుండడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'భేటీ బచావో బేటి పడావో'పై అవగాహన

● డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్

నవతెలంగాణ-జగిత్యాల

జిల్లా కేంద్రంలోని ఇస్లాంపూర ప్రాంతంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సాధికారత బృందం మహిళలకు అవగాహన కలిపిచింది. ఈ సందర్భంగా డిస్టిక్ మిషన్ కో ఆర్డినేటర్ మాట్లాడుతూ.. బాలికలను చదివిస్తేనే మహిళ సాధికారత సాధ్యమౌతుందని పేర్కొన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.సఖి 181, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, టోల్ ఫ్రీపై అవగాహన కల్పించారు. వికలాంగులు, సదరం సర్టిఫికెట్ కోసం, లేదా ట్రై సికిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ అశ్విని, హేమశ్రీ, గౌతమి చైల్డ్ హెల్ప్ లైన్ టీం మెంబర్స్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సమైక్యత దినోత్సవం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

తెలంగాణా జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ఈ నెల 17న ఉదయం 9 గంటలకు జగిత్యాల కలెక్టట్‌లో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మాత్యులు కొప్పుల ఈశ్వర్ జాతీయ పతాకావిష్కరణ చేస్తారని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

చంద్రబాబు విడుదల కోసం పూజలు

నవతెలంగాణ -మెట్ పల్లి

టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జైల్ నుంచి విడుదల కావాలంటూ శనివారం ఆ పార్టీ నాయకులు గండి హనుమాన్ ఆలయం లో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాన్కాల ప్రవీణ్‌కుమార్, గజ్జలి రాజాగణేష్ ,గుంటుక రాజా మల్లేశం, షేక్ నజరుద్దీన్, టిడిపి మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు చందు, నరేష్ ,రాజకుమార్, గణేష్, శ్రీనివాస్, నరేష్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేణి సుజాత

నవతెలంగాణ -మెట్ పల్లి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేణి సుజాత అన్నారు. శనివారం పారిశుధ్య కార్మికులకు,పట్టణ ప్రజలకు మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్ ఒజ్జల బుచ్చిరెడ్డి, అంగడి పురుషోత్తం ,లంక గంగాధర్, మేనేజర్ వెంకటలక్ష్మి, ఉమాదేవి, అక్షయ్ కుమార్, రత్నాకర్ ,ముజీబ్, మారు విష్ణువర్ధన్, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు

పెగర్లకు వైకుంఠ రథం అందజేత

నవతెలంగాణ-కథలాపూర్



స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కథలాపూర్ మండలంలోని పెగ్గెర్ల గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.3 లక్షలు విలువ చేసే వైకుంఠ రథాన్ని డాక్టర్ వికాస్ దీప గ్రామానికి అందజేశారు. సామాజిక సేవలో ప్రతిమ ఫౌండేషన్ ముందుం టుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కంటే సత్యనారాయణ, పెగర్ల సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, మల్యాల మారుతి, బద్రి సత్యం, కసోజి ప్రతాప్, ప్రవీణ్‌గౌడ్, నరేష్,లోక్య నాయక్, ప్రతిమ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవాణి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే

నవతెలంగాణ-జగిత్యాల :



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ వాణి సహకార జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు యూరాలజిస్ట్ ఎం.దత్తు ప్రసాద్ పాల్గొని విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం ఎం.దామోదర్‌రావు, జే రంగారెడ్డి, క్యాతం. వేణుగోపాల్ ,రాజేశం, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, సుధీర్ ,సురేందర్, రాజేందర్ శర్మ కే. సంగీత, సుమలత, గౌతమి, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

నవతెలంగాణ-జగిత్యాల



పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాల కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. బకాయిలు చెల్లించలేని వారు పాఠశాలల విద్యార్థులకు టిఫిన్ ఎలా పెడతామని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటనలు చేయడానికే పరిమితం అవుతోందని, ఆచరణ శూన్యమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సకలజనులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

● ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

● కోటి 20 లక్షలతో పురపాలక సంఘం నిర్మాణం

● 202 మంది గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందజేత

నవతెలంగాణ-రాయికల్/ జగిత్యాలటౌన్

సకల జనుల హితమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పథకాలకు శ్రీకారం చూడుతోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాయికల్ పట్టణంలో కోటి 20 లక్షల నిధులతో నూతన పురపాలక సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే పట్టణానికి చెందిన 202 మంది గృహలక్ష్మి లబ్ది దారులకు మంజూరు పత్రాల అందజేశారు. 68 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. 11వార్డుకు చెందిన 55



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

మంది యువకులు కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, యూత్ పట్టణ అధ్యక్షుడు మోర రామ్మూర్తి ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఎంపీపీ లౌవుడియ సంధ్యారాణి, వైస్ చైర్మన్ గండ్ర రమా దేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ మారంపల్లి రాణీ సాయి కుమార్, పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,కమిషనర్ గంగుల సంతోష్, కౌన్సిలర్‌లు మ్యాకల కాంతారావు, వల్ల కొండ మహేష్, శ్రీరాముల సువర్ణ,మ్యాకల అనురాధ,కల్లెడ సునీత,కన్నక మహేందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బర్కం మల్లేష్,కో ఆప్షన్ సభ్యులు వాందర్‌బాబు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

జగిత్యాలటౌన్ జగిత్యాలరూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన 100 మంది, లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన 25 మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్, నాయకులు దావా సురేష్, పాక్స్ చైర్మెన్ మహిపాల్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎల్ల గంగనార్సు రాజన్న, చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత లక్ష్మణ్, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ మండలం చెర్లపల్లి గ్రామంలో రూ. 10లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన, రూ. 3 లక్షల నిధులతో నిర్మించిన అంబేద్కర్ సంఘ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసింది కాంగ్రెస్సే

● రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ -ఎండపల్లి

ఐదు దశాబ్దాల పాలనలో వ్యవసాయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిర్లక్ష్యం చేసిందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి, కొత్తపేట, పడకల్ గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం నిర్వహించారు. రాజా రాంపల్లిలో పార్టీ శ్రేణులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన యాదవకులస్తులు కొప్పులకు గొర్రె పిల్లను బహుకరిచారు. అనంతరం



మంత్రికి గొర్రె పిల్లను బహుకరిస్తున్న నాయకులు

మంత్రి కొప్పుల మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాల పాలనలో వ్యవసాయాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసి, రైతులను గోసపెట్టిన కాంగ్రెస్ పార్టీ కాదా అని ఆయన ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో కరెంట్, ఎరువులు, నీళ్ల ఇవ్వకుండా రైతుల ఆత్మహత్యలకు కారణమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి ఎప్పుడు కరెంట్ వస్తుందో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. తొమ్మిదేండ్ల పాలనలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని పేర్కొన్నారు. రైతుబీమా, రైతుబంధు ఇస్తూ రైతులకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొనడానికి వచ్చిన మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు విద్యార్థులతో స్వాగతం పలకడంతో విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

● జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

నవతెలంగాణ-జగిత్యాల

అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌లో గల కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్లతో కలిసి ఈ.ఆర్.ఓ.లు, ఏ.ఈ.ఆర్.ఓ.లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు నమోదు భాగంగా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరిని



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ యాస్మిన్‌భాషా

ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఎలక్టోరల్‌లో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు ఆరోగ్యవంతమైన జాబితాను సిద్ధం చేయాలన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఓటరు నమోదు, మార్పులు-చేర్పులు, జెండర్ రేషియో, ఈ.పి. రేషియో, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో స్వీప్ కార్యకలాపాలను కళాశాల స్థాయిల్లో నిర్వహిస్తూ 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బిఎస్. లత, దివాకర, ఆర్డీవోలు, ఈ.ఆర్.ఓ.లు రాజేశ్వర్, నరసింహ మూర్తి, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మి నారాయణ, డీఆర్‌డీవో నరేష్, జిల్లా సంక్షేమ అధికారి నరేష్, తహసీల్దార్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ధర్మపురి

శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, (విశ్వకర్మ) భగవానుని బ్రహ్మోత్సవాల సందర్భంగా ధర్మపురి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో స్థానిక కర్నే అక్కపెల్లి కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. యువకులు 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని, అందుకే రక్తదానం శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. కట్ట రామచంద్రం జ్ఞాపకార్థం వారి కుమారులు మడవ శ్రీనివాస్ రక్తదాతలు అందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్యాకెట్లు అందించారు. గవర్నమెంట్ బ్లడ్ సెంటర్ జగిత్యాల వారు పాల్గొని రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ నీలారపు శ్రీనివాస్, సిబ్బంది ఎండి జమాద్, బి. దివ్య, ప్రకాష్ , నరేష్, ముభిన్ అలీ, స్వర్ణకార సంఘ అధ్యక్షుడు ఉప్పుల రాకేష్, లక్ష్మీనరహరి, సింహరాజుప్రసాద్, వెంకటేశం, రాజమౌళి,రాంప్రసాద్,సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఏవో త్రివేదిక తనిఖీ

నవతెలంగాణ-మేడిపల్లి



మిషన్ పరిశీలిస్తున్న ఏవో

మేడిపల్లి, భీమారం మండలాల్లోని ఎరువుల దుకాణాల్లో ఏవో త్రివేదిక శనివారం తనిఖీలు చేశారు.ఎరువుల నిల్వలను ఈపీఓఎస్ మిషన్లలో (ఆధార్ ఎనేబుల్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం) పరిశీలించారు. మిషన్ ఉపయోగించిన తర్వాత మాత్రమే అమ్మకాలు చేయాలని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కథలాపూర్



మాట్లాడుతున్న నర్సింహారావు

మండలంలోని గంభీర్ పూర్ గ్రామంలో చల్మెడ ఆనందరావు విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో 1706 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 614 మంది వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి నర్సింహారావు మాట్లాడుతూ.. రొమ్ము క్యాన్సర్ వల్ల దేశంలో ప్రతి 3 నిమిషాలకు ఒక మహిళ ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం అన్నారు. నానమ్మ మరణాన్ని స్ఫూర్తిగా తీసుకునే క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించామని తెలిపారు. ఎంపీపీ జవ్వాజి రేవతి, సర్పంచ్ పోతు సిందుజ రాజశేఖర్, గంభీర్పూర్ సొసైటీ వైస్ చైర్మన్ శీలం మోహన్ రెడ్డి, రైతు సంఘం నాయకులు గడ్డం భూమా రెడ్డి, మండలాధ్యక్షుడు గడిల గంగాప్రసాద్, సర్పంచి గజ్జెల స్వామి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాల్వ సత్యనారాయణ, దొప్పల జలంధర్, రామాంజనేయులు, భాస్కర్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

నవతెలంగాణ-మేడిపల్లి



ప్రమాదకరంగా ఉన్న గుంత

మేడిపల్లి మండలంలోని కల్వకోట నుంచి రంగాపూర్ వెళ్లే మార్గంలో దమ్మన్నపేట, కట్లకుంట, పోరుమల్ల గ్రామాల్లో ఉన్న టీ ఫైబర్ కేబుల్ గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు

హైమాస్ లైట్లకు మరమ్మతులు

నవతెలంగాణ -ఎండపల్లి

ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా ఏర్పాటు చేయించిన హైమాస్ లైట్లు రెండు నెలలుగా పని చేయడం లేదు. వినాయక చవితి సందర్భంగా హైమాస్ లైట్లను ఎంపీటీసీ జాడీ సుజాత రాజేశం మరమ్మతులు చేయించారు.గ్రామస్తులకు ఎంపీటీసీ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాబోయే ఎన్నికల్లో సీఎంపై గల్ఫ్ కార్మికుల పోటీ

● గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిళ్ళ రవి

నవతెలంగాణ-మల్లాపూర్



అవగాహన కల్పిస్తున్న చైర్మన్ రవి

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై గల్ఫ్ కార్మికులు పెద్ద సంఖ్యలో పోటీ చేస్తారని గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిళ్ళ రవి అన్నారు. శనివారం మండలం లోని చిట్టాపూర్ గ్రామంలో గల్ఫ్ జేఏసీ గల్ఫ్ కార్మికులకు అవగాహన చైతన్య యాత్ర చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గల్ఫ్ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని, రాజ్యాలు మారిన గల్ఫ్ కార్మికుల రాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోవు ఎన్నికల్లో కామారెడ్డిలో కేసిఆర్‌పై పోటీకి, సిరిసిల్లలో కేటీఆర్‌పై వందలాది మంది గల్ఫ్ మృతుల కుటంబాలతో పోటీ చేయబోతున్నామని తెలిపారు. గల్ఫ్ కార్మికులకు సీఎం ఇచ్చిన హామీలు గాలికొదిలేశారన్నారు. కోరుట్ల నియోజక వర్గంలో కూడా గల్ఫ్ జేఏసీ అభ్యర్థిని త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయికుమార్, గల్ఫ్ జేఏసీ నాయకులు వీరవత్తిని శ్రీనివాస్, అంజిరాజ్ దండుగుల, జోగ ఆనంద్, జోగ రాజు, రవి, సత్యం, శ్రీను, సుదర్శన్, గంగాధర్, సాగర్, బీమారపు రవి, నాగశ్రీను, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

నవతెలంగాణ-జగిత్యాల

పట్టణంలోని కృష్ణనగర్‌లోని చైతన్య ఉన్నత పాఠశాలలో 2011-12 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఆత్మీయ పూర్వ సమ్మేళనం కార్యక్రమం శనివారం స్థానిక హోటల్ వశిష్టలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైతన్య హై స్కూల్ కరస్పాండెంట్ కొమురవెల్లి కిషన్, ఉపాధ్యాయులు పెద్ది రజిని కాంత్, జూపక గంగన్న, పోతాం శెట్టి రాంరెడ్డి, వేణు, మృతంజయం, శ్రీనివాస్, రాజ్‌కుమార్, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి గ్రామానికి చెందిన కందుకూరి రాకేష్ తండ్రి శంకర్ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను బిజెపి రాష్ట్ర నాయకులు ముదిగంటి రవీందర్‌రెడ్డి పరామర్శించారు. వారి వెంట సీనియర్ నాయకులు సబ్బ దేవరాజాం, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కంది రమేష్, మండల ఉపాధ్యక్షులు సముద్రాల రాజశేఖర్, దుట నరేందర్, భుమేష్, సతీష్ తదితరులు ఉన్నారు.

శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు

● జగిత్యాల ఎస్పీ ఎగ్గడి భాస్కర్

నవతెలంగాణ-జగిత్యాల:



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ భాస్కర్

శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు వస్తుందని, నేరం చేసిన వారికి శిక్ష తప్పదనే భయం కలిగిస్తే సమాజంలో చాలా వరకు నేరాలు కంట్రోల్‌లో ఉంటాయని ఎస్పీ ఎగ్గాడి భాస్కర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచాలని, తప్పు చేసిన నిందితులకు శిక్ష పడేలా చేస్తేనే ప్రజల్లో గౌరవం, నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. కేసుల్లో శిక్షల అమలు, పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించి పలువురు కోర్టు కానిస్టేబుళ్లను అడిగి కేసుల పురోగతిపై సూచనలు చేశారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, వారెంట్స్ తదితర అంశాలపై సమీ క్షించారు. కోర్టు సమాచారం ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలు పాలని సూచించారు. గత శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో రాజీ మార్గంగా ద్వారా జిల్లా పరిధిలో 12492 కేసులు పరిష్కారం చూపినట్టు తెలిపారు. రాష్ట్రంలోని 10వ స్థానంలో నిలిచేలా వ్యవహరించిన పోలీసు సిబ్బంది అభినందించారు. ఈ సమావేశంల అదనపు ఎస్పీ ప్రభాకరరావు, డీఎస్పీ వెంకటస్వామి, పాల్గొన్నారు.

హత్యకు గురైన సతీష్ కుటుంబాన్ని ఆదుకోండి

● జిల్లా కలెక్టర్‌ను కోరిన అంబేద్కర్ సంఘ నేతలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

మెట్‌పెల్లి పట్టణంలో హత్యకు గురైన దళిత యువకుడు కన్నం సతీష్ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురవుతోందని, తక్షణమే ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని అంబేద్కర్ సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. శనివారం మృతుడి భార్య కన్నం పవిత్రతో కలిసి అంబేద్కర్ సంఘాల రాష్ట్ర నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి సంజీవ్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల నరేష్, కోరుట్ల నాయకులు బర్ల ప్రణయ్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగర పవన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలి

● సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన

నవతెలంగాణ-జగిత్యాల



మాట్లాడుతున్న ఇందూరి సులోచన

మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలని, కొత్త మెనూ ప్రకారం బడ్జెట్ కేటాయిం చాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన డిమాండ్ చేశారు. ఈనెల 28 నుంచి నిరవదిక సమ్మెలోకి వెళ్తామని కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాటా_డుతూ.. పెండింగ్ బిల్లులు తక్షణం విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అక్షయ పాత్రకు ఇవ్వకుండా, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

నవతెలంగాణ-మల్లాపూర్



పరామర్శిస్తున్న సుజిత్ రావు

మండల కేంద్రానికి చెందిన చెందిన సీనియర్ పోస్ట్ మాన్ కొండలాద్రి కొద్దీ రోజుల క్రితం మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులను టిపిసిసి డేలిగేట్ కల్వకుంట్ల సుజిత రావు శనివారం పరామర్శించారు. ఆయన వెంట మల్లపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్ముల చిన్న రెడ్డి, జోగినిపల్లి లింగారెడ్డి, టీపీసీసీ ఫీషేర్మాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుతుబోద్దీన్ పాషా, టీపీసీసీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ పాల్గొన్నారు.

జై గణేష భక్త సమితి మండల అధ్యక్షుడిగా విష్ణువర్ధన్ రాజు

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన గణపతి విష్ణువర్ధన్ రాజును మండల అధ్యక్షుడిగా నియమించినట్లు జై గణేష భక్త సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు రాజేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగాధరి సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రాజు మాట్లాడుతూ.. మట్టి వినాయకుడుని పూజించండి- పర్యావరణాన్ని కాపాడండి"అనే నినాదంతో పవిత్ర కార్యాన్ని నెరవేర్చుటకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

● కోరుట్ల కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగ్ రావు

నవతెలంగాణ -మెట్‌పల్లి



మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగ్ రావు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెట్‌పల్లి పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతు తెలిపి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరి, రాష్ట్ర కార్యదర్శి ఏ భాగ్యలక్ష్మి, మెట్‌పల్లి అర్బన్ నజీమ, మాధస్తు లక్ష్మి, పద్మ, మెట్‌పల్లిరూరల్ కోలు సుమలత, దీప, మల్లాపూర్ మండల్ సంధ్యారాణి,రజిత, ఇబ్రహీం పట్నం మండల్ సమీం సుల్తానా, జి లక్ష్మి, నర్సు పాల్గొన్నారు.

6వ రోజుకు చేరుకున్న అంగన్ వాడీల సమ్మె

నవతెలంగాణ-పెగడపల్లి

అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధకరించి సమస్యలు పరిష్కరించాలని పెగడపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు 6వ రోజు కొనసాగుతున్న అంగన్ వాడీ టీచర్ల సమ్మెలో మోకాలుపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జయప్రద, సత్యమ్మ, మనెమ్మ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

● బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్

నవతెలంగాణ-మల్లాపూర్



కండువా కప్పుతున్న సంజయ్

అభివృద్ధిని చూసి బిఆర్ఎస్‌లో చేరుతున్నారని, తెలంగాణలో రాబోయేది తమ ప్రభుత్వమేనని కోరుట్ల బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ అన్నారు. శనివారం మండలంలోని ముత్యంపేట గ్రామంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీ నుంచి సుమారు 300 మంది యువకులు, సంఘాల నాయకులు పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలోకి చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, డీలర్ మల్లయ్య తదితరులు ఉన్నారు.

మహిళ బిలుల్లు ఆమోదించకపోవడం సిగ్గు చేటు

- చల్మెడ లక్ష్మీ నరసింహారావు



నవతెలంగాణ-వేములవాడ రూరల్:
గత పదేళ్ళుగా రెండు మహిళ బిల్లుల ఆమోదం కొరకు బీఆర్ఎస్ ప్రభుత్వం పోరాటం చేస్తుంటే బీజేపీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు అన్నారు. వేములవాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహి ళల సంక్షేమానికి, అభ్యున్నతికి మహిళల హక్కులను కాపాడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి వెలకట్టలేనిదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని మహిళల కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు చేపడు తున్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనైనా బిల్లులు ఆమోదించాలని ప్రభుత్వం పోరాటం చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రధానమంత్రి మోడీకి లేఖ కూడా పంపినట్లు వివరించారు .బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ లో మహిళ బిల్లులు ఆమోదించేంత వరకు పోరాటం ఆగదని తెలిపారు. మహిళలు ఎల్లవేళలా బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటూ వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య తుది ఓటరు జాబితా రూపొందించాలి

ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ సి. సుదర్శన్ రెడ్డి



నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్
అధికారులతో పాటు ప్రజా ప్రతినిధుల సమన్వయంతోనే పూర్తి ఆరోగ్యవంతమైన ఓటరు జాబి తాను రూపొం దించగ లుగుతామని ఎల క్టోరల్ రోల్ అబ్జర్వర్ సి. సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్ లో అధికారులతో తుది ఓటరు జాబితా తయారీకి తీసుకుంటున్నా చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఆరోగ్యవంతమైన ఓటరు జాబితాను రూపొందించడానికి బూత్ స్థాయి అధికారులతో పాటు పార్టీల తరపున కూడా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని తెలిపారు. దివ్యాంగ ఓటర్ల కోసం అన్ని పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు ఉండేలా చూడాలన్నారు. నియోజకవర్గాన్ని ఒక మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఐడెంటిఫై చేయాలన్నారు. పటిష్ట ఓటరు జాబితా తయారీ కోసం చర్యలు తీసుకుంటున్నామని జిల్లా డిప్యూటి ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ ఎస్ ఖీమ్యా నాయక్ ఎలక్టో రల్ రోల్ అబ్జర్వర్ కు వివరించారు. ఈనెల 19 లోగా వచ్చిన అభ్యంతరాలు, ఆక్షేపణలను సవరించుకోవడానికి అవకాశాన్ని కల్పించడం జరిగు తుందన్నారు. ఈ సమావేశంలో ఈఆర్ఓ లు ఆనంద్ కుమార్, మధు సూధన్ , తహశీల్దార్‌లు ు పాల్గొన్నారు.

హలో విద్యార్థి చలో సిరిసిల్ల



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నవతెలంగాణ-కోనరావుపేట
హలో విద్యార్థి చలో సిరిసిల్ల విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ అన్నారు. మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ -విద్యార్థి గర్జన సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అక్టోబర్ 6న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం కార్మిక భవన్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికై విద్యార్థి గర్జన సభ నిర్వహించబోతున్నాం అన్నారు, విద్యార్థి గర్జన సభకు పెద్ద ఎత్తున విద్యార్థి లోకమంతా సిరిసిల్లకు తరలిరావాలని, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు అజయ్, మల్యాల సుజిత్, ముఖ్య అరవింద్, చైతన్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షలో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా అడుకున్న పోలీసులు

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్
రాజన్న సిరిసిల్ల జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని శనివారం అంబేద్కర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అధికారుల, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్ లు మాట్లాడుతూ ఒక సెంటర్ కు వెళ్లాల్సిన పేపర్‌ను వేరొక సెంటర్‌కు పంపించారని దీని ద్వారా పేపర్ రాస్తున్న అభ్యర్థులు అయోమయానికి గురై మానసిక సంక్షోభానికి గురయ్యారని పేర్కొన్నారు. దీనికి ప్రధాన కారణం మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కేటీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ జామ్‌తో అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. దాదాపు 20 వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం దాదాపు 5వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ విడుదల చేయడం ఎంతవరకు సమంజసం అని మండిపడ్డారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరుద్యోగుల సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పెండేల ఆదిత్య, బొప్ప సాయి చరణ్, నెదురి శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ చంద్ర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం అద్భుతమైన పథకం: చల్మెడ హర్షం



లక్ష్మీ నరసింహారావు

నవతెలంగాణ-వేములవాడ రూరల్:
ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ పిల్లల కోసం అల్పాహారం పథకాన్ని అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు అన్నారు. సీఎం నిర్ణయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. వేములవాడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. బడి పిల్లలకు, తల్లులకు కోసం ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలు అమలు ఉన్నాయి. పిల్లలను పాఠశాలలకు పంపించే తల్లులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

16 శ్రీస్త్రజూ% 04 ఇసుక వే బిల్లులు అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

వేబిల్లు లేకుండా ఇసుక రవాణా..

సరిహద్దు దాటుతున్న అక్రమ రవాణా

నవతెలంగాణ- తంగళ్ళపల్లి
మానేరు వాగు నుండి ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. రెవెన్యూ అధికారులు మానేరు వాగు నుండి ఇసుకకు అనుమతులు ఇస్తే కొందరు వెబిల్లా లేకుండా అధికారుల కళ్ళు కప్పి అక్రమ రవాణా చేస్తున్నారు. తంగళ్ళపల్లి మానేరు వాగు నుండి ఇసుకను తవ్వుకునేందుకు రెవెన్యూ అధికారులు వారానికి ఒకరోజు అనుమతులు ఇస్తున్నారు. ఇసుకను సిద్ధిపేట జిల్లాకు తరలిస్తున్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తూ వేలు దండుకుంటున్నారు.

ఉత్తమ గ్రామ సర్పంచ్, కార్యదర్శులకు సన్మానం

నవ తెలంగాణ-తంగళ్ళపల్లి
పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని ఎంపీపీ పడిగల మానస అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2023 లో జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీలుగా తంగళ్ళపల్లి, మండపల్లి రెండు గ్రామపంచాయతీలు మూడు కేటగిరీల్లో ఎంపిక య్యాయి. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపికైన తంగళ్ళపల్లి సర్పంచ్ అంకారపు అనిత, మండేపల్లి సర్పంచ్ గణపతి శివ జ్యోతితో పాటు పంచాయతీ కార్యదర్శుల ను అధికారులు ఘనంగా సన్మానించారు. సర్పంచులకు మెమొంటో, కార్యదర్శులకు ప్రశంస పత్రాన్ని అందజేశారు.

ఇంటింటికి చెట్లు పెంచాలి: రమేష్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట
ఇంటింటికి చెట్లు పెంచుదామని సామాజిక కార్యకర్త రమేష్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త దుంపెన రమేష్ శనివారం మొక్కలను పంపిణీ చేశారు. అందులో జామ, దానిమ్మ, గన్నేరు, ఉసిరి, మంధార, మల్లె, సత్యనారాయణ, గులాబి మొక్కలు 400 పంపిణీ చేశారు. ప్రతి ఇంటింటికి మొక్కలు పెంచాలని పర్యావరణం కాపాడాలని 12 సంవత్సరాలుగా ప్రచారం చేస్తూ మొక్కల వితరణ చేయడం జరుగుతుందన్నారు.

ఓటుపై సాంస్కృతిక పోటీలు, మాక్ పోలింగ్



సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీపీఈవో చింతల మోహన్ ఆదేశాల మేరకు శనివారం ఓటుపై సాంస్కృతిక పోటీలు, మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతపై కవితలు, పాటలు, నాటికలపై సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విద్యార్థులే పోలింగ్ అధికారులుగా వ్యవహరించారు. ఓటుపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ, సాంస్కృతిక విభాగం ఇంచార్జి వాసరవేణి పర్శరాములు, చెరుకు భూమక్క, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు మాదాసు చంద్రమౌళి, బుట్ట కవిత, నీరటి విష్ణుప్రసాద్, ఆర్ గీత, కొడిముంజ సాగర్, గౌతమి, చిలుక ప్రవళిక, విద్యార్థులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు




ఉపకారవేతనాలు ఇస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్

నవతెలంగాణ-వేములవాడ రూరల్:
సిరిసిల్ల కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో రుద్రవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు చేశారు. కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ప్రతి ఏటా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్సీ ఎస్టీ బాలికలకు ఈ ఉపకార వేతనాలు అందజేశారు. 5వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదివిన విద్యార్థులకు రూ. 2500, 8వ తరగతి నుండి10వ తరగతి వరకు చదివిన విద్యార్థినీలకు రూ.5000 చొప్పున నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సిరిసిల్ల బ్రాంచ్ మేనేజర్ వి. రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి సమాజంలో ఉన్నతమైన స్థాయికి ఎదగాలని కోరారు. కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

మూడు చక్రాల బండి కోసం రూ.15 డిమాండ్

వికలాంగుడి నుంచి డబ్బులు డిమాండ్ చేసిన పద్మనగర్ సర్పంచ్



కుచ్చుల రాజేశం

నవతెలంగాణ- తంగళ్ళపల్లి
పైసలిస్తే చాలు ఏ పని అయిపోతుంది. అర్హత లేకున్నా సరే లంచం చేతికందితే చాలు మూడు చక్రాల బండి ఇంటికి వస్తుంది. మూడు చక్రాల బండి కావాలని ఓ వికలాంగుడు గ్రామ సర్పంచిని అడుడితే అందుకు రూ.15 వేలు డిమాండ్ చేసిండని బాధితుడు మీడియాతో వాపోయాడు. మండలంలోని పద్మనగర్ గ్రామానికి చెందిన కుచ్చుల రాజేశం పుట్టుకతోనే వికలాంగుడు. ఎక్కడికైనా వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. మంత్రి కేటీఆర్ తన పుట్టినరోజు సందర్భంగా గతంలో గిఫ్ట్ ఏ స్మైల్ అనే కార్యక్రమం ద్వారా వికలాంగులకు మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశారు.సదరు వికలాంగుడు రాజేశం గ్రామ సర్పంచ్ వద్దకు వెళ్లి, నాకు ఒక మూడు చక్రాల వాహనాన్ని ఇప్పించాలని పద్మనగర్ సర్పంచ్ ముడారి పోచయ్యను వారం క్రితం బ్రతిమిలాడారు. ఆ తర్వాత సర్పంచ్ తను నమ్మిన బంటును నా దగ్గరకు పంపించి , నీకు మూడు చక్రాల బండి కావాలంటే రూ.15వేలు సర్పంచ్ కు ఇస్తే బండి ఇప్పిస్తాడట డబ్బులు తీసుకురమ్మని నా దగ్గరకు పంపించాడని వికలాంగ బాధితుడు రాజేశం ఆవేదన వ్యక్తం చేశాడు. రూ.15వేలు ఉంటే నేనే ఓ వాహనాన్ని కొనుక్కునే వాడినని నా దగ్గర డబ్బులు లేవని మీకెందుకు డబ్బులు ఇవ్వాలని అతనిని ప్రశ్నించినట్లు తెలిపాడు. గ్రామానికి సేవ చేయాల్సిన ప్రజా ప్రతినిధి ఇలా వికలాంగుడిని చూడ కుండా లంచం డిమాండ్ చేయడం సరి కాదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ లాంటి అవినీతి సర్పంచులపై చర్యలు తీసుకుని, తనకు మూడు చక్రాల వాహనం ఇప్పించాలని వికలాంగుడు రాజేశం మీడియాతో వాపోయాడు.

మానవత్వం చాటుకున్న సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఇల్లంతకుంట:
మండలంలోని పెద్దలింగపూర్ గ్రామ సర్పంచ్ జితేందర్ గౌడ్ ను మండల దళిత సంఘాల నాయకులు శనివారం సన్మానించారు. గ్రామ పంచాయితీ లో సపాయి కార్మికునిగా పని చేస్తున్న ఇల్లు లేని దళిత నిరుపేద కుటుంబానికి చెందిన పసుల కనుకయ్య కు సర్పంచ్ తన స్వంత డబ్బులతో ఇల్లు నిర్మిస్తున్న సందర్భంగా ఆయనను నాయకులు అభినందించారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సావనపెల్లి రాకేష్, నాయకులు గన్నేరం నర్సయ్య , పసుల బాలరాజు, కాసుపాక శంకర్, సావనపెల్లి శంకర్, నాయకులు జీవన్ రెడ్డి, బైండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ అమత్ లాల్ శుక్లా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్



శుక్ల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

నవతెలంగాణ- తంగళ్ళపల్లి
తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సిరిసిల్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అమరజీవి కామ్రేడ్ అమత్ లాల్ శుక్లా విగ్రహాన్ని సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు .తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో బాగంగా శనివారం తంగళ్ళపల్లి మానేరు నది ఒడ్డున ఉన్న ఆయన స్థూపానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సెప్టెంబర్ 10 నుండి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆనాటి పోరాటంలో మన జిల్లా నుండి బద్దం ఎల్లారెడ్డి , సింగిరెడ్డి భూపతి రెడ్డి, అమతలాల్ శుక్లా, గడ్డం తిరుపతిరెడ్డి, కర్రోల్ల నర్సయ్య లు పాల్గొన్నారని వివరించారు. అమత లాల్ శుక్లా తన ఉపాధ్యాయ వత్తిని సైతం వదులుకొని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సీ పీ ఐ(ఎం) మండల కార్యదర్శి కోడం రమణ. జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ , మల్లారపు ప్రశాంత్ , శ్రీరాముల రమేష్ చంద్ర , నర్సయ్య , మల్లయ్య , శ్రీనివాస్ , రాకేష్ , సురేష్ , గంగాధర్ , శంకర్ , రాజమల్లు , పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎంపికైన గురుకుల విద్యార్థులు



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట
ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గ్రామంలో గల గురుకుల విద్యార్థులు ఈఎంఆర్ఎస్ సొసైటి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక వేడుకలలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. దుమాల ఏకలవ్య గురుకుల రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థులు తమ విభిన్న ప్రదర్శనలతో ప్రతిభను కనబర్చారు. ఉపన్యాసం, అనర్గళ బాషణం, చిత్రలేఖన, సామూహిక సంగీత, సాహిత్య నృత్య కార్యక్రమాల్లో ఉన్నతమైన ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ- ఇల్లంతకుంట:
సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం పెద్దలింగాపూర్ సర్పంచ్ జితేందర్ గౌడ్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కరివెద స్వప్న కరుణాకర్ రెడ్డి, నాయకులు కేతిరెడ్డి సుధాకర్ రెడ్డి, పసుల బాల్ రాజ్, ఎలవేణి రమేశ్ , రేగుల బిక్షపతి, ల్యాగల బాగయ్య, కొడుముంజ సురేందర్, కొడుముంజ రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-ఇల్లంతకుంట:
రైతులు సాగు చేసిన పంటలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా.ఎం రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు .మండలములోని నర్సక్కపేట గ్రామములో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఏటీసీ కరీంనగర్ కో-ఆర్డినేటర్ డా.మదన్ మోహన్ రెడ్డి, డా.యం.రాజేంద్ర ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి లతశ్రీ, కళా శాల విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

జంగంరెడ్డిపల్లెకు ఉత్తమ అవార్డు

నవతెలంగాణ-ఇల్లంతకుంట:
మండలంలోని జంగంరెడ్డి పల్లె గ్రామపంచాయతీ జిల్లా స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక కాగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ న్యాలకొండ అరుణ, జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ తూముకుంట శ్రీలత నరేందర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి మధు , ప్రశంసా పత్రాన్ని మేమెుంటోను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిద్దం వేణు , మండల పరిషత్ అధ్యక్షులు ఊట్కూరు వెంకటరమణారెడ్డి , గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నూర్ భాషా(దూదేకుల)సంఘ మండల సమావేశం

నవతెలంగాణ- ఇల్లంతకుంట:
మండలకేంద్రలో శనివారం ఆర్య వైశ్య భవన్ లో ఇల్లంతకుంట నూర్ బాషా దూదేకుల సంఘం సమావేశం నిర్వహించారు . ఇల్లంతకుంట మండల నూర్ బాషా దూదేకుల సంఘం అధ్యక్షుడు మహ్మద్ సలావోద్దీన్ మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అధ్యక్షులు సంఘం సభ్యులు మండల కమిటీ సభ్యులు అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మహ్మద్ ఉస్మాన్, మహ్మద్ జలాల్, రాజ్ మహ్మద్, మహ్మద్ రఫీ, మంజూర్ అలీ , మహ్మద్ జమాల్, మహ్మద్ అలిమ్, మహ్మద్ షాదుల్, మహ్మద్ సలీమ్, జలీల్ , యూసుఫ్, హకీమ్ తదితరులు పాల్గొన్నారు .

ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి

నవతెలంగాణ- చందుర్తి:
ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని జిల్లా సెంకడరి పాఠశాల యూనియన్ అధ్యక్షుడు బరాజు రమణ రెడ్డి అన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో యూనియన్ సభ్యుల సమావేశమైయ్యారు. ఈ కార్యక్రమంలో విక్కుర్తి లక్ష్మీనారాయణ, తిరుపతి, శ్రీనివాస్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ

16సిరిసిల్ల రూరల్10: నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్
న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి ముందుకు రావాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ అన్నారు సిరిసిల్లలోని గ్రంథాలయంలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ చట్టంపై అవగాహన ఉన్నట్లయితే మనకు పూర్తి న్యాయం జరుగుతుందని ఉన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా ఏలాంటి చార్జీలు లేకుండా కేసుల పరిష్కారానికి అవకాశం ఉందన్నారు. న్యాయ సేవాసాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయం లభిస్తుందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. పెండింగ్ కేసులకు పరిష్కారం లభిస్తుందని ఆమె అన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు పంతాలకు పోకుండా రాజీ కుదుర్చుకోవడం మంచిదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, న్యాయవాదులు పెంట శ్రీనివాస్, పరుశరాములు, ఆడెపు వేణు, బూర కళ్యాణ తదితరులు పాల్గొన్నారు

చల్మెడ యువసేన చేయూత

నవతెలంగాణ-కొనరావుపేట
చల్మెడ యువసేన ఆధ్వర్యంలో మండలంలోని నాగారం గ్రామనికి చెందిన బొడ్డు పోచయ్య అల్లిపు వెంకటి అనే నిరుపేద కుటుంబాలకు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెల్మెడ యువసేన నాయకులు. తదితరులు పాల్గొన్నారు

సంక్షేమ వసతి గృహం తనిఖీ

నవతెలంగాణ-రుద్రంగి
రుద్రంగి మండల కేంద్రంలో ఎస్సీ సంక్షేమ వసతి గహాన్ని జిల్లా షెడ్యూలు కులాల అభివద్ధి సంక్షేమ శాఖ సహాయ అధికారి విజయలక్ష్మి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాస్టల్లోని విద్యార్థుల హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.విద్యార్థులకు అందిస్తున్న భోజనం,అల్పాహారం ను చూసి సంతప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రవీంద్రస్వామి పాల్గొన్నారు.

దొరల పాలనకు చరమగీతం పాడాలి: తుల ఉమ

నవతెలంగాణ, సిరిసిల్ల క్రైం:
దొరల నియంతత్వ పాలనకు చరమగీతం పాడాలని బీజీపీ రాష్ట్ర నాయకురాలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్పర్సన్ తుల ఉమ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న 6వ రోజు నిరవధిక సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తుల ఉమ మాట్లాడుతూ... ఆడ బిడ్డగా, ఉద్యమకారినిగా అంగన్వాడీ సమస్యలు తనకు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు కల్లూరి చెందిన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, ఉపాధ్యక్షురాలు ఒరగంటి శామల, కల్వకుంట్ల పద్మ,ట్రెజరీ కొందికొప్పుల పద్మ, అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కోర్టు కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చేయాలి:ఎస్పీ



పోలీసులకు ప్రశంసా పత్రాలు అందించిన ఎస్పీ

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్
కోర్టు కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చేయడం, శిక్షల శాతాన్ని పెంచడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాయంలో వివిధ కేసుల్లో నిధుతులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన కోర్ట్ విధులు నిర్వహించే పోలీస్ అధికారులు శనివారం అభినందించి రివార్డులు ప్రశంశ పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్తులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. వివిధ కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేవిధంగా కృషి చేసిన ఎస్.ఐ శ్రీకాంత్, కానిస్టేబుల్ మధుసూదన్, వేములవాడ టౌన్ కోర్ట్ కానిస్టేబుల్ సురేష్, సిరిసిల్ల టౌన్ కోర్ట్ కానిస్టేబుల్ నరేష్, ముస్తాబద్ కోర్టు కానిస్టేబుల్ దేవేందర్, డిసిర్బీ కానిస్టేబుల్ అవినాష్ లను జిల్లా ఎస్పీ గారు అభినందించి ప్రశంశ పత్రం మరియు క్యాష్ రివార్డ్స్ అందజేశారు.

గ్రామాలు పచ్చదనం పరిశుభ్రతకు చిరునామాలు: జడ్పీచైర్మన్ అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ అధ్యక్షురాలు అరుణ

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:
సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ వల్లే తెలంగాణ గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతకు చిరునామాలుగా నిలుస్తున్నాయనీ జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. శనివారం సమీకత జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2023 క్రింద జిల్లా స్థాయిలో మూడు కేటగిరీలలో ఎంపికైన 15 ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచ్ లు , సెక్రెటరీ లను జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీపీవో రవీందర్, డీఆర్డీవో నక్క శ్రీనివాస్ , స్వచ్ఛ భారత్ మిషన్ బాధ్యులు సురేష్, ఎంపీపీ లు, జెడ్పీటీసీ లు పాల్గొన్నారు

స్వచ్ఛంద సేవ చేయడం అభినందనీయం:ఎస్పీ

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్
స్వచ్ఛందంగా సేవ చేసే గుణం కలిగి ఉన్నప్పుడే పేద మధ్యతరగతి ప్రజలకు కొంత ఉపయోగం కలిగే అవకాశం ఉందని చింతోజు భాస్కర్ స్వచ్ఛంద సేవ చేయడం అభినందనీయమని ఎస్పి అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్లలోని మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శనివారం మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు చింతోజు భాస్కర్ సిఐ ఉపేందర్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

నవ తెలంగాణ-గంభీరావుపేట: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గజసింగవరం గ్రామానికి చెందిన పెద్దరాజయ్య కుమారుడు సూతరి ఆంజనేయులు (41) స్థానికంగా ఉంటూ హెూటల్ ను నిర్వహిస్తున్నాడు. అయితే 6 నెలల క్రితం ఇంటి పునర్నిర్మాణం కోసం, బిడ్డ పెళ్లికి కోసం అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఏలా తీరక మనోవేదనకు ఇంట్లో ఫ్యాను కి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతడు ఆంజనేయులు కి ఇద్దరు కూతుళ్ళు, కుమారుడు ఉన్నాడు.

విద్యార్థులను దేశభక్తులుగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న కరీంనగర్ విభాగ్ కన్వీనర్ కోడి అజయ్

నవతెలంగాణ-పెద్దపల్లిటౌన్: జాతీయతే ఊపిరిగా దేశంకోసం పనిచేసే యువకుల సేవ లు అవసరమని ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ కోడి అజయ్ అన్నారు. శనివారం స్థానిక రామ్ మందిరంలో జరిగిన ఏబీవీపీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి కరీంనగర్ విభాగ్ కన్వీనర్ కోడి అజయ్ హాజరై మాట్లాడుతూ జాతీయ పునర్నిర్మాణమే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశంలో రోజురోజుకు పెరుగుతున్న విదేశీ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పెద్దపల్లి నగర నూతన కమిటిని అజయ్ ప్రకటించారు. పెద్దపల్లి నగర కార్యదర్శిగా యతిరాజు అజయ్, జోనల్ ఇన్చార్జిలుగా ముమ్మడి అరవింద్, బోయిని రాకేష్, గోల్లే అన్వేష్, నగర ఉపాధ్యక్షులుగా సూర రామనుజం, గుర్రాల పవన్, ఆసం కృష్ణ వినోద్, వంశీ, నగర సంయుక్త కార్యదర్శిలుగా, కాల్వల శ్రీదత్త, చలకల ఆదిత్య, పాలేటి సాయి తేజ, పెనుగొండ రాజ్ కుమార్, ఎస్ఎఫ్ డి కన్వీనరుగా ఆగుల్ల మధుకర్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనరుగా కోయాడ బన్నీ, హాస్టల్స్ కన్వీనరుగా గణేష్, కార్యవర్గ సభ్యులు రాజ్, కళ్యాణ్, కౌశిక్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీపతి సాయి తేజ, శ్రీనివాస్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.


అస్తవ్యస్తంగా రహదారులు

- ఇబ్బందుల్లో ప్రయాణికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


ఇందుర్తి-గుంపుల రోడ్డు దుస్థితి (ఇన్‌సెట్లో) బాయమ్మపల్లిలో దిగబడిన ఆటో(ఫైల్)

నవతెలంగాణ-ఓదెల: మండలంలోని రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. చినుకు పడితే బురదమయంగా మారుతున్నాయి. ఓదెల మండలంలోని పొత్కపల్లి నుంచి గుంపుల జమ్మికుంటకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. మండలంలోని మానేరు నదిలో నుంచి ఇసుకను ఓవర్‌లోడుతో లారీలు తీసుకెళ్లడంతో రోడ్లన్నీ ధ్వంసమయవుతున్నాయి. నిత్యం వందలాది మంది ఈ రహదారి వెంట జమ్మికుంట, సుల్తానాబాద్, పొత్కపల్లి రైల్వే స్టేషన్ కు అధిక సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుంటారు. రోడ్లు సరిగా లేక ప్రమాదాలు జరిగిన సందర్భాలు చాలనే ఉన్నాయి. చినుకు పడితే ఆటోలు రోడ్డులో దిగబడుతున్నాయి. ఈ రహదారి వెంట ఆటోలు నడిపించాలంటే డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. పొత్కపల్లి నుంచి గుంపుల వరకు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంల శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయినా ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

వెంటనే రోడ్డును నిర్మించాలి



మండలంలోని పొత్కపల్లి నుంచి గుంపుల వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. వర్షాలు పడినప్పుడు రోడ్లన్నీ పూర్తిగా నీటితో నిండిపోతున్నాయి. ఈ రోడ్డు వెంట ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడి ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తే ఈ రోడ్డు వెంబడి ఆసుపత్రికి వెళ్లే లోపు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలి.

– బిసవేన కుమార్, శానగొండ గ్రామస్థుడు

ఆటోలు నడపలేక ఉపాధి కోల్పోతున్నాం..



పొత్కపల్లిలో పది సంవత్సరాల నుంచి ఆటో నడుపుకుంటూ జీవనం కొన సాగిస్తున్నా. పొత్కపల్లి నంచి గుంపుల, పొత్కపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్‌కు వెళ్లే దారిలో ఇసుక క్వారీల నుంచి అధిక లోడుతో వెళ్తున్న లారీలలో రోడ్డు ధ్వంసమయ్యాయి. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందు తున్నాం. దాదాపుగా 60 మంది ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నాం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మించాలి.

– సొల్లు రంజిత్, ఆటో డ్రైవర్

రోడ్డు సరిగా లేక ఆటోలు నడపలేక పోతున్నాం.



పొత్కపల్లి నుంచి గుంపుల, పొత్కపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఆటోలను నడపలేక ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోతున్నారు. రోడ్డు నిర్మిస్తామని శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి.

– రంగు ఆనంద్‌గౌడ్, పొత్కపల్లి ఆటో యూనియన్ ప్రెసిడెంట్

మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలి



మట్టి విగ్రహాలను అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

నవ తెలంగాణ-పెద్దపల్లి: పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్‌లు జే.అరుణశ్రీ, శ్యాం ప్రసాద్‌లాల్‌తో కలిసి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ మన దేశంలో అనేక మతాలు ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరి సంప్రదాయం ఇతరులకు సహాయం చేయడం, పర్యావరణ పరిరక్షణ గురించి చెబుతాయని అన్నారు. మన దేశంలో ప్రతి వర్గాలకు చెందిన వారందరూ కలిసి అన్ని పండుగలు ఘనంగా జరుపుకుంటారని కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణం కలుషిత మవుతుందని, దీని నివారణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని కోరారు. పర్యావరణ సంరక్షణ కోసం జిల్లాలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో రెండు వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ హైందవ సంప్రదాయం పర్యావరణాన్ని ప్రేమిస్తుందని, ఆ పర్యావరణ సంరక్షణ దిశగా మనమంతా మట్టి గణపతులను పూజించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, ఈ.డి. ఎస్సీ కార్పొరేషన్ మధుసూధన శర్మ, డి.ఎం. సివిల్ సప్లై, ఏ.డి. మైన్స్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ. శ్రీనివాస్, తహసీల్దార్ రాజ్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు ప్రకాష్, పద్మావతి, కలెక్టరేట్ సిబ్బంది, ఆర్.పి.లు, కలెక్టరేట్ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే తమ లక్ష్యం: సీఐ

నవతెలంగాణ-రామగిరి: మహిళల భద్రతే తమ లక్ష్యమని మంథని సీఐ గడిగొప్పుల సతీష్ అన్నారు. మండలంలో మహిళల రక్షణ కోసం శనివారం మంథని సీఐ గడిగొప్పుల సతీష్ ఆధ్వర్యంలో రామగిరి మండలం అన్ని ఆటోలకు క్యూఆర్ కోడ్ /యూనిక్ నంబర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంథని సీఐ సతీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆటో క్యూఆర్ కోడ్‌ను అమర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగిరి ఎస్సై కటిక రవి ప్రసాద్, రామగిరి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రత్నాపూర్‌లో 'స్వచ్ఛతాహి సేవా'


పాల్గొన్న సర్పంచ్ ప్రతిమపీవీరావు

నవతెలంగాణ-రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామంలో స్వచ్ఛ తాహి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ పల్లె ప్రతి మ పీవీరావు ఈ పనులను పరిశీలించారు. వివిధ కూడలిలో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. సెక్రెటరీ పెండ్లి రమ్య, వార్డు సభ్యులు సది, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ జూలపల్లి: మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కిరణ్, మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం పొగుల సుధాకర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ తోట లక్ష్మి, బాలరాజ్ పల్లి సర్పంచ్ కుంటూరి రాజయ్య, కాచాపూర్ సర్పంచ్ బంటు ఎల్లయ్య ఉన్నారు.

రైస్ మిల్ కార్మికుడి ఆత్మహత్య



సమ్మయ్య (ఫైల్)

నవ తెలంగాణ-సుల్తానాబాద్‌రూరల్: మండలానికి చెందిన గడిపెల్లి సమ్మయ్య (33) అనే రైస్ మిల్లు కార్మికుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సృజన తెలిపిన వివరాల ప్రకారం. సమ్మయ్య సుల్తానాబాద్‌లోని ఓ రైస్‌మిల్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం మహిళ గ్రూప్‌లో నెలవారీ డబ్బులు 22 వేల రూపాయలు చెల్లించాలని మృతుడి భార్యకు గ్రూపు సభ్యుల డబ్బులు ఇవ్వడంతో సమ్మయ్య వాటిని పోగొట్టుకున్నాడు. దీంతో గ్రూపు డబ్బులు ఎలా చెల్లిస్తామని మనోవేదనకు గురయ్యాడు. శనివారం తెల్లవారుజామున సమ్మయ్య ఇంట్లోనే ఉరేసుకున్నాడు.. మృతి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివపల్లి గ్రామానికి చెందిన అమ్ముల బుచ్చయ్య(60) అనే వ్యక్తి మృతిచెందాడు. పెద్దపల్లి నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఇటుక లారీ అదుపుతప్పి రోడ్డుపైన బుచ్చయ్యపై పడడంతో అక్కడికక్కడ మృతిచెందాడు. బుచ్చయ్య సుల్తానాబాద్ నుంచి శివపల్లికి ఆవులకు పశు గ్రాసం తీసుకొని వెళ్తున్న క్రమంలో ఒకసారిగా ఇటుక లారీ అదుపుతప్పి బుచ్చయ్యపై పడిందని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి సుల్తానాబాద్ సీఐ జగదీష్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గర్రెపల్లి సర్పంచ్‌కు అభినందనల వెల్లువ


సర్పంచ్‌ను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

నవతెలంగాణ- సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి గ్రామానికి స్వచ్ఛ సర్వేక్షన్ 2023 రాష్ట్రస్థాయి పురస్కారం రావడంతో సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు మీరగొని సుజాత-రమేష్‌గౌడ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సుజాతను గ్రామ కార్యదర్శి ప్రశాంత్ పాఠశాల హెచ్ఎం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధు, ఎంపీటీసీ పులి అనూష మాజీ సర్పంచ్ బొల్లం లక్ష్మణ్, ఆసరి రాజయ్య యాదవ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ దీకొండ శ్రీనివాస్, హెచ్ఎం మాధవీలత, విద్యా కమిటీ చైర్మన్ సంపత్ పాల్గొన్నారు.

ముత్తారం వార్తలు.

అన్ని వర్గాలకు బీజేపీతోనే న్యాయం


కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న సునీల్ రెడ్డి

నవతెలంగాణ-ముత్తారం: అన్ని వర్గాలకు బీజేపీతోనే న్యాయం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. ముత్తారం మండలం సందరెల్లి (ఖమ్మంపల్లి) గ్రామానికి చెందిన మహిళా నాయకురాలు కర్రే శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం సుమారు 200 మంది మహిళలు, యువకులు సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ముత్తారం మండల ఇన్‌చార్జి, జిల్లా అధికార ప్రతినిధి పోతారవేణి క్రాంతికుమార్, సీనియర్ నాయకులు పెయ్యాల కుమార్, అల్లం తిరుపతి, ఇసంపల్లి శ్రీనివాస్, కోరబోయిన మల్లికార్జున్, యువ నాయకులు కేక్కర్ల మహేష్, ఉప్పు వరుణ్, లక్ష్మి రాజాం, సోషల్ మీడియా కన్వీనర్ నాగరాజు ఉన్నారు.

అనవసరపు ఆరోపణలు చేస్తే ఊరుకోం..

నవతెలంగాణ-మంథని: ఎరుకల ఏకలవ్య సంఘంపై అనవసరపు ఆరోపణలు చేస్తే ఊరుకోం అని ఎరుకల ఏకలవ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర లింగయ్య హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంఘం 1999లో స్థాపించామని ఇందులో మంథని, కమాన్‌పూర్, ముత్తారం, మల్హర్, కాటారం మండలాలకు చెందిన 405 మంది సభ్యులున్నారన్నారు. తమ సంఘంపై రామగిరి మండలం జల్లారం గ్రామ సర్పంచ్ జగన్నాథుల హరీష్ అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. సంఘానికి కేటాయించిన భూమిని సొంతానికి వాడుకుంటున్నామని చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సారయ్య, రాజయ్య, ఉండాటి రాజేశం, సాయిలు, రాజయ్య, సమ్మయ్య, రాకేష్, జగన్నాథుల సది పాల్గొన్నారు.

'నవతెలంగాణ' ప్రతిభ పోటీల్లో రాణించిన విద్యార్థులు


మొదటి బహుమతి అందుకుంటున్న క్రిసెంట్ హైస్కూల్ విద్యార్థిని


ద్వితీయ బహుమతి అందుకుంటున్న నోబెల్ హైస్కూల్ విద్యార్థిని



కన్సోలేషన్ బహుమతి అందుకుంటున్న 'గాయత్రి' విద్యార్థిని


ప్రశంసా పత్రాలు అందుకుంటున్న పలువురు విద్యార్థులు


కన్సోలేషన్ బహుమతి అందుకుంటున్న కాకతీయ అరబిందో హైస్కూల్ విద్యార్థి సాయి దేవ హర్ష

నవతెలంగాణ-పెద్దపల్లిటౌన్: నవ తెలంగాణ నిర్వహించిన ప్రతిభ పోటీలలో పట్టణానికి చెందిన గాయత్రి హైస్కూల్, క్రిసెంట్ హైస్కూల్, నోబెల్ హైస్కూల్, జడ్పీహెచ్ఎస్ బాలికలు, ఇండియన్ మిషన్ హైస్కూల్, కాకతీయ అరబిందో పాఠశాలల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబర్చారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రణీత్ పిల్లల హాస్పిటల్ సౌజన్యంతో బహుమతులు అందించారు. ఈ పోటీలలో మొదటి బహుమతి క్రిసెంట్ విద్యాసంస్థలకు చెందిన జైనా మాలిక్, ద్వితీయ బహుమతి నోబెల్ హైస్కూల్‌కు చెందిన కలవేన స్ఫూర్తి, తృతీయ బహుమతి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌కు చెందిన పి.అద్వితలు గెలుపొందారు. ఆర్.సంజన (జడ్పీహెచ్ఎస్ బాలికలు), బి.అక్షర (గాయత్రి), జె.సాహితీ (గాయత్రి), స్ఫూర్తి (ఐఎంఎస్), నూర్‌ఫాతిమా(గాయత్రి), హసిని(కాకతీయ), వైష్ణవి (కాకతీయ), మునిభా అఫ్షిన్(క్రిసెంట్), మాహవీన్ ఖనమ్(క్రిసెంట్), సాయిదేవ హర్ష (కాకతీయ), మనిషా(నోబెల్)లు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. ప్రతిభ కనబరిచినవిద్యార్థులకు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందించారు.

ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా


మంథని: వినతి పత్రం అంజేస్తున్న అంగన్‌వాడీలు

నవతెలంగాణ-గోదావరిఖని: తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దష్టికి తీసుకువెళ్లాలని రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద అంగన్‌వాడీలు శనివారం ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదు రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె చేస్తున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో బాధకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నామని భిక్షపతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు కమలేష్, జి.జ్యోతి, ఎస్ రామలక్ష్మి, భాగ్యశ్రీ, రేష్మ, ఉమా, అంజన, రాజేశ్వరి, విజయ, రుక్మ, శోభ, సరోజన పాల్గొన్నారు.

నవతెలంగాణ-మంథని: అంగన్‌వాడీల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి అన్నారు. శనివారం మంథని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడి ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని ధర్నా చేశారు. అనంతరం ఎమ్మెల్యే సహాయకునికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు జి జ్యోతి, వనజరాణి, కే శోభ, హరిత, సులోచన, కృష్ణకుమారి, స్వరూప, రాధా, సీఐటీయూ నాయకులు బూడిద గణేష్, అర్ల సందీప్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాల్లో ఎస్‌డబ్ల్యూఎఫ్ పాత్ర కీలకం


జెండా ఎగురవేస్తున్న నాయకులు


నవతెలంగాణ-మంథని: 2001, 2005, 2019, సంవత్సరాలలో జరిగిన ఐక్య పోరాటాల్లో ఎస్‌డబ్ల్యూఎఫ్ పోషించిన పాత్ర ప్రధానమైనదని ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో అధ్యక్షుడు పల్లేర్ల ఆంజనేయులు అన్నారు. శనివారం మంథని ఆర్టీసీ డిపో ఎదుట టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ 45వ అభివృద్ధి దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేశారు. నాయకులు రవితేజ, సతీష్, శ్రీనివాస్, రాజయ్య పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ


విగ్రహాలను పంపిణీ చేస్తున్న జీఎం

నవతెలంగాణ-గోదావరిఖని: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని సింగరేణి ఆర్జీ-1 కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణ విభాగం, సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్జీ 1 జీఎం చింతల శ్రీనివాస్ హాజరై జీఎం కార్యాలయ ఉద్యోగులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రామ్మూర్తి, ఏజంట్ చిలుక శ్రీనివాస్, ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, డీజీఎం క్వాలిటీ ఎస్.శ్రీధర్, డిప్యూటి పర్సనల్ మేనేజర్ నరేస్ చక్రవర్తి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్స్ బంగారు సారంగపాణి, శ్రావణ్ కుమార్, సేవ కో అర్డినేటింగ్ ఆఫీసర్ హనుమంత రావు తదితరులున్నారు.

ఘనంగా ఇంజనీర్స్ దినోత్సవం


పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి

నవతెలంగాణ-గోదావరిఖని: భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా ఎన్టీపీసీ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పీటీఎస్‌కాలనీలోని కాకతీయ ఆడిటరియంలో ఇంజనీర్స్ డే వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి శ్రీ రామ చంద్రు తేజావత్, ఎన్టీపీసీ సీజీఎం కేదార్ రంజన్ పాండు హాజరై వేడుకలను ప్రారంభించారు. ముందు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అధి కారులు, అధికార సంఘం ప్రతినిధులు బిజయ్ కుమార్ సికధర్, నాయుడు, సోమ్ల భూక్యా సురేష్ బాబు, రాజేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, శోభన్, యూని యన్ల నాయకులు మల్లయ్య, వెంకటస్వామి తదితరులున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో పవర్ హౌస్ కాలనీలో నిర్వహించిన ఇంజనీర్స్ డే వేడుకలలో పాల్గొన్న బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు, రామగుండం లయన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్, ఇంజనీర్ అయినటువంటి సోమారపు లావణ్య-అరుణ్ కుమార్‌ను లయన్స్‌క్లబ్ ఆఫ్ రామగుండం మగువ సభ్యులు శనివారం సన్మానించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ సభ్యులు డాక్టర్ లక్ష్మివాణి, డాక్టర్ వనజ రాపోలు ఉన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపు: జీఎం

నవతెలంగాణ-గోదావరిఖని: క్రీడా పోటీలు క్రీడాకారుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని సింగరేణి ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఆర్జీ-1 ఏరియా వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్విభాగల వార్షిక క్రీడా పోటీల ప్రారంభోత్సవం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ హాజరై ఫుట్ బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయయన మాట్లాడుతూ డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఫుట్ బాల్, చెస్, క్యారమ్, హాకీ, బాస్కెట్ బాల్, లాన్ టెన్నిస్, అథ్లెటిక్, మహిళక త్రో బాల్, స్విమ్మింగ్, షటిల్, టేబుల్ టెన్నిస్, వాలి బాల్, కబడ్డి, క్రికెట్, బాడి బిల్డింగ్ తదితర పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కారక్రమంలో టిబిజికెఎస్ ఏరియా ఉపాధ్యక్షులు గండ్ర దామోదర్ రావు, చీఫ్ కో ఆర్డినేటర్, ఎజీఎం పర్సనల్ సిహెచ్.లక్ష్మినారాయణ, గౌరవ కార్యదర్శి బంగారు సారంగపాణి, సిఎంఓఏఐ నాయకులు పొనగోటి శ్రీనివాస్, వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆరెల్లి పోశయ్య, ఖయ్యూమ్, కె.సదానందం, మెండే శ్రీనివాస్, ఆకుల హరిణ్, సూపర్ వైజర్ రమేష్, కో ఆర్డినేటర్ రాజయ్య, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రామగుండంగా తీర్చిదిద్దడానికి కృషి

- మేయర్ బంగి అనిల్ కుమార్



జెండా ఊపి ప్రారంభిస్తున్న మేయర్

నవతెలంగాణ-గోదావరిఖని: స్వచ్ఛ రామగుండంగా తీర్చి దిద్దే ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్ కోరారు. రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా -2023 కార్యక్రమాన్ని శనివారం ఆయన పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్-స్వచ్ఛ తెలంగాణలో భాగంగా రామగుండం నగరంలో అనేక కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రతతో ప్రజల్లో అవగాహన పెంచామన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు , కల్వ చర్ల కష్ణ వేణి, కవితా సరోజినీ, తాళ్ల అమతమ్మ, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ రావు, ఆర్ఓ రాయలింగు, సూపరింటెండెంట్ మనోహర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్ సుందర్, హెల్త్ అసిస్టెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్, ఆర్ఐ కరుణాకర్, జూనియర్ అసిస్టెంట్ శంకర్‌రావు, నాయకులు తాళ్ల రాజయ్య, కల్వ శ్రీనివాస్, రాకం దామోదర్, రాజేందర్ పాల్గొన్నారు.

మంత్రి జగదీశ్వర్‌రెడ్డి ఆస్తులపై సీబీఐ విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: సూర్యాపేట నియోజకవర్గం శాసనసభ సభ్యులు, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రివర్యులు గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యుల ఆస్తులపైన సీబీఐ విచారణ చేపట్టాలని భారత యాదవ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్ ను రౌడీగా చిత్రీకరిస్తూ, కేసులు పెడుతూ విషయం చిమ్ముతున్న మరో నయాం మంత్రి జగదీశ్వర్‌రెడ్డి నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. రాష్ట్ర నాయకులు నరేష్ యాదవ్, జిల్లా కన్వీనర్ చెలకల గిరిధర్ యాదవ్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు మంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నవతెలంగాణ - జమ్మికుంట



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను ఇప్పటికైనా నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీవో కల్పనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రి ఇచ్చిన హామీలను ఇప్పటికైనా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే తిరిగి సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు పెరుగు అశోక్, కార్యదర్శి ఎండుగా రవీందర్‌రావు, కార్మికులు సాల సారయ్య, మేకమల్ల రాము, తిరుపతి, అశోక్, రవి, తిరుపతి, మొగిలి, ఓదెలు, ఉమా, మానస, వనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ - చొప్పదండి



ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘం సభ్యులు శనివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో గుమ్లాపూర్ మున్నూరు కాపు సంఘం సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి విషయ పరిజ్ఞానం అవసరం

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్



విద్యార్థిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

ప్రతి విద్యార్థికి పోటీతత్వంతో విషయపరిజ్ఞానం చాలా అవసరమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైన సందర్భంగా ప్రత్యేక అభినంధన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా సైన్స్ మ్యూజియంలో ఎస్సీఈఆర్టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసర్చ్, ట్రైనింగ్ హైదరాబాద్ సౌజన్యంతో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో పాఠశాలకు చెందిన ఎం.శ్రీహాసిని 9వ తరగతి, విశేష పరిజ్ఞానాన్ని ప్రదర్శించి న్యాయనిర్ణేతల మన్ననలను పొంది జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకోవడమే కాకుండా త్వరలో నిర్వహింపబడే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడానికై అర్హత సాధించడం కరీంనగర్ జిల్లాకే గొప్ప గర్వకారణమని చెప్పారు. పుష్పగుచ్ఛంతో పాటు జ్ఞాపికను ప్రదానం చేసి శుభాభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజయఢంకా మ్రోగించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించి నైపుణ్యానికి ప్రతీకగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలి

మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంత రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటు పడాలంటే మట్టి గణపతుల విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించాలని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలలో విద్యార్థులు మట్టి గణపతుల ప్రతిమలను తయారు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ - చొప్పదండి



పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలే శ్రేయస్కరమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని కాట్నపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర దేవస్థాన కమిటీ అధ్యక్షుడు గన్ను రాజు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గ్రామంలోని ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలన్నారు. రాజును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, కట్టేకోల లక్ష్మణ్, గన్ను శ్రీనివాసరెడ్డి, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రాజేశ్వరరావు సేవలు మరువలేనివి

నవతెలంగాణ - హుజురాబాద్ : మాజీ రాజ్యసభ సభ్యుడు వొడితల రాజేశ్వర్‌రావు ఈ ప్రాంతానికి చేసిన సేవలు మరువలేనివి అని పలువురు వక్తలు అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద వొడితల రాజేశ్వరరావు జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నేత వొడితల ప్రణవ్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ - జమ్మికుంట : ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయిన ఘటన జమ్మికుంట మండలంలోని కోరపల్లి క్రాస్ రోడ్డు వద్ద శనివారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన లింగయ్య, మొగిలయ్య జమ్మికుంట నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో కోరపల్లి క్రాస్ రోడ్డు వద్ద మట్టి తరలిస్తున్న టిప్పర్ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారిద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

రైలు పట్టాలపై మృతదేహం లభ్యం



నవతెలంగాణ - కరీంనగర్ క్రైం : కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో లూప్ లైన్ కేఎం నెంబర్ 35/1-2 మధ్య శుక్రవారం రాత్రి ఒక గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైంది. బహుశా కరీంనగర్ నుంచి కాచిగూడకి వెళ్ల ప్యాసెంజర్ ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకొని చనిపోయి ఉండవచ్చని, ఏదైన ఇతర కారణం వల్ల చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 40-45 సంవత్సరాలు ఉంటుందని, ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. మెరున్ రంగు ఫుల్ షర్ట్, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. శవాన్ని కరీంనగర్ జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీలో భద్రపరిచారు. వివరాలు తెలిస్తే రామగుండం ప్రభుత్వ రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి.తిరుపతి ఫోన్ నెంబర్ 9949304574, 8712658604కి తెలపాలని పోలీసులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ - శంకరపట్నం : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన శంకరపట్నం మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. పెగడపల్లి గ్రామానికి చెందిన మల్యాల శ్రీనివాస్ (38) కొత్తగట్టు గ్రామంలో గొర్ల కాపరిగా పనిచేస్తున్నాడు. తన సైకిల్ మీద కొత్తగట్టు నుండి మొలంగూర్ వెళ్తుండగా పెద్దమోరి దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సమగ్ర ఓటరు జాబితా రూపొందించాలి

ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ సి.సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ సి.సుదర్శన్‌రెడ్డి

అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే పూర్తిస్థాయిలో మెరుగైన ఓటరు జాబితాను రూపొందించగలుగుతామని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ సి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, వివిధ పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో రోల్ అబ్జర్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఆరోగ్యవంతమైన ఓటరు జాబితాను రూపొందించడానికి బూత్ స్థాయి అధికారులతో పాటు పార్టీల తరపున కూడా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి మాట్లాడుతూ.. జిల్లాలో ఆగస్టు 21, 2023 వరకు జిల్లాలో 10,13,937 ఓటర్లు ఉన్నారని అందులో 502038 మంది పురుషులు, 511852 మంది మహిళలు, 47 మంది థర్డ్ జెండర్లు ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. ఎస్ఆర్ఐ 116, సర్వీస్ ఓటర్లు 583 కూడిన 2వ ఎస్ఎస్ ఆర్ డ్రాఫ్ట్ రోల్‌ను ప్రచురించి పొలిటికల్ పార్టీలకు అందించడంతో పాటు వాటిపై అభ్యంతరాలను స్వీకరించడానికి ఆగస్టు 26, 27, సెప్టెంబర్ 2, 3వ తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్‌లు నిర్వహించినట్టు చెప్పారు. జులై 16 నుంచి ఆగస్టు 15 ఈఆర్ఓ నెట్ ద్వారా 61048 ఫామ్ 6, 6ఏ, 7, 8 దరఖాస్తులను స్వీకరించామన్నారు. ఈ నెల 19లోగా వచ్చిన అభ్యంతరాలు, ఆక్షేపణలను సవరించుకోవడానికి అవకాశం ఉందని, అనంతరం 28 వరకు వచ్చిన ఆక్షేపనలు, అభ్యంతరాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు అక్టోబర్ 4న ఫైనల్ పబ్లికేషన్ ఆఫ్ ఎలక్టోరోల్‌ను ప్రచురిస్తామని తెలిపారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలలోని 1338 పోలింగ్ కేంద్రాలకు ఈఆర్ఓలను, ఏఈఆర్ఓలను నియమించామని చెప్పారు. 41663 పీడబ్లూడీ ఓటర్లను గుర్తించడం జరిగిందని, వారందరి కోసం ఏర్పాట్లను చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఓటరు జాబితాలో పేరు తనిఖీ చేసుకోవడానికి క్యూఆర్ కోడ్, 1950 టోల్ ఫ్రీ నెంబర్‌తో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఆర్ఓలు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ఎస్.రాజు, ఇన్‌చార్జి డీఆర్ఓ పవన్ కుమార్, కరీంనగర్ ఆర్డీఓ కె.మహేశ్వర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గాలి అనిల్ కుమార్, రహమత్ హుస్సేన్, బండ రమణారెడ్డి, మిల్కూరి వాసుదేవరెడ్డి, నత్తినేని శ్రీనివాస్, అబ్బాస్ సమీ,కళ్యాడపు ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

'అఖిరా'లో 27మందికి ఉచితంగా మెదడు, వెన్నెముక ఆపరేషన్లు

ప్రతియేటా ఉచిత అపరేషన్ల శిబిరాలను కొనసాగిస్తాం

ప్రముఖ న్యూరో సర్జన్ (మెదడు, వెన్నెముక) వైద్యుడు డాక్టర్ డి.రాజశేఖర్



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ జిల్లాకేంద్రంలోని కోర్టు చౌరస్తాలోని అఖిరా హాస్పిటల్ న్యూరో, ట్రామా కేర్ సెంటర్‌లో ఉచితంగా మెదడు, వెన్నెముక ఆపరేషన్లు పదిరోజుల పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం అఖిరా హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ న్యూరో సర్జన్ (మెదడు, వెన్నెముక) వైద్యుడు డాక్టర్ డి.రాజశేఖర్ మాట్లాడుతూ పది రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి చాలా రకాల ఇబ్బందులతో పేషంట్లు వచ్చారన్నారు. ఆపరేషన్ అవసరమైన వారు 27మంది పేషంట్లకు ఆపరేషన్లు చేశామని తెలిపారు. ఇందులో 16 డిస్క్ ఆపరేషన్లు, 5స్పైన్ ఫ్రక్షన్, 3 సర్వైకల్‌స్పైన్ , 3బ్రెయిన్ ఆపరేషన్లు చేశామని చెపాపరు. 24మంది పేషెంట్లు డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. మిగితా వారు మరో రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారన్నారు. అనంతరం హాస్పిటల్ సీఈవో బద్దం దీపక్‌రెడ్డి, చీఫ్ ఇన్‌చార్జి అంకం భరత్ మాట్లాడుతూ ఉచిత శిబిరానికి మంచి స్పందన లభించిందన్నారు. నిరుపేద పేషెంట్లకు ఉచితంగా ఆపరేషన్లు చేయడం ద్వారా వారు కోలుకున్నాక పట్టలేని సంతోషంగా ఉందని చెప్పడం సంతృప్తిగా ఉందన్నారు. గతేడాది నుంచి ఇలా ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నామని, ప్రతి యేటా ఇలాంటి శిబిరాల ద్వారా నిరేపేద ప్రజలకు ఆనందకరమైన, సంతోష జీవితాన్ని అందించాలన్నదే అఖిరా హాస్పిటల్ ప్రయత్నమని తెలిపారు. విజయవంతంగా ఆపరేషన్లు చేసి రోగుల పాలిట దేవునిగా నిలిచిన మా డాక్టర్ రాజశేఖర్, హాస్పిటల్ స్టాఫ్ అందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజలు వెన్నెముక, మెదడు సమస్యలతో ఇబ్బందిపడే వారికి న్యూరో సర్జన్ తమ హాస్పిటల్ 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. మల్టీస్పెషాలటీ సేవలు అందుబాటులో ఉన్నాయని.. మెరుగైన సేవలకు కేరాఫ్‌గా అఖిరా హాస్పిటల్ ఉంటుందని చెప్పారు. సమావేశంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

'అల్ఫోర్స్ బ్లిస్‌బాష్-2023' మేనేజ్‌మెంట్ మీట్ వేడుకలు

నవతెలంగాణ - కరీంనగర్





స్థానిక రాజశ్రీ కన్వెన్షన్‌లో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు 'అల్ఫోర్స్ బ్లిస్‌బాష్-2023' పేరున మేనేజ్‌మెంట్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐపీఈ ప్రొఫెసర్, మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం హెడ్ వై.రామకృష్ణ మాట్లాడుతూ.. మహిళలకు స్వాభావికంగా నిర్వహణ సామర్థ్యాలు ఉంటాయని, వాటిని పెంపొందించుకోవడానికి ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో ప్రవేశాలను పొందడానికి క్యాట్, మ్యాట్ లాంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం అవ్వాలన్నారు. విద్యార్థి దశలోనే జీవితానికి గమ్యాన్ని నిర్దేశించుకోవాలని, దాన్ని సాధించడానికి వచ్చే అడ్డంకులను అధిగమించేలా ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థినులు ఉద్యోగం కోసం అన్వేషణ కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి రావాలని, దాని కోసమే కళాశాలలో నిర్వహిస్తున్న వివిధ నైపుణ్య శిక్షణలను ఉపయోగించుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ గుండా శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులు పంపిణీ



నవతెలంగాణ - కరీంనగర్ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 37వ డివిజన్ రాంనగర్‌లోని శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయం ఎదుట మట్టి వినాయకులను డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ శ్రేణులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

నవతెలంగాణ - చొప్పదండి : మట్టితో తయారుచేసిన గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని వీణాదారి పాఠశాల కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ కోరారు. చొప్పదండి మండల కేంద్రంలోని వీణాదారి విద్యానికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదవ మహాసభ ఉపాధ్యక్షుడిగా పరుశురాములు

నవతెలంగాణ - గంగాధర : అఖిల భారత యాదవ మహాసభ గంగాధర మండల శాఖ ఉపాధ్యక్షుడిగా ఈరవేణి పరుశరాములు నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మాదం ఐలయ్య నియామకపత్రాన్ని అందించారు. సంఘం విలువలను కాపాడుతూ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు.

బీసీనైన తనకే టికెట్ కేటాయించాలి

పీసీసీ సభ్యుడు ప్యాట రమేష్

నవతెలంగాణ - వీణవంక : హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అగ్ర కులాల నాయకుల పెత్తనంతో బీసీలు అణగదొక్కబడుతున్నారని, ఈ బీసీనైన తనకే టికెట్ కేటాయించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్యాట రమేష్ అధిష్టానాన్ని కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కోసం 20సంవత్సరాలకుపైగా కష్టపడుతున్న తనకే టికెట్ కేటాయించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నల్ల కొండాల్‌రెడ్డి, ఒడ్డెపల్లి కొమురయ్య, ఉయ్యాల తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని రాగంపేట గ్రామ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని మండల పంచాయతీ అధికారి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామపంచాయతీకి దాత పేరం కిషన్ వారి తల్లిదండ్రులు పేరం బక్కయ్య - గంగమ్మ, భార్య విజయలక్ష్మిల జ్ఞాపకార్థం అంతిమయాత్ర (ట్రాక్టర్) వాహనాన్ని డొనేట్ చేశారు. ఈ సందర్భంగా పేరం కిషన్‌కు ప్రజల పక్షాన మండల పంచాయతీ అధికారి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ - జమ్మికుంట : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 17న(నేడు) తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలని జమ్మికుంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగురి సదయ్య అన్నారు. శనివారం జమ్మికుంటలో పట్టణ, మండల ముఖ్యకార్యకర్తల సమావేశం కొత్తపల్లిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కసుబోసుల వెంకన్న, రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మొలుగూరి సదయ్య హాజరై మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, పట్టణ, మండల అధ్యక్షులను శాలువాలు, పూలమాలతో కార్యకర్తలు సన్మానించారు. నియోజకవర్గ మైనారిటీ సెల్ చైర్మన్ ఎండి.సలీం పాషా, ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.ఇమ్రాన్, నాయకులు ఎండి.సలీం, పింగిలి రాకేష్, పైడిపల్లి అయోధ్య, సింగిరెడ్డి రంజిత్‌రెడ్డి, చిన్నింటి నాగేంద్ర, బుర్ర కుమార్, తిరుపతిరావు పాల్గొన్నారు.

సర్పంచుల ఫోరం అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ - సైదాపూర్



వెన్కేపల్లి-సైదాపూర్ మండల సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడిగా వెన్కేపల్లి సర్పంచ్ కొండ గణేష్‌ను శనివారం సన్మానించారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో, పోలీస్ స్టేషన్‌లో సర్పంచ్ కొండ గణేష్‌ను ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో పద్మావతి, తహసీల్దార్ మంజుల, ఎస్ఐ ఆరోగ్యం సన్మానించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు కొత్త రాజిరెడ్డి, గాజర్ల సదానందం, ఏనుగుల ఐలయ్య, ఆవునూరి పాపయ్య, బత్తుల కొమురయ్య, బొడిగ పద్మజకొమురయ్య, కందుల విజయనారాయణరెడ్డి, అబిడి పద్మరవీందర్‌రెడ్డి, చింత లతకుమారస్వామి, మిడ్డిదొడ్డి సరితరమేష్, రేగుల సుమలతఅశోక్, తొంట కాంతమ్మ, శిరీష సంపత్‌రెడ్డి, గుండేటి సునీతరాణి జయకృష్ణ, పైడిమల్ల సుశీలతిరుపతి, అక్షయ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, సీనియర్ అసిస్టెంట్ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని రైతులు అధైర్యపడవద్దు

నవతెలంగాణ - గన్నేరువరం : అర్హులైన ప్రతి రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ జరుగుతుందని.. రైతులు అధైర్యపడవద్దని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు కుసుకుల కొండాపూర్ రైతు వేదికలలో మండల పరిధిలోని బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కిరణ్మై రుణమాఫీ కటాఫ్ డేటుపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ 2018 డిసెంబర్ 12 లోపు పంట రుణం తీసుకున్న రైతులకు రైతు రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా, మండల కోఆర్డినేటర్లు గుడెల్లి తిరుపతి, బద్దం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో వినాయక చవితి ఉత్సవ్

నవతెలంగాణ - కరీంనగర్ :



వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ట్‌లో ముందస్తు వినాయక చవితి ఉత్సవ్‌ను ప్రారంభించారు. పాఠశాల నిర్వాహకుడు వి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. పండుగలలో వినాయచవితికి ప్రత్యేకత ఉందన్నారు. మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షకులుగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుజనుల బాహుబలి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ - రామడుగు



బహునుల బాహుబలి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో సర్వాయి పాపన్న విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గౌడన్నలకు గుర్తింపునిచ్చి తాటి, ఈతచెట్ల శిస్తును రద్దు చేసిందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు, గోపాల్‌రావుపేట సర్పంచ్ కర్ర సత్యప్రసన్నవెంకటరాంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు గంట్ల జితెందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎలగందల్లో తాటి విత్తనాలు నాటిన ఎంపీపీ

నవతెలంగాణ - కొత్తపల్లి



మండలంలోని ఎలగందల్ గ్రామంలో శనివారం కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ తాటి విత్తనాలను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ బీహార్ రాష్ట్రం నుండి తాటి విత్తనాలను ప్రత్యేకంగా తెప్పించారన్నారు. ఈ తాటి చెట్లు ఈత చెట్ల వలె చిన్నగా ఉంటాయని, దాదాపు ఐదు ఆరు సంవత్సరాల్లోనే కల్లు గీతకు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ షర్మిలప్రకాశ్, ఎంపీటీసీ మంద రమేష్‌గౌడ్, ఉపసర్పంచ్ బోనాల నరేష్, కార్యదర్శి విజయలక్ష్మి, ఎక్సైజ్ ఎస్సైలు స్వప్న, సింధు, ఎక్సైజ్ సిబ్బంది, గౌడ సంఘం అధ్యక్షుడు ఆరె పర్శరాంగౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ - హుజురాబాద్ : హైదరాబాద్‌లో ఈ నెల 17న సోనియాగాంధీ హాజరయ్యే కాంగ్రెస్ విజయభేరి సభను కాంగ్రెస్ నాయకులు విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలయ్య కోరారు. శనివారం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, మండల అధ్యక్షుడు కొల్లూరు కిరణ్, జిల్లా మహిళా నాయకురాలు ఆలేటి సుశీల, పట్టణ అధ్యక్షురాలు ఏముల పుష్పలత, మైనార్టీ అధ్యక్షుడు అప్సర్, నాయకులు కొలిపాక సారయ్య, అప్పాల రఘుపతి పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు ప్రత్యేక వైద్య శిబిరం

నవతెలంగాణ - హుజురాబాద్ :



జాతీయ ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ ఏరియా హాస్పిటల్‌లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 35మందికి ప్రత్యేక చికిత్స చేసి, ఫిజియోథెరపీ నిర్వహించి మందులు, పండ్లు పంపిణీ చేశారు. ఆరోగ్య అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ చందు, సీఓఎంసీడీ డాక్టర్ సుజాత, జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ శిల్పారెడ్డి, సైదాపూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, హుజురాబాద్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సురేష్, ఎంపీహెచ్ఈఓ సీహెచ్.రమేష్, హెచ్ఎస్ సమ్మయ్య పాల్గొన్నారు.

మట్టి వినాయకున్నే పూజిద్దాం..

నవతెలంగాణ - సైదాపూర్ : మండలంలోని వెన్నంపల్లి జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ తీస్తూ గ్రామ పౌరులందర్నీ మట్టి వినాయకులనే పూజించాలి పర్యావరణాన్ని పరిరక్షించాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. అంబేద్కర్ కూడలిలో గ్రామ పౌరులందరికీ విద్యార్థులచే తయారు చేయించిన మట్టి గణపతులను ఉచితంగా అందజేశారు. విద్యార్థులను ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు కేతిరి శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, పిఈటి రవీందర్ పాల్గొన్నారు.

రుతుక్రమంపై అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ - రామడుగు : రైజింగ్ సన్ యూత్ క్లబ్,ఆదరణ సేవా సమితి ఆధ్వర్యములో కొక్కెరకుంట గ్రామంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో మహిళలకు రుతుక్రమంపై అవగాహన కల్పించి, సానిటరీ నాప్కిన్స్ అందించారు.ఈ సందర్భంగా ఆదరణ సేవా సమితి అధ్యక్షురాలు కర్రె పావని రవి మాట్లాడుతూ మహిళలు రుతుక్రమ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుప్పొంతల అభిషేక్‌రెడ్డి, జిల్లా యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జేరిపోతుల నర్సయ్య, గల్ఫ్ జేఏసీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చిలుముల రమేష్, ఆదరణ సేవా సమితి సంస్థ సభ్యులు లావణ్య, అనిత, అంగన్వాడీ టీచర్లు గజ్జెల అంజలి, బలిని కనుకలక్ష్మి, ఆశా వర్కర్లు, యువజన సంఘం సభ్యులు జేరిపోతుల మహేష్, గజ్జెల నవీన్, జేరిపోతుల అజయ్, జేరిపోతుల వెంకటేష్ పాల్గొన్నారు.

అవినీతి రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

పౌర సరఫరాల కమిషనర్‌కు సీపీఐ ఫిర్యాదు


నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలో అక్రమంగా బియ్యం వ్యాపారాన్ని నడిపిస్తూ పేద ప్రజల వచ్చే పీడీఎస్ బియ్యంతో దందా చేసిన రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని పౌర సరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైస్ మిల్లర్సులలో కొంతమంది దళారులను ఏర్పాటు చేసుకొని రూపాయి కిలోబియాన్ని ప్రజల నుంచి కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.

బీసీ సంక్షేమ హాస్టల్లో సీట్ల సంఖ్యను పెంచాలి

నవతెలంగాణ - కరీంనగర్ : బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సీట్ల సంఖ్యను పెంచాలని, అలాగే పెంచిన మెస్‌చార్జీలను ఈ నెల నుంచే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషిని ముఖ్య కార్యదర్శి బూర వెంకటేశంగౌడ్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాలకు, మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. వర్కర్ల సంఖ్యను 5 నుంచి 10 మందికి పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు.

కాచాపూర్ గ్రామానికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

నవతెలంగాణ - శంకరపట్నం



స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ-2023 అవార్డు 2 కేటగిరి కింద 2 వేలనుండి 5 వేల జనాభా కలిగిన శంకరాపట్నం మండలం కాచాపూర్ గ్రామానికి వచ్చింది. అవార్డును శనివారం శంకరపట్నం ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీఓ బసీరుద్దీన్ చేతుల మీదుగా కాచాపూర్ గ్రామా సర్పంచ్ కొండ్ర రాజయ్య, గ్రామ కార్యదర్శి గంగాజమున అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజయ్య మాట్లాడుతూ సహకరించిన గ్రామస్తులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐలయ్యకు ఆజాది కా అమృత్ మహోత్సవ్ అవార్డు

నవతెలంగాణ - గంగాధర :



గంగాధర మండలం కుర్మపల్లి గ్రామానికి చెందిన ఒగ్గరి ఐలయ్య ఆజాది కా అమృత్ మహోత్సవ్ అవార్డును కైవసం చేసుకున్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈ అవార్డును దేశ రాజధాని ఢిల్లీలో ఉప రాష్ట్రపతి జగదీప్ దానకారి, కేంద్ర మంత్రి అరుణ్ మేగ్వాల్, మీనాక్షి లేఖి, సంగీత నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ సంధ్య పురేచా చేతుల మీదుగా ఒగ్గు కథ కళాకారుడు ఒగ్గరి ఐలయ్య అవార్డు అందుకున్నారు. అవార్డు స్వీకరించిన ఐలయ్యను ఆ గ్రామ ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, పలువురు అభినందించారు.

'వృందా' భూ దందా

కబ్జాకు గురికానున్న 22 ఎకరాల కుంట శిఖం, పోరంబోకు భూమి

- 3 కుంటలు, గుట్టల ఆక్రమణకు యత్నం
- పట్టా భూముల్లో ఫ్యూటర్ ఎక్స్‌టెన్షన్ ప్లాట్స్‌గా బ్రోచర్
- జయలక్ష్మి పట్టా భూమి ఆక్రమణ, నాట్లువేసి దౌర్జన్యం
- మత్స్యకారులను కూడా వేటకు పోనియ్యని వైనం
- ఫారెస్ట్ భూమిలోంచి వెంచర్‌కు బాట అంటూ ప్రచారం
- వృందా వాలీ ప్రీమియం ఫార్మ్‌లాండ్ కమ్యూనిటీ పేర దందా
- కబ్జాదారులకు రాజకీయ అండ




నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కాదేదీ కబ్జాకు అనర్హం అన్నట్లుగా మారింది భూ దందా పరిస్థితి. రాజకీయ అండతో రియల్ ఎస్టేట్ భూ దందా సాగుతోంది. ఎకరాల్లో కొనుగోలు.. గుంటల్లో అమ్మకాలు చేస్తూ కోట్లు గడిస్తున్నారు. కుంట శిఖం, గుట్టలు, పోరంబోకు, అసైన్డ్ భూముల్ని ఆక్రమించాలని చూస్తున్నారు. పట్టా భూముల్ని అమ్మకపోతే దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారు. కుంటల్లో చేపలు పట్టేందుకు మత్స్యకారులు, శివారు భూముల్లోకి పట్టాదారులు పోయే నక్షా బాటను కబ్జా చేశారు. గేట్ పెట్టి దారిలేదు పొమ్మంటూ గెంటేస్తున్నారు. పక్కనున్న భూముల్ని తక్కువ ధరకు అమ్మండి..? లేదంటే ఆక్రమణే అంటూ బెదిరిస్తూ దౌర్జన్యం చేస్తున్నారు. పట్టా భూమిలో కడీలు నాటి దౌర్జన్యంగా ఆక్రమించి సాగు చేస్తున్నారు. పక్కనున్న కుంట శిఖం, గుట్టలు, పోరంబోకు, అసైన్డ్ భూముల్ని వెంచర్‌లో కలిపేసుకునే కుట్ర సాగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. రూ.22 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూముల్ని కాజేసేందుకు జరుగుతున్న 'వృందా దందా'పై నవతెలంగాణ పరిశీలనాత్మక కథనం..!

మెదక్ జిల్లా శివంపేట మండలం కాంతాన్‌పల్లి, వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ శివారులో 'వృందా వ్యాలీ ప్రీమియం ఫార్మ్‌ల్యాండ్ కమ్యూనిటీ' పేరిట 65.37 ఎకరాల్లో భారీ వెంచర్ వేశారు. గుంటల చొప్పున 153 ప్లాట్స్ చేశారు. వందల ఎకరాల్లో రియల్ దందా చేసేందుకు వచ్చిన వృందా కంపెనీకి స్థానిక అధికార పార్టీ ప్రజా ప్రతినిధి అండగా నిలిచారు. 80 ఎకరాల భూముల్ని వ్యాపారం కోసం రైతుల నుంచి ఇప్పిస్తానని బేరం కుదుర్చుకున్నారు. తాను స్థానిక చిన్న చిన్న రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన 65.37 ఎకరాల్లో వెంచర్ చేశారు. మిగతా ఇద్దరు రైతులకు ఉన్న 22 ఎకరాల్ని కూడా కొనేందుకు పూనుకున్నారు. ఆ రైతులు అమ్మేందుకు ఇష్టపడకపోయేసరికి దౌర్జన్యం చేస్తున్నారు. ఒక పక్క రెరా రూల్స్ ఉల్లంఘిస్తూనే మరో పక్క కబ్జాలకు పాల్పడుతు న్నారు. మత్స్యకారుల్ని చేపల వృత్తికి దూరం చేశారు. రైతుల పట్టా భూమిని ఫ్యూచర్ ఎక్స్‌టెన్షన్ వెంచర్‌గా బ్రోచర్‌లో వేశారు. రెండు వెంచర్ల మధ్య అటవీ శాఖ భూమి ఉంది. అందులోంచి బాట వేసినట్టు బ్రోచర్‌లో ముద్రించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

మూడు కుంటలు ఆక్రమణకు యత్నం

వృందా వెంచర్ కుంటలు, గుట్టల్ని ఆక్రమించేందుకు పూనుకుంది. వెంచర్ కింద మూడు కుంటలతో పాటు శిఖం భూములున్నాయి. సర్వే నెంబర్ 341లో ఉన్న కరీంకుంట 3.30 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో కొంత భూమిని వెంచర్‌లో కలిపేశారు. దీని కిందనే హస్తాల్‌పూర్ శివారులో 5 ఎకరాల విస్తీర్ణంలో గుళ్లకుంట ఉంది. దాని కిందనే 4 ఎకరాల విస్తీర్ణం కల్గిన మాసానికుంట ఉంది. ఈ మూడు కుంటలు వర్షాధారంగా నిండుతాయి. గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలకు తాగునీరు, మేత అవసరాలకు చుట్టు పక్కల రైతులు ఉపయోగిస్తారు. మూడు కుంటల్లోనూ మత్స్యకారులు చేపలు పెంచుతారు. మెయిన్ రోడ్డు నుంచి ఈ కుంటలకు వెళ్లేందుకు నక్షా డొంక బాట ఉంది. వృందా వాళ్లు ప్లాట్స్ చేసి ఆ డొంకను వెంచర్‌లో కలిపేశారు. రోడ్డు వద్ద గేటు పెట్టి సెక్యూరిటీ పెట్టారు. కింది భాగంలో ఉన్న కుంటలు, ఇతర రైతుల భూములకు వెళ్లేందుకు ఉన్న బాట లేకుండా పోయింది. ఇద్దరు పట్టాదారుల భూముల్ని కొనేస్తే ఆ ప్రాంతానికి ఎవ్వరూ వెళ్లరు. దాంతో ఆ మూడు కుంటల్ని కూడా వెంచర్‌లో కలిపేసుకునే ప్రమాదముందని స్థానికులు చెబుతున్నారు. కుంటల ఎఫ్‌టీఎల్ పరిధిలోని శిఖం భూములు, గుట్టలు, పోరంబోకు, అసైన్డ్ భూమి 22 ఎకరాల వరకుంటది. ట్రిపుల్ ఆర్ రోడ్డు వస్తుండటంతో అక్కడ ఎకరం ధర దాదాపు కోటి పలుకుతుంది. 22 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేయనున్న వృందా సంస్థపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టా భూమి ఆక్రమణ.. బాట బందు.. దౌర్జన్యం

వృందా వెంచర్ సంస్థ కొనుగోలు చేసిన భూముల కింది భాగంలో జయలక్ష్మీ, విశ్వనాథం అనే రైతులకు పట్టా భూములున్నాయి. విశ్వనాథంకు 14.20 ఎకరాలు, జయలక్ష్మికి 7.19 ఎకరాల భూమి ఉంది. జయలక్ష్మి పాలొళ్లకు చెందిన 7.19 ఎకరాల భూమిని పీఏసీఎస్ చైర్మెన్, బీఆర్ఎస్ నాయకులు వెంకట రాంరెడ్డి కొనుగోలు చేశారు. తన భూమికి వెంచర్ చేసిన భూమికి మధ్యలో జయలక్ష్మి, విశ్వనాథంకు చెందిన 22 ఎకరాల భూమి ఉన్నది. ఆ భూమిని తక్కువ ధరకే కొనుగోలు చేసి వెంచర్‌లో కలిపేసుకోవాలని సదరు లీడర్ అనుకున్నారు. తద్వారా పక్కనే ఉన్న గుట్ట భూముల్ని కూడా కలిపేసుకోవచ్చు. అందుకే ఆ ఇద్దరి భూముల్ని కొనుగోలు చేసేందుకు తక్కువ ధరకు అడిగారు. వాళ్లు అమ్మేందుకు సిద్ధపడలేదు. జయలక్ష్మి తన 7.19 ఎకరాల భూమిని చదును చేసి పొలం చేసింది.

బోర్లు, బావులు తవ్వి పంట పండిస్తుంది. కుటుంబ అవసరాలరీత్యా ఆమె హైదరాబాద్‌లో ఉంటూ కౌలుదారుని చేత సాగు చేయిస్తుంది. ఆమె భూమిని కాజేయాలని చూసిన చైర్మెన్ దౌర్జన్యంగా రెండు నెలల క్రితం జయలక్ష్మి భూమిలో కడీలు పాతాడు. తన పొలంలో పోసిన నారుమడిని చెడగొట్టాడు. చైర్మెన్ దౌర్జన్యం గురించి గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేస్తే ఎవ్వరు పిలిచినా పంచాయతీకి రాలేదు. పైగా జయలక్ష్మి భూమిని కౌలుకు సాగు చేస్తున్న వ్యక్తిని బెదిరించి పొలంలోకి రానివ్వలేదు. బాట ఆక్రమించి పొలంలోకి జయలక్ష్మిని కూడా వెళ్లనీయలేదు. ఎవ్వరూ అక్కడికి రాకుండా చేసిన వెంకట్ రాంరెడ్డి జయలక్ష్మి పట్టా భూమిలో వరి నాట్లు వేసి ఆక్రమించాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే మీ పాలొళ్ల భూమిని నేను కొన్న. దానిలోకి జయలక్ష్మి వెళ్లాలని, ఆమె భూమి తనకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. దాంతో ఆమె మెదక్ ఎస్పీ ప్రియదర్శినికి ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీధర్ విచారించి చైర్మెన్‌పై కేసు నమోదు చేశారు.

నా భూమి ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారు



నా భూమిని వెంకటరాంరెడ్డి ఆక్రమించారు. 7.19 ఎకరాల పట్టా భూమిలో బోరు వేసినం. బావి తవ్వుకున్నం. పొలాలు అచ్చుకట్టి పంట పండిస్తున్నం. ఎన్నో ఏండ్ల క్రితం మా పాలొళ్లతో భూమి పంపిణీ చేసుకున్నం. ఇటీవల మా పాలొళ్ల భూమిని కొనుగోలు చేసిన చైర్మెన్ మా భూమిని కూడా అమ్మాలని బెదిరించాడు. నేను అమ్మనంటే బాట మూసేసి పోనియ్యలేదు. కౌలుదారుడ్ని బెదిరించి పంట వేయనీయలేదు.

మా భూమిలో కడీలు పాతిండు. మేం నారు పోస్తే చెడగొట్టిండు. మమ్ముల్ని బెదిరించి మా పొలాల్ని ఆక్రమించి పంట వేశారు. నక్షాలో డొంగ బాట ఉంటే దాన్ని వెంచర్‌లో కలిపి గేటు పెట్టి మమ్ముల్ని పోనిస్తలేరు. న్యాయం చేయాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దగ్గరికెళ్తే... 'గొడవెందుకు భూమిని అమ్మేయండి' అన్నాడు. పెద్ద మనుషులకు చెప్పినా లెక్కచేయలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. మాకు న్యాయం జరగాలి.

జయలక్ష్మి, కొంతాన్‌పల్లి

అదానీ డొల్ల కంపెనీకి మారిషస్ షాక్..

- ప్రధాన ఇన్వెస్టర్ ఐఐఎఫ్ఎం లైసెన్స్ రద్దు
- పలు విత్త చట్టాల ఉల్లంఘనలు
- ఫైనాన్సియల్ సర్వీసెస్ కమిషన్ చర్యలు



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడిగా పేరున్న గౌతం అదానీ కంపెనీల్లో డొల్ల పెట్టుబడులు పెడుతోన్న కంపెనీల చిట్టాలు బయటపడుతున్నాయి. తాజాగా మారిషస్ కేంద్రంగా పని చేస్తోన్న ఓ సంస్థ అదానీ కంపెనీల్లో అక్రమ పెట్టుబడులు పెడుతూ.. మనీలాండరింగ్‌కు పాల్పడుతోన్న వైనం బట్టబయలయ్యాయి. ఎమర్జింగ్ ఇండియా ఫండ్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఇఐఎఫ్ఎం) దొడ్డిదారి పెట్టుబడుల వ్యహారాన్ని గర్తించిన మారిషస్ ఫైనాన్సియల్ రెగ్యులేటర్ అయినా ఫైనాన్సియల్ సర్వీసెస్ కమిషన్ (ఎఫ్ఎస్‌సి) ఆ సంస్థపై కఠిన నిర్ణయం తీసుకుందని ఓ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. అదానీ పబ్లిక్ లిస్టెడ్ కంపెనీలలో నిబంధనలకు విరుద్ధంగా పెట్టుబడులు పెట్టిన ఇఐఎఫ్ఎం వ్యాపార, పెట్టుబడుల లైసెన్స్‌లను 2022 మేలో రద్దు చేసింది. దీనిపై ఇంకా విచారణ జరుగుతుంది. హిండెన్‌బర్గ్ రిపోర్ట్ తర్వాత ఇఐఎఫ్ఎం, ఇఎం రెసర్జెంట్ ఫండ్ సహా 13 విదేశీ అదానీ ఇన్వెస్టర్లపై మనీలాండరింగ్ యాక్ట్ కింద సెబీ విచారిస్తోంది. అదానీ గ్రూపు కంపెనీల అకౌంట్స్ మోసాలు, కృత్రిమంగా షేర్ల ధరల పెంపునకు పాల్పడుతున్నాయని హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక విడుదల చేయడానికి ఎనిమిది నెలల ముందు ఐఐఎఫ్ఎం లైసెన్స్ రద్దు అయ్యింది.

ఇఐఎఫ్ఎం మనీలాండరింగ్‌కు పాల్పడటం, కార్పొరేట్ గవర్నెన్స్ చట్టాలను సహా అనేక నిబంధనలను ఉల్లఘించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎఫ్ఎస్‌సి నివేదిక పేర్కొంది. "ఫైనాన్సియల్ సర్వీసెస్ చట్టం, సెక్యూరిటీస్ యాక్ట్, ఫైనాన్సియల్ ఇంటెలిజెన్స్ అండ్ యాంటీ మనీలాండరింగ్ రెగ్యూలేషన్స్(2003, 2018), మనీ లాండరింగ్, టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ నిరోధానికి సంబంధించిన కోడ్‌లోని వివిధ సెక్షన్లను ఇఐఎఫ్ఎం ఉల్లఘించింది. క్లయింట్లు, లావాదేవీల రికార్డులను నిర్వహించడం, అకౌంటింగ్, ఆడిటింగ్ ప్రమాణాలను పాటించకపోవడానికి సంబంధించిన అనేక అవకతవకలను గుర్తించాం. మారిషస్ ఫైనాన్సియల్ ఇంటెలిజెన్స్, యాంటీ మనీ లాండరింగ్ రెగ్యులేషన్స్ 2003, 2018లను ఉల్లంఘించినందుకు ఐఐఎఫ్ఎం దోషిగా నిర్ధారించబడింది." అని మారిషస్ ఫైనాన్సియల్ రెగ్యులేటర్ ఫైనాన్సియల్ సర్వీసెస్ కమిషన్ తన రిపోర్ట్‌లో స్పష్టం చేసింది. ఎఫ్ఎస్‌సి రిపోర్ట్ ప్రకారం.. 2018 ఏప్రిల్ నాటికి ఇఐఎఫ్ఎంకు చెందిన రెండు మారిషస్ ఫండ్‌లు అదానీ పవర్ లిమిటెడ్‌లో 3.9 శాతం, అదానీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్‌లో 3.86 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌లో 1.73 శాతం చొప్పున వాటాలను కలిగి ఉన్నాయి. ఇఐఎఫ్ఎం లైసెన్స్‌ల రద్దుపై అదానీ గ్రూపు ప్రతినిధి స్పందిస్తూ.. స్వతంత్ర వ్యక్తిగత వాటాదారులకు సంబంధించిన విషయాలపై తాము వ్యాఖ్యానించలేమని పేర్కొన్నారు.

అదానీ లిస్టెడ్ కంపెనీల్లో షేర్లను కొనుగోలు చేస్తూ.. కృత్రిమ ధరల పెంపునకు పాల్పడుతోన్న ఎనిమిది విదేశీ ఫండ్‌లలో ఆరు సంస్థలు మాయమయ్యాయని ఇటీవల మింట్ ఓ కథనంలో వెల్లడించింది. 2020లో అదానీ గ్రూప్ కంపెనీలలో విదేశీ సంస్థల హోల్డింగ్‌లపై మార్కెట్స్ రెగ్యులేటర్ దర్యాప్తు ప్రారంభించిన తర్వాత అవి మూతపడటంతో అదానీ కంపెనీల్లో అజ్ఞాత పెట్టుబడులకు మరింత బలం చేకూరినట్లయ్యింది. అదానీ గ్రూప్‌లో రహస్యంగా పెట్టుబడి పెట్టిన ఇద్దరు వ్యక్తులు.. అదానీ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని ఆర్గనైజ్డ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) మరో రిపోర్ట్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ సంస్థల్లో పెట్టుబడులు కలిగి ఉన్నారని పేర్కొంది. ఈ వరుస పరిణామాలు, రిపోర్ట్‌లు అదానీ గ్రూపుల్లో జరుగుతోన్న ఆర్థిక అక్రమాలు, కుంభకోణాలకు దర్పణం పడుతోన్నాయని స్పష్టం అవుతోంది.

అదానీ మనీలాండరింగ్‌పై పార్లమెంటరీ కమిటీ వేయాలి : కాంగ్రెస్



అదానీ సంస్థల మనీలాండరింగ్ ఆరోపణలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. వచ్చే పార్లమెంట్ ప్రత్యేక సెషన్‌లోనే ఈ అంశాన్ని చర్చించాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అన్నారు. మారిషస్ ఫైనాన్షియల్ రెగ్యులేటర్ అదానీకి లింక్‌లు ఉన్న రెండు సంస్థల లైసెన్సులను రద్దు చేసినందున సెబీ ఇప్పటికైనా అదానీ కంపెనీలపై చర్య తీసుకుంటుందా..? అని ఆయన ప్రశ్నించారు. సెబీ విశ్వసనీయతపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. అదానీపై చర్యలకు సెబీ నిస్సాహాయంగా వ్యవహరించగా.. మారిషస్ సంస్థలు మాత్రం కఠిన చర్యలు తీసుకున్నాయన్నారు. వినోద్ అదానీ సహచరులు నాసర్ అలీ షాబాన్ అహ్లీ, చాంగ్ చుంగ్ లింగ్‌లు అదానీ కంపెనీల్లో సందేహాస్పదమైన పెట్టుబడులను జైరాం రమేష్ గుర్తు చేశారు. మోడీ హస్తాల నుంచి సెబీ బయటికి వచ్చి.. పెట్టుబడుల మార్కెట్‌లో వాటాదారుల ఆసక్తులను కాపాడాలని డిమాండ్ చేశారు.

సొంత భవనాన్ని పూర్తిగా వాడుకోవాలి

- ఫిషరీస్ చైర్మెన్ పిట్టల రవీందర్ 'మత్స్యదర్శిని' సందర్శన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో 'ఫిషరీస్ ఫెడరేషన్' నెలకొల్పిన మత్స్యదర్శిని కేంద్రాన్ని ఆ ఫెడరేషన్ చైర్మెన్ పిట్టల రవీందర్ శనివారం సందర్శించారు. మత్స్యదర్శిని నిర్వహణకు సంబంధించిన వివరాలను ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ గట్టుపల్లి సుజాత ఆయన వివరించారు. సెల్లార్‌తోపాటు రెండు అంతస్తుల్లో నిర్మించిన మత్స్యదర్శిని భవన సముదాయాన్ని చైర్మెన్ తిరిగి పరిశీలించారు. ఆ భవనంలో నిరుపయోగంగా పడి ఉన్న మొదటి అంతస్తు భవనాన్ని వినియోగించుకుని అధునాతనమైన "ఫిష్టారెంట్"ను నిర్వహించేందుకు గల అవకాశాలను ఆయన పరిశీలించారు. రాజధాని నగరంలో అత్యంత ఖరీదైన బంజారాహిల్స్‌లో ఫిషరీస్ ఫెడరేషన్ ఆధీనంలో ఉన్న సొంత భవన సముదాయానికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ఆచరణాత్మక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

వలస జిల్లాలు సస్యశ్యామలం..

- కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కరువు కాటకాలతో ఇంతకాలం కునారిల్లిన పూర్వ మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల మెడలో కృష్ణా జలాల మణిహారాన్ని సీఎం కేసీఆర్ వేశారని తెలంగాణ గృహనిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వలస జిల్లాలుగా పేరుపడ్డ దక్షిణ తెలంగాణాలోని ఆరు జిల్లాలను సస్యశ్యామలంగా మార్చేందుకు సీఎం చేసిన కృషి మరవలేనిదని పేర్కొన్నారు. ఈ క్రమంలో తెలంగాణాతో సహా దేశంలోని రైతు లోకం తమ హర్షాతిరేకలను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఆ యాంకర్లు బీజేపీ బాకాలు

- అందుకే బహిష్కరించిన ఇండియా కూటమి

న్యూఢిల్లీ : దేశంలోని 14 వార్తా ఛానల్స్ ప్రసారం చేసే చర్చా గోష్టులకు తన ప్రతినిధులను పంపరాదని ప్రతిపక్ష ఇండియా కూటమి నిర్ణయించింది. అదేమిటి ? మీడియా స్వేచ్ఛపై ప్రతిపక్షాలకు నమ్మకం లేదా అని అనుకునేరు. వాస్తవమేమంటే ఆ ఛానల్స్‌లో రాజకీయ చర్చాగోష్టులు నిర్వహించే యాంకర్లు అధికార బీజేపీకి సన్నిహితులు. అంత మాత్రానికే కార్యక్రమాలను బహిష్కరిస్తారా అంటారా? వారు కేవలం బీజేపీ సన్నిహితులు మాత్రమే కాదు. కమలనాథులకు బాకాలుగా కూడా వ్యవహరిస్తున్నారు. అందుకే ఈ బహిష్కరణ నిర్ణయం. నిస్పాక్షికంగా వ్యవహరించాల్సిన మీడియా సంస్థలు, వాటిలో పనిచేసే సిబ్బంది ఏదో ఒక పార్టీకి కొమ్ము కాయడం వల్లనే ఈ దుస్థితి ఏర్పడుతోంది. ఇలాంటి వ్యక్తులు ప్రతి చర్చా గోష్టిలోనూ ప్రతిపక్షాలపై దుమ్మెత్తి పోయడమే పనిగా పెట్టుకొంటున్నారు.

ప్రతిపక్షాలు ఇలాంటి నిర్ణయం తీసుకోవడంలో ఇప్పటికే జాప్యం జరిగింది. మీడియా పక్షపాత వైఖరి కారణంగా ప్రతిపక్షాలు అనేక సందర్భాలలో ఇబ్బందులు పడ్డాయి. ఉదాహరణకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జోడో యాత్ర చేసిన సమయంలో కొన్ని ప్రధాన స్రవంతి మీడియా సంస్థలే దానికి శతృవుగా వ్యవహరించాయి. ఈ పక్షపాత ధోరణి, ప్రభుత్వ అనుకూల వైఖరి కాకతాళీయం కాదు. జాతీయ స్థాయిలో తనకు విధేయంగా ఉండే మీడియాను సృష్టించేందుకు మోడీ గత పది సంవత్సరాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. పైగా తనకు వ్యతిరేకంగా గళం విప్పే మీడియా సంస్థలను అణగదొక్కేందుకు అనేక క్రూరమైన చట్టాలు ఆయన చేతిలో ఉన్నాయి. ప్రభుత్వం చెప్పిన దానికి తలూపేందుకు నిరాకరించిన ఎన్డీటీవీని ఇటీవలే అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. అదానీ, మోడీ మధ్య ఉన్న బంధం అందరికీ తెలిసిందే. టెలివిజన్ కార్యక్రమాలను బహిష్కరించడం ద్వారా 'మ్యాచ్ ఫిక్సింగ్' షోలలో పాల్గొనకుండా కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగానే వ్యవహరించింది. అంతేకాదు మీడియా పక్షపాత వైఖరిని ఎండగట్టడం ద్వారా దానిపై ఒత్తిడి తేగలిగింది. దీనివల్ల ఆయా ఛానల్స్ యాజమాన్యాల వైఖరిలో మార్పు వస్తుందని అనుకోవడం అత్యాశే అయినప్పటికీ ఓటర్ల దృష్టిలో వాటిని దోషులుగా నిలపడంలో ప్రతిపక్ష కూటమి సఫలీకృతమైంది. కానీ ఆయా మీడియా సంస్థలు, చర్చా గోష్టులు నిర్వహించే వారు మాత్రం ఏదో మహాపరాధం జరిగిపోయిందంటూ గగ్గోలు పెడుతున్నాయి. భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లిందని, మీడియా హక్కులకు విఘాతం కలిగిందని విమర్శించాయి. భావ ప్రకటనా స్వేచ్ఛ అంటే ఎలాంటి భయం లేకుండా, శిక్షిస్తారన్న ఆందోళన లేకుండా మాట్లాడడం. కానీ ఇప్పుడు దేశంలో అలాంటి స్వేచ్ఛ పూర్తిగా కరువైంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే అరెస్ట్ చేస్తున్న ఉదంతాలు కోకొల్లలు. కొందరు పాత్రికేయులు ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఎన్డీటీవీని అదానీ గ్రూప్ కొనుగోలు చేసిన తర్వాత అందులో పనిచేసిన రవీష్ కుమార్ రాజీనామా చేశారు. కొందరు యాంకర్లు తమ మెగాఫోన్లను ఉపయోగించి మైనారిటీలు... ముఖ్యంగా ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారు. దీనిని భావ ప్రకటనా స్వేచ్ఛ అనగలమా?

సనాతన ధర్మాన్ని ఓడిస్తాం

- ప్రగతిశీల శక్తులను గెలిపిస్తాం : టీపీఎస్‌కే ప్రధాన కార్యదర్శి హిమబిందు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజల ధన మాన ప్రాణాల కన్నా సనాతన ధర్మ రక్షణే ముఖ్యమా..? అంటూ తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే) ప్రధాన కార్యదర్శి కె హిమబిందు ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ఏనాడూ నోరు విప్పరా..? అందుకే తామంతా 'సనాతన ధర్మాన్ని ఓడిస్తాం, ప్రగతిశీల శక్తులను గెలిపిస్తాం' అని చెప్పారు. పెరియార్ 144వ జయంతి సందర్భంగా 'సనాతనమా? రాజ్యాంగమా?'అనే అంశంపై టీపీఎస్‌కే, భారత నాస్తిక సమాజం (బీఎన్ఎస్) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించాయి. పెరియార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశ్నను వ్యతిరేకించే వాళ్లు, ప్రగతిని వ్యతిరేకించే వాళ్లు, మహిళలను వ్యతిరేకించే వాళ్లు, శూద్రులను వ్యతిరేకించే వాళ్లు, మనిషిని మనిషిగా వ్యతిరేకించే వాళ్లు, మనుషుల్లో చీలికలు తెచ్చే వాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ కమండలాలు పట్టుకుని తపస్సు చేసే సన్యాసులు ఇప్పుడు కత్తులు, త్రిశూలాలు పట్టుకుని మనుషుల తలలకు వెల కడుతున్నారని విమర్శించారు. మత ఉగ్రవాదులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అధ్యక్షత వహించిన టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సతీసహగమనం, అంటరానితనం, బాల్యవివాహాలు, దేవదాసీ, జోగినీ వ్యవస్థలు సనాతన ధర్మంలో భాగమా కాదా? అని ప్రశ్నించారు. వాటిని ఇప్పుడు పాటిద్దామా? కాలాన్ని బట్టి మారుదామా? ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. బీఎన్ఎస్ అధ్యక్షుడు రషీద్ ద్రావిడ్ మాట్లాడుతూ హిందూ మతమంటే సనాతన ధర్మానికి ప్రతిరూపమని చెప్పారు. 'నేను హిందూ మీరు హిందూ అంటూ అమాయకుల మెదళ్లలో విష బీజాలు నాటుతున్నారు'అని ఆయన విమర్శించారు. మత విశ్వాసం హృదయంలో ఉండాలిగానీ, ఇంట్లో ఉండాలిగానీ, వీధుల్లోకి తెస్తున్నారని అన్నారు. 'సనాతన ధర్మాన్ని ఓడిస్తాం-ప్రగతిశీల శక్తులను గెలిపిస్తాం' అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, స్వేచ్ఛ జేఏసీ నాయకులు బాలి అదామ్ రాజ్, బీఎన్ఎస్ కన్వీనర్ గుత్తికొండ చక్రధర్, రాజ్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు ప్రాజెక్టుతో ఒక్క ఎకరమైనా తడిసిందా?

- వైఎస్ఆర్ టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుతో ఒక్క ఎకరమైనా తడిసిందా? అని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దక్షిణ తెలంగాణ లో ఏ ఒక్కరి దూప తీరలేదని తెలిపారు. సీఎం కేసీఆర్ స్విచ్ వేస్తేనే పాలమూరు పచ్చబడ్డదా? అని ప్రశ్నించారు. పూర్తిగాని ప్రాజెక్టుతో ఎన్నికల రాజకీయం చేయొద్దని హితవు పలికారు. ప్రజావ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్ జిమ్మిక్కులు చేస్తున్నారని విమర్శించారు. మోడీతో డ్యూయేట్లు పాడుకుంటున్నప్పుడు అనుమతులు ఎందుకు తెచ్చుకోలేక పోయారో సమాధానం చెప్పాలని నిలదీశారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాపై కేంద్రంపై ఒక్క రోజైనా కొట్లాడారా? అని ప్రశ్నించారు.

సీఐడీ అధికారులకు సీపీఆర్ శిక్షణ

- కిమ్స్‌లో ఒకరోజు ట్రైనింగ్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : గుండె నొప్పికి గురైన వ్యక్తులకు సీపీఆర్ ప్రథమ చికిత్సను చేయటం ద్వారా రక్షించే వైద్య విధానంపై 150 మంది సీఐడీ అధికారులు, సిబ్బందికి కిమ్స్ ఆస్పత్రిలో శనివారం ఒక రోజు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ.. ప్రస్తుత జీవన విధానంలో ఎదురవుతున్న ఒడిదుడుకుల కారణంగా అనేక మంది గుండె నొప్పుల బారిన పడుతున్నారనీ, వారికి వెంటనే సీపీఆర్‌ను నిర్వహించటం వలన మృత్యువు నుంచి బయట పడగలుగుతున్నారని అన్నారు. ముఖ్యంగా, వేగవంతమైన జీవన యానంలో చిన్న పిల్లలు మొదలుకొని యుక్త వయసులోనివారు కూడా గుండె పోటుకు గురికావడం ఆందోళనకరమని తెలిపారు. ఈ పరిస్థితుల్లో హఠాత్తుగా గుండెపోటుకు గురైనవారికి సీపీఆర్‌ను నిర్వహించటం వలన వారి ప్రాణాలకు ముప్పు తప్పుతున్నదనీ, ఈ నేపథ్యంలోనే సీఐడీలోని అధికారులు, సిబ్బందికి సీపీఆర్‌ను నిర్వహించటంలో శిక్షణనిప్పించినట్టు ఆయన తెలిపారు.

జంటనగరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

- నేడు తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలు
- రాష్ట్ర ప్రభుత్వం జాతీయ సమైక్యతా దినోత్సవం
- బీజేపీది విమోచన దినోత్సవం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకల నేపథ్యంలో జంటనగరాల్లో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సెప్టెంబర్ 17న భారతదేశంలో తెలంగాణ విలీనమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తుండగా, విమోచన దినోత్సవం పేరుతో బీజేపీ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ వేడుకల్లో కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. కవాతులో సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితోపాటు ఇతర ముఖ్యనాయకులు పాల్గొననున్నారు. ఇదిలావుండగా జాతీయ సమైక్యతా దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వేడుకల్లో మంత్రులు, ప్రభుత్వ అధికారులు, వీఐపీలు, వీవీఐపీలు పాల్గొననుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

బోయిన్‌పల్లి, రసూల్‌పురా, సికింద్రాబాద్, నాంపల్లి, వైఎంసీఏ, బషీర్‌బాగ్, ఓల్డ్‌ఎమ్మెల్యే క్వార్టర్స్, హిమాయత్‌నగర్, అబిడ్స్, కోఠీ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వేడుకల్లో పాల్గొనే వారి కోసం ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేశారు. పోలీసులు సూచించిన ప్రాంతాల్లోనే వాహనాలను పార్క్ చేయాలని అదనపు సీపీ సుధీర్‌బాబు తెలిపారు.

కమిషన్ల యావే తప్ప...

- సాగునీరు అందించే యోచన లేని సీఎం కేసీఆర్
- పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభమా? : జాగో తెలంగాణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలకు సాగునీరు అందించేదాని కన్నా ఏ ప్రాజెక్టులో ఎక్కువ కమిషన్ వస్తుందనే దానిపైనే సీఎం కేసీఆర్ ఆలోచనంతా అని పలువురు వక్తలు విమర్శించారు. శనివారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జాగో తెలంగాణ చైర్మెన్ జస్టిస్ చంద్రకుమార్, కన్వీనర్ ఆకునూరి మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ మొత్తాన్ని ఎక్కువ కమిషన్లు వచ్చే ప్రాజెక్టులకే కేటాయిస్తూ ప్రజల అవసరాలను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో 33 పంపులకుగానూ ఒక పంపు మాత్రమే ప్రారంభించి ఆయకట్టు ప్రాంత ప్రజలను కేసీఆర్ మోసం చేస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఏమి చెప్పుకోలేకే ఈ ప్రారంభోత్సవమని ఎద్దేవా చేశారు. ఆ ఒక్క పంపు ద్వారా కేవలం రెండున్నర వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతుందని తెలిపారు. 30 అంతస్తుల మేడ కడుతున్నాననీ ప్రచారం చేసుకుని గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే కట్టి గృహ ప్రవేశం చేసినట్టుగా కేసీఆర్ తీరు ఉందని విమర్శించారు. కెనాల్స్, పిల్ల కాలువలు నిర్మించకుండా ప్రాజెక్టుల ప్రారంభం అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాది కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని నాశనం చేస్తున్న కేసీఆర్ విదేశాల్లో ఉంటే ఈ పాటికి జైల్లో వేసేవారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను ఓడించాలనీ, బీఆర్ఎస్ పార్టీకి పాలించే హక్కు లేదని తెలిపారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, తెలంగాణ జల సాధన సమితి అధ్యక్షులు నైనాల గోవర్ధన్ పాల్గొన్నారు.

వెండి ధర రూ.85వేలకు చేరొచ్చు

- మోతిలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ అంచనా

న్యూఢిల్లీ : వచ్చే 12 మాసాల్లో వెండి ధర రూ.82వేల - 85వేలకు చేరొచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే కిలో వెండి ధర 11 శాతం పెరిగింది. ప్రసుతం దేశీయ మార్కెట్లో కిలో వెండి ధర రూ.77వేల మేర పలుకుతోంది. ప్రస్తుతమున్న డిమాండ్ ఇలానే కొనసాగితే వచ్చే 12 నెలల్లో కిలో వెండి ధర రూ.82,000 నుంచి రూ.85,000 స్థాయికి చేరే అవకాశం ఉంది. వచ్చే కొన్ని త్రైమాసికాల్లో 15 శాతం పెరుగుదల ఉండొచ్చు. ఒకవేళ తగ్గినా రూ.68,000 - 70,500 వద్ద మద్దతు లభిస్తుందని మోతిలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ అంచనా వేసింది. అంతర్జాతీయంగా తగ్గుతోన్న ఆర్థిక మాంద్యం భయాలు, పారిశ్రామిక రంగంలో వెండికి డిమాండ్ పెరగడం, సౌర విద్యుత్, విద్యుత్ వాహనాల్లో వెండి వాడకం పెరగడం, పండగ సీజన్లు వెండి ధర పెరుగుదలకు ప్రధాన కారణాలు కానున్నాయని ఓస్వాల్ రిపోర్ట్ పేర్కొంది.

నూహ్‌లో ఇంటర్నెట్ సేవల నిలిపివేత

- సెక్షన్ 144 విధింపు

చండీఘర్ : హర్యానాలోని నూహ్‌లో మొబైల్ ఇంటర్నెట్ సర్వీసులను, బల్క్ ఎస్ఎంఎస్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల పాటు నిలిపివేసింది. నూహ్ హింసాకాండతో సంబంధముందన్న ఆరోపణపై కాంగ్రెస్ ఎమ్మెల్యే మమ్మన్ ఖాన్‌ను అరెస్ట్ చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. శాంతి భద్రతలను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ఖాన్‌ను అరెస్ట్ చేసి, శుక్రవారం నూహ్ జిల్లా కోర్టులో హాజరు పరిచారు. అల్లర్ల కేసును విచారిస్తున్న హర్యానా సిట్‌కు ఖాన్‌ను రెండు రోజుల కస్టడీ నిమిత్తం పంపేందుకు కోర్టు అనుమతించింది. నూహ్‌లో హింసాకాండను ప్రేరేపించేలా ప్రజలను తప్పుదారి పట్టించి వారిని రెచ్చగొట్టే విధంగా సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టిన వారితో ఖాన్ సంప్రదింపులు జరిపారని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఖాన్‌ను 331వ అనుమానితుడిగా చేర్చినప్పటికీ ఈ కేసులో ఇప్పటి వరకూ అరెస్టయిన ప్రముఖ వ్యక్తి ఆయనే. మహమ్మద్ తాఫిక్ అనే వ్యక్తితో ఖాన్ జూన్ 29, 30 తేదీలలో ఫోన్‌లో మాట్లాడారని, బద్కలీ చౌక్ జిల్లాలో జరిగిన హింసతో సంబంధమున్న తాఫిక్‌ను ఆ తర్వాత పోలీసులు అరెస్ట్ చేశారని అధికారులు తెలిపారు. తనకు అరెస్ట్ నుండి రక్షణ కల్పించాలంటూ అంతకుముందు ఖాన్ పంజాబ్ హర్యానా హైకోర్టును ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకపోయింది.



డెన్ జీవితంలోకి

కొంత కాలం తర్వాత మా అక్క భర్త కాల్వ నారాయణరెడ్డి వచ్చి నన్ను తనతో పాటు తీసుకెళతామన్నారు. కానీ మా అమ్మానాన్న ఒప్పుకోలేదు. నాకు పెండ్లి చేయాలనుకున్నారు. అది నాకు ఇష్టం లేదు. అందుకే పార్టీలో పని చేస్తానని చెప్పాను. కొద్ది రోజుల తర్వాత మా బావ వచ్చి నన్ను తీసుకెళ్ళారు. నేను మా అక్క దగ్గర ఉంటానని అందరూ అనుకున్నారు. కానీ నేను వెళ్ళిన డెన్‌లో రావి నారాయణరెడ్డి, సీతాదేవి ఉన్నారు. మొదట్లో కాస్త భయం వేసింది.



అక్కడ నా పేరు ప్రమద అని మార్చారు. నారాయణరెడ్డి నాపై చూపిన అభిమానం నా కుటుంబాన్ని వదిలి వచ్చాననే బాధను పోగొట్టింది. తర్వాత మరో రహస్య ప్రదేశానికి వెళ్ళాను. పార్టీకి సంబంధించిన అన్ని సర్క్యులర్లు మేమే చేసేవాళ్ళం. నా చేతిరాత చాలా బాగుండేది. స్పీడ్‌గా కూడా రాసేదాన్ని. దాంతో నన్ను ఈ పనికి కేటాయించారు. నా పని విధానం నచ్చి పద్నాలుగేండ్లకే పార్టీ సభ్యత్వం ఇచ్చారు. చాలా ఆనందించాను. పోరాట ప్రాంతాల నుండి వచ్చే రిపోర్టుల్లో మహిళలు నిర్వహిస్తున్న పాత్రను చూసి చాలా ఉత్సాహంగా అనిపించేది.

తెలంగాణ సాయుధ పోరాటం

నా జీవితంలో గర్వించదగిన ఘట్టం

ఎనిమిదేండ్ల వయసులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్‌గా పని చేశారు. అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించారు. ఐదేండ్లు రహస్య జీవితాన్ని అనుభవించారు. పోరాట విరమణ అనంతరం మహిళా సంఘాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారు. వయసు తొమ్మిది పదులకు దగ్గర పడుతున్నా నేటికీ అదే స్ఫూర్తితో తన ఉద్యమ అనుభవాలు మనతో పంచుకున్నారు. ఆమే **కామ్రేడ్ సుగుణమ్మ**. ఈ రోజు తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవం సందర్భంగా ఆమెతో సంభాషణ మానవి పాఠకులకు ప్రత్యేకం...



మాది బ్రాహ్మణపల్లి గ్రామం. ప్రస్తుతం ఇది రంగారెడ్డి జిల్లాలో బీబీనగర్ మండలంలో ఉంది. 1936, నవంబర్ 7న పుట్టాను. మా అమ్మ లక్ష్మమ్మ, నాన్న రామ చంద్రా రెడ్డి. వీరికి మేము ఐదుగురు పిల్లలం. అన్నయ్య కోదండ రామిరెడ్డి, అక్క శశిరేఖ, తమ్ముళ్లు నర్సింహా రెడ్డి, బుచ్చిరెడ్డి. అన్నయ్య విద్యార్థి దశలోనే జాతీయోద్యమానికి ఆకర్షితుడయ్యాడు. మొదట ఆర్య సమాజం, తర్వాత ఆంధ్రమహాసభ, ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. అప్పట్లో మా జిల్లాకు 'ఆంధ్ర మహాసభ' కార్యదర్శిగా కూడా పని చేశాడు. అన్నయ్యే మా అందరినీ కమ్యూనిస్టులుగా తీర్చి దిద్దాడు. ఇంట్లో ఘోషా పద్ధతిని మాన్పించాడు. పెద్దలనెదిరించి నాకూ, అక్కకు చదువుతో పాటు వ్యాయామము, కర్రసాము, సైకిల్ తొక్కడం, ఈత, గుర్రపుస్వారీ వంటివి నేర్పించాడు. మాలో ఆత్మ విశ్వాసం, మానసిక ధైర్యం పెంపొందించి రాజకీయ పరిజ్ఞానానికి పునాది వేసింది మా అన్నయ్యనే.

అన్నయ్య ప్రభావంతో...

మా అక్క శశిరేఖ అన్నయ్య ప్రభావంతో కమ్యూనిస్టు పార్టీలో చేరింది. దళాల్లో పని చేసింది. విజయవాడలో మహిళా కార్యకర్తలకు ఇచ్చిన శిక్షణలో పాల్గొంది. అక్క అరెస్టయ్యి రెండేండ్లు జైల్లో ఉంది. అప్పుడు ఆమెకు పదిహేడు ఏండ్లు. అప్పుడు జైల్లో ఉన్న రాజకీయ ఖైదీలందరికంటే చిన్నది. ఖైదీలందరి తరఫున తమకు పత్రికలూ, పుస్తకాలు ఇవ్వమని, కుట్టు మిషన్లు నేర్పించమని జైలు అధికారులకు విజ్ఞప్తి పత్రాలు ఇచ్చింది. అధికారులు మిషను తెప్పించి అందరికీ కుట్టడం నేర్పారు. 2012 డిసెంబర్‌లో అక్క చనిపోయింది. మా అన్నయ్య ఊర్లో ఒక పాఠశాల నిర్మించాడు. అందులోనే మేము 6వ తరగతి వరకు చదువుకున్నాం. మా నాన్న పోలీసు పటేల్. మా ఊర్లో మా కుటుంబానిదే పెత్తనం. శిస్తు వసూలు చేయాల్సిన బాధ్యత మా కుటుంబానిదే. కానీ మా అన్నయ్య ప్రభావంతో ఇంట్లో అణచివేత ఉండేది కాదు.

ఆరుట్ల కమల గురించి విని...

ఐదో తరగతి వరకు మా ఊళ్ళో చదువుకుని, ఆరు, ఏడు తరగతులు మా పిన్ని ఇంట్లో ఉండి చదువుకున్నాను. అప్పట్లో ఆరుట్ల కమలాదేవి పెండ్లి చేసుకుని హాస్టల్లో ఉండి చదువుకుంటుందని, ఆమె భర్తతో పాటు సమావేశాలకు వెళుతుందని విని మేము కూడా ఆమెలా ప్రజా సేవకు అంకితం కావాలని ఆరాటపడేవాళ్ళం. ఒకసారి మా ఊరికి దగ్గరలోనే ఒక బహిరంగ సభకు కమలాదేవి వస్తున్నారని తెలిసింది. ఆ మీటింగ్‌కి అన్నయ్య మమ్మల్ని తీసికెళతానంటే ఇంట్లో వీల్లేదన్నారు. 'ఊళ్ళో తిప్పుతున్నది చాలక, పొరుగూళ్ళలో కూడా తిప్పితే, వాళ్ళకు పెళ్ళిళ్ళు అవుతాయా? ఎవరు చేసుకుంటారు' అంటూ చాలా గొడవ చేశారు. ఎలాగో ఒప్పించి మమ్మల్ని తీసుకెళ్ళాడు. అక్కడ మొదటి సారి 'కష్టజీవి' బుర్రకథ విని, కమలాదేవిని చూసి చాలా సంతోషించాం.

మొదటి సారి మల్లు స్వరాజ్యంతో...

అప్పట్లో హైదరాబాద్ రాష్ట్రంలో ఉర్దూ అధికార భాషగా ఉంది. ఇతర భాషలకు సంస్కృతులను అణచివేసేవారు. మధ్యతరగతి వారికి కూడా చదువు అందుబాటులో ఉండేది కాదు. ప్రజల మాతృభాషల్లో విద్య నిషేధం. భూమి కూడా ఎక్కువ శాతం దొరల చేతిలో ఉండేది. పేదలు వెట్టి చేస్తూ దోపిడికి గురయ్యేవారు. వెట్టి పనులు చేయలేకపోతే పెత్తందార్లు, దొరలూ వాళ్ళను తీవ్రంగా హింసించేవారు. మహిళలను ఇష్టం వచ్చినట్టు వాడుకునేవారు. దాంతో ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. చివరకు ఇది మరింత విస్తృతమైన ఆందోళనకు దారితీసింది. ఆంధ్రమహాసభ ఏర్పడిన తర్వాత రావి నారాయణరెడ్డి, మా అన్నయ్య అందులో చేరారు. మా ప్రాంత దళాలన్నింటికి నాయకుడయ్యాడు. 1944లో భువనగిరిలో ఆంధ్ర మహాసభ పదకొండవ సమావేశం జరిగింది. అక్కడే నేను మొదటి సారి మల్లు స్వరాజ్యంను కలుసుకున్నా. వాళ్ళతో పాటు నేనూ వాలంటీరుగా పని చేశా. ఇది నాకెంతో ఉత్సాహాన్నిచ్చింది.

మా ఇంటిని తగలబెట్టి...

సాయుధ పోరాటం ఊపందుకున్న తర్వాత రజాకార్ల దాడులు గ్రామాలపై ఎక్కువయ్యాయి. మా అన్నయ్య జాడ చెప్పమంటూ మా ఇంటిపై కూడా ఎన్నో సార్లు పోలీసులు దాడి చేసేవారు. దాడులు ఎక్కువ కావడంతో మేము హైదరాబాద్‌కు వచ్చేశాం. మేము వచ్చేసిన తర్వాత మా పాలేర్లతో మా ఇంటిని తగలబెట్టించి తర్వాత వాళ్ళందరిని కూడా కాల్చి చంపారు. 1948లో రాజాకార్ల భయం కాస్త తగ్గిందని తిరిగి మా ఊరికి వెళ్ళాం. కాలిపోగా మిగిలిన ఇంటిని బాగు చేసుకుని అందులోనే ఉన్నాం. ఆ సమయంలోనే మా అన్నయ్యకు బాబు పుట్టాడు. ఆ రోజు అన్నయ్యతో పాటు దళాలు కూడా వస్తున్నాయని విని భోజనాలు ఏర్పాటు చేశాం. అది తెలుసుకుని యూనియన్ సైన్యాలు లారీలో వచ్చాయి. దళాలు పారిపోయాయి. ఆ రోజు రాత్రి మా ఇంటిపై మళ్ళీ దాడి చేశారు. మా నాన్నను, అమ్మను, అమ్మమ్మను విపరీతంగా కొట్టారు. దాంతో మళ్ళీ హైదరాబాద్ వచ్చి రహస్య జీవితం ప్రారంభించాం.

అన్నయ్యను చంపేశారు

హైదరాబాద్‌లో మా ఇల్లు సీతాఫల్‌మండీలో ఉండేది. మా ఇల్లే ఓ డెన్‌లా అనిపించేది. మహిళలకు ప్రత్యేకంగా రాజకీయ శిక్షణా తరగతులు పెట్టేవారు. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ జీవిత చరిత్రలు చదివి చర్చించుకునే వాళ్ళం. గోర్కి అమ్మ, టాన్యా, జోయా, రోజన్ బర్గ్ పుస్తకాలు చదివేవాళ్ళం. 1949 జూన్ 6వ తేదీన మా అన్నయ్యను సైనికులు కాల్చి చంపారు. ఆయన చివరి చూపు కూడా మాకు దక్కలేదు. అన్నయ్య మరణం మా కుటుంబాన్ని కుంగదీసింది. నాకు చదువుకోవాలని ఉన్నా పరిస్థితి అనుకూలంగా లేదు. అప్పటికే తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీపై సైనిక చర్యలు తీవ్రమయ్యాయి.

కొరియర్‌గా...

ఎనిమిదేండ్ల వయసు నుండే కొరియర్‌గా పని చేసేదాన్ని. మొదటి సారి వెళ్ళేటప్పుడు మధ్యలో పోలీసులు సవాలక్ష ప్రశ్నలు అడిగారు. భయం వేసింది. అయినా ఏవో సమాధానాలు చెప్పి డెన్‌కు వెళ్ళాను. అక్కడ రావి నారాయణరెడ్డి, యస్.వి.కె. ప్రసాదు, పరంజపే, ఎ.ఆర్.వి.చారితో పాటు మరికొందరు ఉన్నారు. నేను తీసుకెళ్ళిన ఉత్తరాలను వారికి ఇచ్చాను. నారాయణ రెడ్డి 'చాలా ధైర్యంగా వచ్చావు' అని మెచ్చుకున్నారు. చాలా సంతోషంగా ఇంటికి వెళ్ళాను. మరోసారి కూడా ఇలాగే వెళ్ళమంటే ఇక వెళ్ళనన్నాను. కానీ బతిమలాడితే వెళ్ళాను. నారాయణరెడ్డి నువ్వు మంచి కొరియర్‌వి, చాలా పెద్ద బాధ్యత నిర్వర్తిస్తున్నావు అన్నారు. నాకు ఇష్టం లేకపోయినా చేస్తుండేదాన్ని.

కఠినమైన పేదరికం

నేను ఉండే డెన్‌లోనే యస్.వి.కె ఉండేవారు. వెళ్ళి ఏడాది దాటినా ఆయన అసలు పేరు నాకు తెలియదు. ఆయన కూడా ఎవరితో పెద్దగా మాట్లాడారు. అయితే నన్ను వివాహం చేసు కుంటానని ఉత్తరం ద్వారా నాకు తెలియజేశారు. మా అక్క, బావకు చెప్పి నారాయణరెడ్డిని సంప్రదించి డెన్‌లోనే పెండ్లి చేసుకున్నాము. 1951లో మా రహస్య జీవితంలోనే పాప శోభ పుట్టింది. అప్పుడు మా డెన్‌పై పోలీసులు నిఘా పెట్టారు. దాంతో పాపను తీసుకుని అనేక ప్రాంతాలు తిరిగాము. డెన్‌లో జీవించేటప్పుడు ఒక్కోసారి కఠినమైన పేదరికాన్ని అనుభవించే వాళ్ళం. అదే సమయంలో యస్.వి.కెను అరెస్టు చేశారు. అది విని కుంగిపోయా. తర్వాత ఆయన బతికే ఉన్నారని తెలిసి ఆందోళన కొంత తగ్గింది. అలా ఐదేండ్లు రహస్య జీవితం గడిపాను.

ఉద్యమానికే అంకితం

సాయుధ పోరాట విరమణ తర్వాత అందరూ చెల్లాచెదురయ్యారు. దాంతో 1957 లో మోటూరు ఉదయం ఎక్కడెక్కడో ఉన్న మహిళా కార్యకర్తలందరినీ వెదికి తెచ్చి కమిటీ ఏర్పాటు చేశారు. అలా ఏడుగురితో హైదరాబాద్ సిటీ కమిటీ ఏర్పాటు చేసుకున్నాం. దీనికి నేను అధ్యక్షురాలిగా బాధ్యతలు చూశాను. రాష్ట్ర కమిటి, అలిండియా కమిటీలో కూడా ఉన్నాను. అలాగే సారా ఉద్యమం లో బాగా పని చేశాం. 30 సంఘాలు కలిసి దీని కోసం ఓ కమిటీ ఏర్పాటు చేసుకున్నాం. ఈ కమిటీకి రాష్ట్ర కమిటి కార్యదర్శిగా ఉన్నాను. ఆ సమయంలో చాలా మంది మహిళలు మాతో కలిసి వచ్చారు. చివరకు సారాను నిషేధిం చారు. ట్రేడ్ యూనియన్ తో కూడా కలిసి పని చేశాను. ఐదు యూనియన్లకు



టీచర్‌గా చేయాలని కోరిక

పాపను తీసుకుని నేను యస్.వి.కె ఊరైనా గుంటూరులో కొంత కాలం ఉన్నాను. అప్పుడు చదువుకోవాలనే కోరిక వచ్చింది. బాగా చదువుకుని టీచర్‌గా ఉద్యోగం చేయాలని నా కోరిక. వైజాగ్ వెళ్ళి మెట్రిక్యులేషన్ పరీక్ష రాసి పాసయ్యాను. హిందీ విశారద కూడా రాశాను. యస్.వి.కె విడుదలై కొంత కాలం హైదరాబాద్‌లో ఉండి మా వద్దకు వచ్చారు. నేను ఉద్యోగం కోసం ప్రయత్నం చేద్దామనే సమయంలో ఉద్యమ అవసరాల రీత్యా మ్మమల్ని వరంగల్ పంపించారు. దాంతో ఆ ప్రయత్నం చేయలేకపోయాను. అయితే ప్రైవేటుగా బికాం పూర్తి చేశాను. పాప పుట్టిన ఎనిమిదేండ్లకు పెద్ద బాబు రవి, తర్వాత రమేష్ పుట్టారు. పిల్లలు చిన్నగా ఉండడంతో ఇక ఉద్యోగం చేసే అవకాశమే రాలేదు.

ప్రెసిడెంట్‌గా ఉండేదాన్ని. నాకున్న సమయం మొత్తం పార్టీ కోసమే కేటాయించాను. ఇప్పటికీ నాకు పని చేయాలనే కోరిక. అయితే ఓపిక లేక పోవడంతో రాలేకపోతున్నాను. అది కాస్త బాధగా అనిపిస్తుంది. ఏది ఏమైనా తెలంగాణ సాయుధ పోరాటం ఓ చారిత్రాత్మకమైన విప్లవ ఘట్టం. ఇందులో స్త్రీలు నిర్వహించిన పాత్ర మహోన్నతమైనది. అందులో నేనూ, మా కుటుంబంలోని వారు కూడా పాల్గొన్నామన్న తృప్తి నాలో ఉంది. దీనిని నా జీవితంలో గర్వించదగిన విషయంగా నేను అనుకుంటాను. నా పిల్లలు విదేశాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం నేను సి.ఆర్.ఫౌండేషన్‌లో వుంటున్నాను.

– సలీమ

'మైనంపల్లి'పై ఆరా..!

(మొదటి పేజీ తరువాయి)

పండింది.

ప్రజాప్రతినిధుల ఆరా..

మైనంపల్లి అడుగులు ఎటు వైపు వేస్తారో..? అని చాలా మంది ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేలందరూ బీఆర్ఎస్ వారే ఉండటంతో మైనంపల్లి పార్టీలోనే కొనసాగుతారా..? పార్టీ మారుతారా..? అంటూ పార్టీ శ్రేణులు, క్యాడర్, చోటా, మోటా లీడర్లను అడిగి తెలుసుకుంటున్నారు. ఆయన పార్టీ మారితే తమ నియోజకవర్గాలపై ఏమైనా ప్రభావం ఉంటుందా..? అని ఆలోచిస్తున్నట్టు చర్చ వినిపిస్తోంది. మైనంపల్లి కాంగ్రెస్‌లో చేరితే తమపై ఎంత ప్రభావం ఉంటుంది..? బీజేపీలో చేరితే ఎంత ప్రభావం చూపుతారు.? అని లెక్కలేసుకుంటున్నారు.

నిర్ణయం ప్రకటించని మైనంపల్లి

ఎమ్మెల్యే మైనంపల్లి ఇంకా తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించలేదు. ఇప్పటికే రెండు సార్లు తన నిర్ణయాన్ని వాయిదా వేసిన మైనంపల్లి, ఈ నెల 17వ తేదీన రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జరిగే బహిరంగ సభలో కాంగ్రెస్‌లో చేరేలా కూడా కనిపించడం లేదు. మంత్రి కేటీఆర్‌తో భేటీకి ఆవకాశం ఉన్నా..

సీఎం కేసీఆర్‌ను కలిసి స్పష్టమైన హామీ తీసుకున్న తర్వాతే నిర్ణయం ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ అధిష్టానానికి ఈ సమాచారం చేరినట్టు తెలుస్తోంది. సీఎం కేసీఆర్ మైనంపల్లితో భేటీ అవుతారా..? లేక లైట్ తీసుకుంటారా..? అనే విషయం త్వరలోనే తేలనుంది. సీఎం కేసీఆర్‌తో భేటీ తర్వాత స్పష్టమైన హామీ రాకపోతే పార్టీ మారే యోచనలో మైనంపల్లి ఉన్నట్టు సమాచారం.

మల్కాజిగిరిలో సంక్షేమ పథకాలు నిలిపివేత..!

ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు ఊపందుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మల్కాజిగిరి నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపేసినట్టు సమాచారం. బీసీబంధు, మైనార్టీ బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి, దళితబంధు రెండో విడత దరఖాస్తుల సేకరణ ఇలా పథకాలన్నింటికీ బ్రేక్ వేసినట్టు తెలుస్తోంది. సర్కార్, ఎమ్మెల్యే మధ్య వార్‌కు మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలు బలవుతున్నారు.

రాష్ట్రాల హక్కులకు భంగం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ పరిస్థితి ఆశాజనకంగా ఉందన్నారు. ఇండియా కూటమిని బలోపేతం చేయాలని సీడబ్ల్యూసీ సభ్యులు అభిప్రాయపడ్డారని చెప్పారు. వీలైనంత వేగంగా సీట్ల సర్దుబాటు ఖరారు కావాలని అభిప్రాయపడ్డారని వివరించారు. సనాతన ధర్మం కాదనీ, సర్వమత సమ్మేళనమే కాంగ్రెస్ కోరుకుంటోందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో రాజకీయ, ఆర్థిక, భద్రతా సవాళ్లకు సంబంధించి స్థూలంగా ముసాయిదా తీర్మానంలో ప్రస్తావించామని తెలిపారు. రాజ్యాంగం, ఫెడరల్ వ్యవస్థలు బలహీనపడుతున్నాయనీ, రాష్ట్రాల ఆదాయం గణనీయంగా తగ్గిపోయాయనీ, వాటి బాధ్యతల నిర్వహణలో అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. కర్నాటకలో బియ్యం పంపిణీకి సంబంధించిన హామీ నెరవేరకుండా కేంద్రం ఎఫ్‌సీఐకి ఆదేశాలు పంపిందని తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రకృతి వైపరీత్యం సంభవించినా కేంద్ర ప్రభుత్వం సహాయం చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. మణిపూర్‌లో పరిస్థితులు తీవ్రంగా, ఉద్రేకంగా ఉన్నా ప్రధాని నరేంద్ర మోడీ అక్కడ పర్యటించకపో వటం దురదృష్టకరమని అన్నారు. కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు లేవనీ, దేశవ్యాప్తంగా రాజకీయ పరిస్థితులు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తర సరిహద్దుల్లో చైనా దళాలు ఒక్క అంగుళం కూడా వెనక్కు తగ్గటం లేదనీ, చొరబాటు కొనసాగుతూనే ఉందనీ, భారతదేశం తన భూభాగాన్ని కోల్పోతున్నదని చెప్పారు. దేశంలో ఆర్థిక, ఆహార ద్రవ్యోల్బణం పెరగటంపై కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వలేకపోతున్నదని విమర్శించారు. మరోవైపు దేశంలో నిరుద్యోగం పెరిగి, ఆర్థిక వృద్ధి తగ్గుతున్నదనీ, ఏడు నెలలుగా ఎగుమతులు తగ్గిపోయి, తీవ్రమైన ఆహార సంక్షోభం ఏర్పడుతున్నదని అన్నారు. మణిపూర్ అల్లర్ల విషయంలో ప్రధాని మోడీ తనకేమీ పట్టనట్టు వ్యవహరించారని విమర్శించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో తొమ్మిది అంశాలపై చర్చించాలంటూ కేంద్రాన్ని కోరుతూ సోనియాగాంధీ లేఖ రాశారని తెలిపారు. ఆ లేఖకు ఇప్పటివరకు కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. కాంగ్రెస్ తలపెట్టిన భోపాల్ ప్రదర్శన ఎందుకు రద్దు చేశారో తమకు సమాచారం లేదని వివరించారు. జైరాం రమేష్ మాట్లాడుతూ సీడబ్ల్యూసీ సమావేశంలో కేరళ కాంగ్రెస్ నేత ఉమెన్ చాందీ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ తీర్మానం చేసినట్టు తెలిపారు. అలాగే మణిపూర్ దుస్సంఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలుపుతూ మరో తీర్మానం కూడా ఆమోదించామన్నారు. హిమాచల్ ప్రదేశ్ ప్రకృతి వైపరీత్యాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్రాన్ని కోరుతూ మరో తీర్మానాన్ని కూడా సీడబ్ల్యూసీ సమావేశం ఆమోదించిందని తెలిపారు.

'నాటకాలాడొద్దు..తమాషాలు చేయొద్దు'

(మొదటి పేజీ తరువాయి)

శనివారం ఉదయం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. అప్పుడే అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే భాస్కరరావును కలిసి అంగన్వాడీలు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అంగన్వాడీలు కోరగా.. 'ఆగమ్మ ఆగు.. నాటకాలాడొద్దు.. తమాషాలు చేయొద్దు.. వినమ్మ వినూ.. ఇదంతా నా దగ్గర నడవదు.. రైతుబంధు కావాలి, రైతు బీమా కావాలి, రుణమాఫీ కావాలి, పెన్షన్ కావాలి. ముఖ్యమంత్రికి అంతా తెలుసు. ఎవరికి ఏమి చేయాలో ఆయనే చేస్తారు. సంబంధిత మంత్రి ద్వారా అన్ని వివరాలు తెలుసుకుంటున్నారు..' అంటూ వ్యాఖ్యానించారు.కాగా, ఎమ్మెల్యే వ్యాఖ్యలపై అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే.. అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైందని కాదని తాము ప్రతి ఎన్నికలోనూ కీలకంగా పని చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము నాటకాలు ఆడటం లేదని, మా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓట్ల కోసం తమ దగ్గరికి ఎలా వస్తారో చూస్తామని హెచ్చరించారు.

బీసీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

(మొదటి పేజీ తరువాయి)

మంచాల మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి..మంచాల మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 96మంది విద్యార్థులు ఉంటున్నారు. మూడ్రోజుల నుంచి అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్ సరిత, వర్కర్ల దృష్టికి తీసుకుపోయారు. అయినా వారు పట్టించుకోలేదు. శనివారం ఉదయం సైతం అదే విధంగా అన్నంలో పురుగులు రావడంతో ఆకలితో కొంతమంది విద్యార్థినులు తినగా, మరికొంత మంది భోజనాన్ని పక్కకు పడేశారు. పురుగుల అన్నం తిన్న విద్యార్థులు ఒక్కొక్కరుగా వాంతులు చేసుకున్నారు. అయితే, ప్రతిరోజూ పక్కనే ఉన్న పాఠశాలలో ప్రార్థన సమయానికి హాస్టల్ విద్యార్థులందరూ వెళ్తారు. శనివారం ఎవరూ వెళ్లకపోవడంతో ఉపాధ్యాయులు హాస్టల్ వద్దకు వెళ్లి పరిశీలించారు. గేటు బయట ఉన్న కొందరు విద్యార్థినులను ప్రశ్నించగా.. మూడ్రోజులుగా అన్నంలో పురుగులు వస్తున్నాయని, ఈ రోజు ఆ అన్నం తిన్న కొందరు వాంతులు చేసుకుంటున్నారని చెప్పారు. అందువల్ల హాస్టల్లోనే ఉండిపోయారన్నారు. దాంతో అస్వస్థతకు గురైన 25 మంది విద్యార్థినులను ఉపాధ్యాయులు తమ కార్లలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారందరికీ చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంచాల ప్రభుత్వాధికారులు హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్ విద్యార్థినులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా, విద్యార్థినుల అస్వస్థతకు కలుషిత ఆహారమే కారణం అని, ఇందుకు హాస్టల్ వార్డెనే బాధ్యురాలని, ఆమెపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

చెట్లపై ఉన్న పురుగులే కారణం : వార్డెన్ సరిత

హాస్టల్ విద్యార్థినులు ప్లేట్లో అన్నం పెట్టుకున్న తర్వాత చెట్ల కింద కూర్చొని తింటున్నారని, ఆ చెట్లపై ఉన్న పురుగులు పడటం వల్లే అస్వస్థతకు గురైనట్టు ఇన్‌చార్జి వార్డెన్ సరిత 'నవతెలంగాణ'తో చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామన్నారు.

మాజీ ఎంపీపీ పరామర్శ

మాజీ ఎంపీపీ జయమ్మ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. ఆహారం వివరాలను విద్యార్థినులు ఆమె దృష్టికి తెచ్చారు. విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురైన ఉన్నతాధికారులు ఎందుకు సందర్శించడం లేదని మాజీ ఎంపీపీ ప్రశ్నించారు.

కాంగ్రెస్‌లో చేరిన తుమ్మల

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమక్షంలో బీజేపీ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి చేరారు. హైదరాబాద్‌లో తన నివాసంలో ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సోమవారం ఉదయం కార్యకర్తల సమావేశం... ఆ తర్వాత డోర్ టు డోర్ ఐదు హామీల కరపత్రాల పంపిణీ, దీంతోపాటు బీఆర్ఎస్ వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల చేస్తారు. మధ్యాహ్నం కార్యకర్తలతో కలిసి సామూహిక భోజనాలు, సాయంత్రం గాంధీ, అంబేద్కర్, కొమురంభీమ్ విగ్రహాల వద్ద భారత్ జోడో మార్చ్ నిర్వహిస్తారు.

పాలమూరుకు కృష్ణా జలాలు

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క మాట అడుగుతున్నా బీజేపీ బిడ్డలను. మీకు సిగ్గూ శరం, చీమునెత్తురు, పౌరుషం ఉంటే కృష్ణాలో వాటో తేల్చమని మోడీని అడగండి' అంటూ విరుచుకుపడ్డారు. కృష్ణానదిలో వాటాతేల్చమని ప్రధాని మోడీని కోరాం. విశ్వగురువు అని చెప్పుకునే ప్రధానికి మా అంత సిపాయిలు లేరనే బీజేపీకి వాటా తేల్చేందుకు పదేండ్లు అవుతుందా? కృష్ణా ట్రిబ్యునల్‌కు రాష్ట్రాలకు నీళ్లు పంచమని లేఖ రాయించాలి. దానికి మోడీ కుయ్‌మనడు, కైమనడు' అంటూ నిలదీశారు. 'నీళ్లు వచ్చేది పాలమూరు, రంగారెడ్డి జిల్లాకు. ఒక పక్కన బీఆర్ఎస్ గవర్నమెంట్ పోరాటం చేస్తే.. మీరు ఎవరి కోసం మౌనం పాటిస్తున్నారని బీజేపీ నేతలపై ఘాటుగా స్పందించారు. తెలంగాణ వచ్చాక రిజర్వాయర్లు ఎక్కడ కట్టాలని ఆలోచన చేశాం. గుట్టల మధ్య కట్టాలని నిర్ణయించాం. ఇవాళ పంపులు, రిజర్వాయర్లు పూర్తయ్యాయి. కాలువలు తవ్వాల్సి ఉంది. ఇంత పెద్ద పాలమూరుకు అడ్డం తగిలితే.. ఈ జిల్లాలో ఉన్న నాయకులే కేసులు వేస్తే.. పెండింగ్ పెట్టి.. దక్షిణ భాగంలో ఉన్న నెట్టెంపాడు, జూరాల, బీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసుకున్నాం. పాలమూరు-రంగారెడ్డి ఎట్టకేలకు పూర్తి చేసుకున్నాం. భగవంతుడి దయతో విజయం సాధించాం. ఆంధ్రా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. మీ నీళ్లు మాకు అవసరం లేదు. మా వాటా మాకు చెబితే.. దాని ప్రకారం తీసుకొని బతుకుతం తప్పా.. మరొకటి కాదని చెప్పారు. ఆకలితో ఉన్నం. వలసలు పోయినోళ్లం. ఆగమైనోళ్లం.. ఇప్పుడిప్పుడే మొఖాలు తెల్లబడుతున్నయ్. రైతుబంధు, బీమా పెట్టుకున్నాం. 24 గంటల ఉచిత కరెంటు పెట్టుకున్నామని' సీఎం కేసీఆర్ అన్నారు.

ఆర్డీఎస్‌ను ఆంధ్రా పాలకులే నాశనం చేశారు

తెలంగాణ సరిహద్దులో ఉన్న ఆర్డీఎస్‌ను కూడా ఆంధ్రా పాలకులే నాశనం చేశారని ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. 'ప్రాజెక్టులు ఎలా కడుతావు.. పాలమూరు పైన ఉన్నది కదా? అని నాటి నాయకులు ప్రశ్నించారు. నీళు కిందకు లేవు వెదవా.. మీ మెదడు మోకాళ్లలో ఉందని చెప్పాను. ఇప్పుడు కూడా బతికే ఉన్నారు. పాలమూరు లిఫ్ట్ పొంగును చూస్తుంటే.. కృష్ణమ్మ తాండవం చేసినట్టు ఉంటుంది. నా ఒళ్లంతా పులకరించి పోయింది. నా జీవితం ధన్యమైంది. ఒకటే పంపు వాగు పారిన రీతిలో ఉంది. కాల్వలు కంప్లీట్ కావాలి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు నీళ్లు ఇవ్వాలి. నల్లగొండలోని డిండి, మునుగోడుకు నీళ్లు ఇవ్వాలి' అని కేసీఆర్ అన్నారు.

సువర్ణాక్షరాలతో...

మహబూబ్‌నగర్, రంగారెడ్డి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు ఇవాళ అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.'ఒకప్పుడు పాలమూరు బిడ్డ హైదరాబాద్‌లో అడ్డా కూలీ. కానీ ఇవాళ పాలమూరుకు పొరుగు రాష్ట్రాల నుంచి కూలీలు వస్తున్నారు. స్థానికులు ఇక్కడే తమ పొలాల్లో పనిచేసుకుంటున్న వ్యవసాయదారులని' అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పర్యటించినప్పుడు.. మీకు మాటిచ్చాను. రాష్ట్రం వస్తేనే సకల దరిద్రాలు మాయమవుతాయని చెప్పాను. మన హక్కులు, నీళ్లు వస్తాయని అన్నాను. కష్టపడి కొట్లాడి తెలంగాణ సాధించుకున్నాం. పాలమూరు ఎంపీగానే తెలంగాణ సాధించాను. ఇది ఒక చరిత్ర. ఈ జిల్లా కిర్తికిరీటంలో శాశ్వతంగా ఉంటుంది. మొత్తం తెలంగాణలో అంచనాలు వేసుకుని, మనకు రావాల్సిన వాటాలు లెక్కలు కట్టుకుని కాళేశ్వరం, సీతారామ, పాలమూరు చేపట్టాం.. ఇవి పూర్తయితే తెలంగాణ వజ్రం తునకలా తయారై దేశానికే అన్నం పెడుతాం. ఎన్ని అడ్డంకులు వచ్చినా కాళేశ్వరం పూర్తి చేసుకున్నాం. సీతారామ పనులు చకచక జరుగుతున్నాయి. పాలమూరు ఎత్తిపోతల కూడా మూడు నాలుగేండ్ల కిందనే పూర్తయ్యేదన్నారు. 1975లో బచావత్ తీర్పు ఇచ్చే సమయంలో మహబూబ్‌నగర్ నీళ్ల ఏవని నాటి పాలమూరు పాలకులు అడగలేదని కేసీఆర్ గుర్తు చేశారు.

70 ఏండ్లు ఏడ్చింది...

'70 ఏండ్లు ఏడ్చినా పాలమూరును పట్టించుకోలేదే. తెలంగాణను ఊడగొట్టింది ఎవరు? ఇదే కాంగ్రెస్ కాదా? తెలంగాణను ఉద్ధరిస్తా.. నేను దత్తత తీసుకున్నానని చెప్పి.. పునాది రాళ్లు పాతింది తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు కాదా? ఎవరైనా సహాయం చేశారా? మనం ఏడ్చిన నాడు.. వలసపోయినాడు.. జిల్లా మొత్తం బొంబాయి బతుకులకు ఆలవాలమైన నాడు.. ఆగమాగమైననాడు ఎవరైనా పట్టించుకున్నారా ? మనం కొట్లాడి రాష్ట్రం తెచ్చుకొని ఇప్పుడిప్పుడే బాగుపడుతున్నామని' వివరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 50 ఏండ్ల కాంగ్రెస్, 16 ఏండ్ల తెలుగుదేశం పాలనలో మహబూబ్‌నగర్‌కు మెడికల్ కాలేజీ ఇచ్చారా? ఇవాళ ఎన్ని మెడికల్ కాలేజీలు ఉన్నయ్ ? ఐదు మెడికల్ కాలేజీలు ఉన్నయ్. నిన్ననే తొమ్మిది కాలేజీలను ప్రారంభించాం. తెలంగాణ ఈ రోజు సంవత్సరానికి 10వేల మందిని ఉత్పత్తి చేసే మేధోరాష్ట్రంగా ఎదిగింది. దేశంలో ఏ రాష్ట్రంలో జిల్లాకో మెడికల్ కాలేజీ లేదు. మామూలు స్కూల్ ఫీజంతా చెల్లిస్తే ఎంబీబీఎస్ చదువుకునే పరిస్థితి బిడ్డలకు తీసుకువచ్చాం. పేదింటి పిల్లల కోసం బడుల్లో అల్పాహారం అందిస్తున్నాం. తమిళనాడులో అధ్యయనం చేయించి.. టిఫిన్, మధ్యాహ్న భోజనం బ్రహ్మాండంగా ఇవ్వాలని జీవో జారీ చేశాం. వైద్య, విద్య, పవర్ రంగంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ ముందుకెళ్తున్నామన్నారు.

కొల్లాపూర్‌కు వరాల జల్లు

కొల్లాపూర్ పట్టణానికి మంజూరు చేసిన ప్రత్యేక ఫండ్‌తో బ్రహ్మాండంగా మిగిలిన పనులన్నీ చేయాలని కోరుతున్నానని కేసీఆర్ తెలిపారు. కొల్లాపూర్‌కు ఒక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని కూడా మంజూరు చేస్తానన్నారు. రెండు, మూడు లిఫ్టులు అడిగారు. జిల్‌దార్ తిప్ప లిఫ్ట్, బాచారం హై లెవల్ కెనాల్, పసుపుల బ్రాంచ్ కెనాల్ వైడనింగ్, లైనింగ్, మల్లేశ్వరం మినీ లిఫ్ట్ కావాలని అడిగారు. అధికారుల చేత సర్వే చేయించి తప్పకుండా మంజూరు చేస్తానన్నారు. రూ. 10 కోట్లతో బోడగట్టు చెక్ డ్యామ్‌కు ఆదివారమే జీవో ఇస్తామన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామపంచాయతీకి రూ. 15 లక్షల చొప్పున ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో కూడా జేఎన్‌టీయూ ద్వారా ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తామంటూ వరాల జల్లు కురిపించారు. ఇప్పటికే ఆదేశాలిచ్చామని వివరించారు. ఆ రకంగా నన్ను ఎంపీగా చేసి, తెలంగాణ సాధించేంత యోధుడిగా నన్ను తయారు చేసినందుకు దన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఈ బహిరంగసభకు కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షత వహించగా మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పి. సబితాఇంద్రారెడ్డి, డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సాగునీటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ సి. మురళీధర్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన నేపథ్యంలో అక్రమ అరెస్టులు

పెంట్లవెల్లి పట్టణంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి.ఈశ్వర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, రమాదేవి, సువర్ణ, గోవిందమ్మ, పద్మ, వెంకటమ్మ, నాగమణి, ఆశ వర్కర్స్ యూనియన్ సుకన్య, శారద, జ్యోతి, ప్రసన్నను అరెస్టు చేశారు. సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎం.శ్రీనివాసులు, కొల్లాపూర్ మండల కార్యదర్శి బి.శివ వర్మ, పెద్దకొత్తపల్లి మండల కార్యదర్శి దశరథ నాయక్, సీపీఐ(ఎం) కొల్లాపూర్ టౌన్ కార్యదర్శి ఎండి సలీం, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజేష్‌ను అర్ధరాత్రి అరెస్టు చేసి కొల్లాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు, మేకల రాము యాదవ్ పలువురిని అరెస్టు చేశారు. కోడేరు మండల పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. వంగూరులో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బండపల్లి బాలస్వామి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, ఏపీ మల్లయ్య, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఇండ్లల్లో నిద్రిస్తుండగా లేపి లేపి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాలల చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రామదాసును శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వరల్డ్‌కప్ తర్వాత అంతటి ప్రాధాన్యత కలిగిన టోర్నీ ఆసియా కప్. ఏడు సార్లు ఆసియా కప్ విజేతగా నిలిచిన టీమ్ ఇండియా... కాంటినెంటల్ టోర్నీపై తిరుగులేని ముద్ర వేసింది. కానీ 2018 ఆసియా కప్ అనంతరం భారత జట్టు మరో మల్టీ టీమ్ టోర్నీలో విజేతగా నిలువలేదు. ఆధునిక క్రికెట్ అగ్రజట్టుగా కొనసాగు తున్నా.. మల్టీ టీమ్ టోర్నీ టైటిల్ లోటు సుస్పష్టం. స్వదేశంలో ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ వేటకు సిద్ధమవుతున్న టీమ్ ఇండియా.. తొలుత ఆసియా కిరీటం దక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంక సైతం సొంతగడ్డపై అద్భుతంతో మళ్లీ టైటిల్ పట్టేయాలనే పట్టుదల ప్రదర్శిస్తోంది. ఆసియా కప్ ఫైనల్లో భారత్, శ్రీలంక ఢీ నేడు.

ఆసియా కిరీటం ఎవరిదో?

- ఆసియా కప్ టైటిల్ పోరు నేడు
- రికార్డు ఎనిమిదో టైటిల్ భారత్ గురి
- ఆత్మవిశ్వాసంతో డిఫెండింగ్ చాంప్ శ్రీలంక

మధ్యాహ్నం 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..


ప్రేమదాసలో మళ్లీ పంజా విసిరేనా? : విరాట్ కోహ్లి

నవతెలంగాణ-కొలంబో

కాంటినెంటల్ కిరీటం వేటకు భారత్, శ్రీలంక అంతిమ సమరానికి సిద్ధమయ్యాయి. రికార్డు స్థాయిలో ఎనిమిదో సారి ఆసియా కప్‌ను సొంతం చేసుకునేందుకు భారత్ ఎదురు చూస్తుండగా, ఏడో టైటిల్‌తో భారత్ సరసన నిలిచేందుకు శ్రీలంక తహతహ లాడుతోంది. ఆర్థిక సంక్షోభం నడుమ గత ఆసియా కప్‌ను గెలుపొందిన శ్రీలంక.. ద్వీప దేశంలో ప్రజలకు ఆనందం అందించింది. ఇప్పుడూ స్వదేశంలోనూ అదే ప్రదర్శన పునరావృతం చేయాలని శనక సేన భావి స్తోంది. కానీ, రోహిత్‌సేన ఆలోచనలు వేరుగా ఉన్నాయి. గత ఐదేండ్లలో తొలి మల్టీ టీమ్ ఈవెంట్ విజయంతో వన్డే వరల్డ్‌కప్ వేటకు సిద్ధ మవ్వాలని భారత్ ప్రణాళిక. బలాబలాల పరంగా భారత్ హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్న ప్పటికీ.. డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంక అవకాశాలను తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు.

గట్టిగా కొట్టాలని..!

జట్టుపై ఎన్నో ప్రశ్నలు, అనుమానాలతో ఆసియా కప్‌కు వచ్చిన భారత్.. ఫైనల్ పోరుకు ముందే డ్రెస్సింగ్‌రూమ్‌లో, విమర్శకులలో సానుకూల వాతావరణం తీసుకొచ్చింది. బ్యాటింగ్ లైనప్‌లో ప్రతి బ్యాటర్ ఏదో ఒక మ్యాచ్‌లో ఒక మంచి ఇన్నింగ్స్ ఆడారు. బౌలింగ్ విభాగంలోనూ ఇదే తీరు. కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్‌లు మంచి ఆరంభాలు అందిస్తున్నారు. విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ పాకిస్థాన్‌పై శతక మోత మోగించగా.. ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యలు గ్రూప్ దశ మ్యాచుల్లోనే సత్తా చాటి ఫామ్‌లోకి వచ్చారు. బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లు కొత్త బంతితో బ్రేక్ అందిస్తున్నారు. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ప్రత్యర్థులకు సింహస్వప్నంగా మారాడు. స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా బంతితో ఫర్వాలేదనిపించినా.. బ్యాట్‌తో తనదైన జోరు చూపించాల్సి ఉంది. నేడు శ్రీలంకతో ఆసియా కప్ ఫైనల్లో జడేజా మ్యాజిక్ చేస్తాడేమో చూడాలి.

నమ్మకమే జయం!

నమ్మకమే జయమని డిఫెండింగ్ చాంపి యన్ శ్రీలంక నమ్ముతుంది. అండర్‌డాగ్‌గా బరిలోకి దిగి గత ఆసియా కప్ విజేతగా నిలిచింది. ఇప్పుడు టైటిల్ ఫేవరేట్ భారత్‌తో ఫైనల్లోనూ అదే నమ్మకంతో బరిలోకి దిగుతోంది. సూపర్ 4 మ్యాచ్‌లో టీమ్ ఇండియాపై ఓ దశలో తిరుగులేని పైచేయి సాధించిన లంకేయులు.. బ్యాటర్ల వైఫల్యంతో వెనక్కి తగ్గారు. టైటిల్ పోరులో అదే స్ఫూర్తితో పోరాడేందుకు శనక గ్యాంగ్ సిద్ధమైంది. నం.3 బ్యాటర్ కుశాల్ మెండిస్ శ్రీలంక బ్యాటింగ్ లైనప్ వెన్నుముక. ఐదు మ్యాచుల్లో అతడు 253 పరుగులు చేశాడు. పాక్‌పై 91, బంగ్లాపై 50, అఫ్గాన్‌పై 92 పరుగులు నమోదు చేశాడు. భారత్‌పై ఓ మంచి ఇన్నింగ్స్‌తో ఆసియా కప్‌ను దిగ్విజయంగా ముగించాలని మెండిస్ భావిస్తున్నాడు. మెండిస్‌కు పెరీరా, నిశాంక, అసలంకలు తోడైతే శ్రీలంక ఫైనల్లో గట్టి పోటీ ఇచ్చేందుకు అవకాశం ఉంది. పేసర్ మతీశ పతిరణ నేడు భారత బ్యాటర్లకు సవాల్ విసిరేందుకు సిద్ధంగా ఉన్నాడు. శనక, డిసిల్వ, వెల్లలాగే, హేమంత, రజితలు సైతం సత్తా చాటేందుకు ఎదురు చూస్తున్నారు.


శ్రీలంక బ్యాటింగ్ వెన్నెముక : కుశాల్ మెండిస్

వరుణ గండం?!

ఆసియా కప్‌ను వరుణుడు వీడటం లేదు. గ్రూప్ దశ నుంచీ మొదలైన వర్షం ఆటంకం సూపర్ 4 మ్యాచుల్లోనూ కొన సాగింది. చివరగా ఆసియా కప్ ఫైనల్స్‌లోనూ వర్షం ముప్పు పొంచి ఉంది. భారత్, శ్రీలంక టైటిల్ పోరులో ఢీకొట్ట నుండగా..ఆదివారం మ్యాచ్ సమయంలో 60-80 శాతం మేర వర్షం కురిసేందుకు అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు వాతావరణ శాఖ తెలిపింది. రిజర్వ్ డే (సోమవారం) సైతం వాతావరణం ఏమాత్రం ఆశాజనకంగా లేదు. సోమ వారం సైతం సుమారు 80 శాతం వరకు వర్షం కురువ నుందని తెలుస్తుంది. దీంతో ఆటగాళ్లు, అభిమానులు ఓ కన్ను ఆటపై.. మరో కన్ను ఆకాశంపై ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది!.

స్పిన్ సవాల్

ఆసియా కప్ ఫైనల్ స్పిన్ వార్‌గా మారింది!. కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియంలో తొమ్మిది రోజుల వ్యవధిలోనే ఆరు మ్యాచులు జరిగాయి. దీంతో పిచ్‌లు ఎంతగానో నెమ్మదించాయి. పేసర్లకు పెద్దగా సహకారం దక్కటం లేదు. కానీ వరుణుడు సైతం ప్రతి మ్యాచ్‌కు రావటంతో.. పిచ్ నుంచి పేసర్లకు కాసింత సహకారం అందింది. ఫైనల్లోనూ ఇదే పరిస్థితి కనిపించనుంది. భారత్, శ్రీలంక సూపర్4 మ్యాచ్‌లో రోహిత్‌సేన పది వికెట్లు స్పిన్నర్లకే కోల్పోయింది. అందులో పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. స్పిన్ వార్‌లో భారత్‌కు కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా ఉండగా.. శ్రీలంకకు ఇప్పుడు యువ మాయగాడు దునిత్ వెల్లలాగే ఒక్కడే ఉన్నాడు. ఆఫ్ స్పిన్నర్ ధనంజయ డిసిల్వ ఆశించిన ప్రభావం చూపించటం లేదు.

గాయాల దెబ్బ

ఆసియా కప్ ఫైనల్స్ ముంగిట భారత్, శ్రీలంకకు గాయాల దెబ్బ. టీమ్ ఇండియా స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, శ్రీలంక స్టార్ స్పిన్నర్ మహీశ్ తీక్షణ నేడు టైటిల్ పోరుకు దూరమయ్యారు. తొడ కండరాల నొప్పితోనే బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో ఛేదనకు దిగిన అక్షర్ పటేల్..నేడు ఫైనల్‌కు అందుబాటులో లేడు. దీంతో మరో యువ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ హుటాహుటిన బెంగళూర్ నుంచి కొలంబో చేరుకున్నాడు. పిచ్, పరిస్థితులను బేరీజు వేసి అనంతరం వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశం లేకపోలేదు. ఇక ఈ ఏడాది వన్డేల్లో అత్యంత విజయవంతమైన స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, మహీశ్ తీక్షణ. జనవరి నుంచి ఇద్దరూ వన్డేల్లో 31 వికెట్లు పడగొట్టారు. చైనామన్ స్పిన్నర్ ఫైనల్లో భారత్‌కు కీలకం కానుండగా.. స్పిన్‌కు అనుకూలించే పిచ్‌పై మహీశ్ తీక్షణ బెంచ్‌కు పరిమితం కానున్నాడు. దీంతో ఇటు భారత్‌కు, అటు శ్రీలంకకు గాయాల దెబ్బ సమంగా తగిలింది!.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, శార్దుల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా.

శ్రీలంక : కుశాల్ పెరీరా, పథుం నిశాంక, కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), సదీర సమరవిక్రమ, చరిత్ అసలంక, ధనంజయ డిసిల్వ, దసున్ శనక (కెప్టెన్), దునిత్ వెల్లలాగే, దుశాన్ హేమంత, మతీశ పతిరణ, కసున్ రజిత.

పతకాల పంట ఖాయం!

2023 ఆసియా క్రీడలపై పి.టి ఉష



న్యూఢిల్లీ : భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ క్వీన్ పరుగుల రాణి పి.టి ఉష. ఆసియా క్రీడల్లో భారత్‌కు చిరస్మరణీయ విజయాలు అందించిన పి.టి ఉష.. కాంటినెంటల్ క్రీడా సంగ్రామంలో తిరుగులేని ప్రదర్శన చేసింది. 1982 న్యూఢిల్లీలో మొదలైన ఉష తుఫాన్.. 1986 హిరోషిమా వరకు కొనసాగింది. 1986 సియోల్ ఆసియా క్రీడల్లో భారత్ ఐదు పసిడి పతకాలు సాధించగా. అందులో నాలుగు స్వర్ణాలు పి.టి ఉష గెలుపొందినవే కావటం విశేషం. ఇక కోచ్‌గానూ ఆసియా క్రీడల్లో ఉషకు మంచి రికార్డుంది. 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో ఉష శిష్యులు పతకాలు దక్కించుకున్నారు. తాజాగా భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలిగా మరో పాత్రలో ఆసియా క్రీడలకు సిద్ధమైన పి.టి ఉష.. హాంగ్జౌ ఆసియా క్రీడల్లో పతకాల పంట ఖాయమనే విశ్వాసం వెలుబుచ్చింది. '2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో భారత పతక అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆసియా క్రీడల చరిత్రలోనే రికార్డు పతకాలు సాధించేందుకు రంగం సిద్ధమైంది. పలు విభాగాల్లో పసిడి పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగుతుంది. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో సైతం మెడల్స్ గణనీయంగా పెరుగుతాయి. జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రాకు పసిడి ఖాయమని నమ్ముతున్నాను. పాక్ అథ్లెట్ అర్షద్ నుంచి పోటీ ఉన్నప్పటికీ.. నీరజ్‌కు పసిడి లాంఛనమే. కిశోర్ జెనా సైతం మెడల్ రేసులో ఉన్నాడు. ట్రాక్ ఈవెంట్స్‌లో మెన్స్ రిలే జట్టు పసిడి ఫేవరేట్. మహిళల విభాగంలో మారథాన్ ఈవెంట్లో మనకు పతక అవకాశాలు అధికంగా ఉన్నాయి. జంప్ ఈవెంట్స్‌లో శ్రీశంకర్, ప్రవీణ్, అబూబకర్, శాలిని సింగ్, ఆన్సీ సోజన్‌లకు మంచి అవకాశం ఉంది. హర్డిల్స్, షాట్‌పుట్, స్టీపుల్‌ఛేజ్‌లో మనకు పతక విజేతలు ఉన్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ కాకుండా.. ఇతర విభాగాల్లో భారత్‌కు చాంపియన్లు ఉన్నారు. హాకీలో మెన్స్, ఉమెన్స్ జట్లకు పతకాలు ఖాయం. బ్యాడ్మింటన్‌లో సింధు, లక్ష్యసేన్, ప్రణయ్‌లు ఉన్నారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను సహా యువ లిఫ్టర్లు ఉన్నారు. సహజంగానే రెజ్లింగ్‌లో మనకు తిరుగు ఉండదు. ఆర్చరీ, వాటర్ స్పోర్ట్స్‌లో ఈసారి నాణ్యమైన అథ్లెట్లు బరిలో నిలిచారు. ఈస్పోర్ట్స్, క్రికెట్, చెస్ క్రీడాంశాలు భారత్ పతకాల సంఖ్యను మరింత పెంచనున్నాయి. ఇక నేను భారత ఒలింపిక్ సంఘం బాధ్యతలు అందుకున్న తర్వాత జరుగుతున్న తొలి మేజర్ టోర్నీ ఇది. ఆసియా క్రీడలకు ఐఓఏ సర్వ సన్నద్ధంగా ఉంది. అథ్లెట్లకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూసుకుంటూ పతక వేటలో దూసుకెళ్లేలా ఐఓఏ జట్టు పని చేస్తోందని' పి.టి ఉష తెలిపింది.



ముగిసిన జిమ్నాస్టిక్స్ పోటీలు

హైదరాబాద్ : ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ పోటీలు ముగిశాయి. శనివారం హైదరాబాద్‌లోని ఏబీ జిమ్నాస్టిక్స్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన పోటీల్లో రాకర్ట్ జిమ్నాస్టిక్స్ అకాడమీ అథ్లెట్లు సత్తా చాటారు. బాలురు, బాలికల విభాగంలో మెడల్స్ స్వీప్ చేసిన జిమ్నాస్ట్‌లను డైరెక్టర్లు డెవిడ్, దీపికలు అభినం దించారు. బాంద్ర ఆనంద్, ఆమర్త్య, సూర్యాంశు, నందన్, విదార్థి, అద్వైత, విదార్థి వర్మ, ఆర్జవ్, సమీక్ష వ్యాస్, సన్నిధి, నవీ సూర్యవంశిలు ఆయా విభాగాల్లో పసిడి పతకాలు దక్కించుకున్నారు. తెలంగాణ జిమ్నా స్టిక్స్ సంఘం కార్యదర్శి సోమేశ్వర్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రశ్నించే పవర్‌ఫుల్ పాత్ర

విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందుతున్న న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్ 'పెదకాపు-1'. ద్వారకా క్రియేషన్స్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందులో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు తనికెళ్ళ భరణి మీడియాతో మాట్లాడుతూ, 'ఇందులో నా పాత్ర సమాజంపై విసిగిపోయిన ఓ మేధావి పాత్ర. స్కూల్ టీచర్‌కి సమాజంపై ఒక అవగాహన ఉంటుంది. నా పాత్ర దర్శకుడి వాయిస్‌ని రిప్రజంట్ చేస్తుంది. ప్రేక్షకుల తరపున ప్రశ్నించే పాత్ర. చాలా అద్భుతమైన వేషం. ఈ మధ్య కాలంలో నేను చేసిన ది బెస్ట్ క్యారెక్టర్ ఇది. ఈ చిత్రంలో దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ట్రాన్స్‌ఫర్మేషన్ చాలా భిన్నంగా ఉంటుంది. విరాట్ కర్ణ కొత్త హీరోగా కాకుండా ఒక పాత్రగా కనిపించి, నన్ను సర్‌ప్రైజ్ చేశాడు. నా 40 ఏళ్ల కెరీర్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఒక సినిమా చేయాలనే కోరిక మాత్రం ఉంది' అని తెలిపారు.


తనికెళ్ళ భరణి



నూతనంగా ఎన్నికైన తెలుగు సినీ స్టిల్ ఫోటోగ్రాఫర్ల సంఘం సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. గత ఆదివారం నిర్వహించిన ఎన్నికలలో సంఘం అధ్యక్షుడిగా తాత మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా జి. వెంకట్‌రావు, కోశాధికారిగా సతీష్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా బి. కాంతారెడ్డి (శ్రీకాంత్), ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేష్ బాబు ఎన్నికయారు. హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార వేడుకకి ముఖ్య అతిథిగా తెలుగు సినిమాటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.జి.విందా, ఫిల్మ్ ఫెడరేషన్ ట్రెజరర్ సురేష్ హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించి, సభ్యులను ఘనంగా సన్మానించారు.

రాజ్యం కోసం పోరాడే ఓ మహిళ కథ


మోనిక రెడ్డి, భాస్కర్‌రెడ్డి

'భీమ్లానాయక్' చిత్రంతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న మోనిక రెడ్డి ప్రధాన పాత్రలో సుధా క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం: 1గా ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రం ద్వారా రాకేష్ రెడ్డి యాస దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. దీనికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ భాస్కర్ రెడ్డి. శనివారం పూజా కార్యక్రమాలతో ఈ చిత్ర ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన షేడ్స్ స్టూడియో ఫౌండర్ దేవి ప్రసాద్ భలివాడ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. మరో అతిథి అంజిరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా హీరోయిన్ మోనిక రెడ్డి మాట్లాడుతూ,' ఈ సినిమా నాకు ఎంతో ప్రత్యేకం. స్టోరీ మొత్తం నా మీదే నడిచే లేడీ ఓరియెంటెడ్ సినిమాలో నటించడం చాలా సంతోషంగా ఉంది. నా పాత్రను దర్శకుడు చాలా డిఫరెంట్‌గా డిజైన్ చేశారు' అని తెలిపారు. 'ఇదొక పీరియాడిక్ మైథలాజికల్ ఫిల్మ్. ఒక మహిళ ధైర్య సాహసాలతో రాజ్యం కోసం పోరాడితే ఎలా ఉంటుందో తెలిపే చిత్రమిది' అని దర్శకుడు రాకేష్ రెడ్డి యాస చెప్పారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, 'ఈ రోజు షూటింగ్ ప్రారంభమై, కంటిన్యూయస్‌గా షెడ్యూల్ జరుగుతుంది. త్వరలో టైటిల్‌తో పాటు మిగతా సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడిస్తాం' అని అన్నారు.

నవచిత్రం

డిఫరెంట్ కాన్సెప్ట్‌తో భ్రమయుగం


మమ్ముట్టి

పాలక్కాడ్ జిల్లా ఒట్టపాలెంలో 'భ్రమయుగం' చిత్రీకరణను శనివారంతో మమ్ముట్టి విజయవంతంగా పూర్తి చేసిన విషయాన్ని నైట్ షిఫ్ట్ స్టూడియోస్ ఎంతో సంతోషంగా పంచుకుంది. ఈ ఏడాది ఆగస్టు 17న ఈ చిత్రంలోని ప్రధాన సన్నివేశాల చిత్రీకరణ ప్రారంభమైంది. కొచ్చి, ఒట్టపాలెంలో భారీ స్థాయిలో చిత్రీకరణ జరిగింది. మిగిలిన షెడ్యూల్ నటులు అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్దా లిజ్‌లతో కొనసాగు తుంది. చిత్రీకరణ అక్టోబర్ మధ్యలో పూర్తవుతుంది. చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఛాయా గ్రాహకుడిగా షెహనాద్ జలాల్, ప్రొడక్షన్ డిజైనర్‌గా జోతిష్ శంకర్, ఎడిటర్‌గా షఫీక్ మహమ్మద్ అలీ, సంగీత దర్శకుడిగా క్రిస్టో జేవియర్, మాటల రచయితగా టిడి రామకృష్ణన్ వ్యవహరిస్తున్నారు. మేకప్ బాధ్యతలు రోనెక్స్ జేవియర్, కాస్ట్యూమ్స్ బాధ్యతలు మెల్వీ జె నిర్వహిస్తున్నారు. హర్రర్-థ్రిల్లర్ జోనర్ చిత్రాలను నిర్మించడానికి ప్రత్యేకంగా స్థాపించిన నిర్మాణ సంస్థ నైట్ షిఫ్ట్ స్టూడియోస్ బ్యానర్‌పై రాహుల్ సదాశివన్ రచన-దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటున్న 'భ్రమయుగం' చిత్రంలో మమ్ముట్టి ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రారంభంలో మలయాళం, తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

7 భాషల్లో రిలీజ్

ప్రియాంక ఉపేంద్ర నటిస్తున్న 50వ చిత్రం 'డిటెక్టివ్ తీక్షణ'. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుక బెంగళూరులోని ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆడిటోరి యంలో ఘనంగా జరిగింది. పలు భాషల్లో ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో ఉపేంద్ర రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'డిటెక్టివ్ పాత్ర లను సరిగ్గా మలిచినప్పుడు అవి తెరమీద అద్భు తంగా వస్తాయి. ట్రైలర్‌లో మ్యూజిక్ రోమాంఛితం గా ఉంది. ప్రియాంక 50 చిత్రాలు పూర్తి చేశారు. నేను ఇంకా 46వ చిత్రం దగ్గరే ఉన్నాను. మా వందో చిత్రానికి మేమిద్దరం కలిసి పని చేస్తామని ఆశిస్తున్నాను' అని తెలిపారు. "ప్రియాంక నా టాలెంట్‌ని గుర్తించి నాకు ఈ అవకాశం ఇచ్చారు. మరో రెండు నెలల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అని దర్శకుడు త్రివిక్రమ్ రఘు చెప్పారు. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని కన్నడ, తెలుగు, హిందీ, తమిళ, మలయాళం, బెంగాలీ, ఒరియా ఇలా ఏడు భాషల్లో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

అడిగా అడిగా..


మిర్నాళిని రవి, సుధీర్‌బాబు

సుధీర్ బాబు, హర్షవర్ధన్ దర్శకత్వంలో రాబోతున్న యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'మామా మశ్చీంద్ర'. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సుధీర్ బాబు త్రిపాత్రాభినయం చేస్తున్న ఈ సినిమాలో మిర్నాళిని రవి, ఈషా రెబ్బా హీరోయిన్లుగా నటిస్తు న్నారు. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ 'అడిగా అడిగా' అనే పాటను విడుదల చేశారు. చైతన్ భరద్వాజ్ హృదయాన్ని హత్తుకునే అమ్మ పాటను స్కోర్ చేశారు. ఈ పాట వినగానే భావోద్వేగానికి గురి చేస్తుంది, అమ్మతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది. గీత రచయిత చైతన్య ప్రసాద్ భావోద్వేగాలను చాలా అద్భుతంగా వ్యక్తీకరించారు. పాటలో శ్రీనివాసన్ దొరైస్వామి వాయిస్ మరింత ఆకర్షణీయంగా మారింది. ఈ సినిమా అక్టోబర్ 6న థియేటర్లలోకి రానుంది అని చిత్ర బృందం తెలిపింది.

మెప్పించే అతిథి

వేణు తొట్టెంపూడి, అవంతిక మిశ్రా లీడ్ రోల్స్‌లో నటించిన వెబ్ సిరీస్ 'అతిథి'. రాండమ్ ఫ్రేమ్స్ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్ పై దర్శకుడు భరత్ వైజీ దీన్ని రూపొందించారు. దర్శకుడు ప్రవీణ్ సత్తారు షో రన్నర్‌గా వ్యవహరించారు. డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ఈ నెల 19 నుంచి ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. తాజాగా ఈ వెబ్ సిరీస్‌లోని ఫస్ట్ రెండు ఎపిసోడ్స్‌ను మీడియాకు ప్రత్యేకంగా ప్రివ్యూ వేశారు. ఈ సందర్భంగా దర్శకుడు భరత్ వైజీ మాట్లాడుతూ, 'ఈ వెబ్ సిరీస్ కథకు నా రియల్ లైఫ్‌లో చూసిన ఒక ఇన్సిడెంట్ స్ఫూర్తినిచ్చింది. వేణు పర్ఫార్మెన్స్ చాలా బాగుంటుంది. ఇది అండర్ కరెంట్‌గా హర్రర్ ఉంటూ ఎంటర్‌టైన్ చేస్తుంది' అని అన్నారు. 'ఈ వెబ్ సిరీస్ ఇంత బాగా వచ్చిందంటే ఆ క్రెడిట్ నేను టెక్నీషియన్స్‌కు ఇస్తాను. ఇందులో హర్రర్, కామెడీ ఇవన్నీ పక్కన పెడితే అందరూ కలిసి హాయిగా చూడగలిగే కథ ఇది' అని హీరో వేణు చెప్పారు.


Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.



ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్... దీని గురించి పెద్దగా పరిచయం చేయాల్సిన పని లేదు. ఈ రోజుల్లో మనం ఉపయో గించే చాలా ఎలక్ట్రానిక్ పరికరాలు దీని ద్వారానే నడుస్తున్నాయి. మనం ఎక్కడ ఏది బ్రౌజ్ చేసినా అందుకు సంబంధించిన సమాచారం ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ద్వారానే మనకు అందుబాటులోకి వస్తుంది. ఇందులో నూతన ఒరవడి అయిన మెర్లిన్‌కు శ్రీకారం చుట్టారు ప్రత్యూష్ రాయ్. అతని స్నేహితుల కలిసి ప్రారంభించిన ఫోయర్ - మెర్లిన్ అలతి కాలంలో వినియోగదారులను పెంచుకుంది. ఈ మెర్లిన్ పని తీరు గురించి ఈ వారం జోష్...

రాయ్ మాటల్లో చెప్పాలంటే 'బీసీజీలో రాయ్ అనుభవంతో నేర్చుకున్న ఎన్నో పాఠాలు 'మెర్లిన్' ప్రయాణంలో ఉపయోగపడ్డాయి. ఆ అనుభవ పాఠాలు తన ప్రపంచాన్నే మార్చేసి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేశాయి.

మెరిసిన మెర్లిన్...



ప్రత్యూష్ రాయ్ ఫోయర్–మెర్లిన్‌కి ఆద్యుడు. ఐఐటీ–కాన్పూర్ సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్. గ్లోబల్ కన్సల్టెన్సీ బీసీజీతో కలిసి పని చేసేవాడు. అందులో భాగంగా ఒక పెద్ద వినియోగదారు ఉత్పత్తుల కంపెనీతో సంప్రదింపులు జరుపుతున్న బృందంలో ఉన్నాడు. అది చాలా పెద్ద ప్రాజెక్టు. అదే సమయంలో అతను కోవిడ్ బారిన పడ్డాడు. కోవిడ్ ప్రభావం ఉన్న సమయం కావడంతో కంపెనీకి నగదు కొరత ఏర్పడింది. దాని వల్ల కంపెనీ ఎదుర్కొనే సమస్యలు ఏ విధంగా ఉంటాయో ప్రత్యక్షంగా చూశాడు. అయినప్పటికీ అతని క్లయింట్ ఉద్యోగులను తొలగించాలని అనుకోలేదు. అయితే వీరి పోటీదారు మాత్రం చాలా మంది ఉద్యోగులను తొలగించాడు. అయితే తర్వాత వారి సంస్థలో కొన్ని వారాల్లోనే నగదు సంక్షోభం సమస్య తీరినప్పటికీ అది అతని మనసులో తీవ్ర ప్రభావం చూపించింది. బీపీజీ అనుభవాలు అతనిలో తీవ్ర అంతర్మథనాన్ని రేకెత్తించాయి. అందరికీ ఉపయోగపడేలా ఏదైనా చేయాలన్న ఆలోచనల నుంచి ఏర్పడిందే మెర్లిన్ ఏఐ.

స్నేహితులతో కలిసి...


ఇతనితో పాటు కాలేజ్ ఫ్రెండ్స్ అయిన సిద్ధార్థ సక్సేనా, సిరిసేందు సర్కార్ లతో కలిసి ఏదైనా తమ సొంతంగా చేయాలనే ఉత్సాహంతో ఉండేవారు. అనేక ఆలోచనల తర్వాత "అందరికీ ఉపయోగపడేలా, వ్యక్తి అవసరానికి అనుగుణంగా శోధిస్తే, దానికి దగ్గరి ఫలితాన్ని అందించేలా ఏదైనా చేయాలని" నిర్ణయానికి వచ్చారు. ఆ ఆలోచనల నుంచి మొదలైన ప్రయాణం 2021లో 'మెర్లిన్' గా ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఇది క్రోమ్‌కు ఎక్స్‌టెన్షన్‌గా, ఒక్క బటన్ క్లిక్‌తో చాట్ జీపీటీగా వినియోగదారుల మన్నలను పొందుతోంది.



"మెర్లిన్ చాలా సులభమైన ఉత్పత్తి. ఇది అన్ని బ్రౌజర్‌లో పొందుపరచి ఉంటుంది. యూట్యూబ్, జీమెయిల్, లింక్డ్ ఇన్, ట్విట్టర్ వంటి రోజువారీ వినియోగాల్లో భాగాలైన సైట్‌లో ఉంటూ, క్లిష్టమైన సమస్యలను పరిష్కరిస్తుంది." అని రాయ్ వివరించాడు.

మెర్లిన్ ఏఐ అంటే ఏమిటి?

మెర్లిన్ అనేది ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్. మనిషి కంప్యూటర్ కన్వర్జేషన్‌ను మనం చాట్‌బాట్ అంటాం. ఉదాహరణకు మనం ఏదైనా యాప్‌లో హెల్ప్ సపోర్ట్ కోసం చాట్ చేసినపుడు మొదట హాయ్ అని పెడతాం. అవతలి నుంచి కూడా మనకు రిప్లై వస్తుంది. కానీ అది మనిషి ఇచ్చే రిప్లయ్ కాదు. కంప్యూటర్ ఆధారిత చాటింగ్. అంటే కేవలం మనం అడిగే ప్రశ్నలకు కంప్యూటర్ సమాధానం ఇస్తుంది. ఈ ఉపయోగించే విధానాన్ని చాట్ బాట్ అంటాం. ఈ ఉపయోగించే విధానాన్ని చాట్ జీపీటీ అంటాం. చాట్ అంటే తెలుసు. మరి జీపీటీ అంటే... జనరేటివ్ ప్రీ ట్రైన్డ్ ట్రాన్స్‌ఫార్మర్. అంటే మనకు కావాల్సిన ఇన్ఫర్మేషన్ ముందుగానే కంప్యూటర్‌లో పొందుపరిచి ఉంటుంది. దీని ద్వారా వర్చువల్ సంభాషణలు కొనసాగించే వీలుంటుంది. మనకు అవసరమైన ఏ సమాచారాన్ని అయినా దీనిలో సెర్చ్ చేసుకోవచ్చు. ఉదాహరణకు ఏదైనా ఒక వస్తువు ఉపయోగం గురించి సెర్చ్ చేస్తే దానిని ఎలా ఉపయోగించాలనే అంశం టెక్స్ట్ రూపంలో డిస్‌ప్లే అవుతుంది. ఏదైనా ఒక పేరుగాంచిన వ్యక్తి గురించి సమాచారం కావాలంటే ఆ వ్యక్తి పూర్తి బయోడేటాను టెక్స్ట్ రూపంలో చూపిస్తుంది. దీనికి ఇంటర్నెట్ సహాయం అవసరం ఉండదు. అంతేకాదు దీనిని 2021 వరకు మాత్రమే అప్‌డేట్ చేసి ఉంచారు. ఆ లోపు జరిగిన సంఘటనలు, వ్యక్తుల వివరాలు, ప్రాజెక్టులు ఇలా ప్రతి అంశం ఇందులో నిక్షిప్తమై ఉంటుంది. ఆ తర్వాత జరిగిన సంఘటనల గురించి అడిగితే సారీ నో ఇన్ఫర్మేషన్ అని చూపిస్తుంది. అయితే దీనిని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నారు. ఆ ప్రయోగం విజయవంతమైందంటే.. గూగుల్ వెనుకబడిపోతుంది.



గూగుల్ సెర్చ్‌కి చాట్ జీపీటీ మధ్య తేడాలు

మనం ఎవరైనా పేరుగాంచిన వ్యక్తి గురించి లేదా ఒక వస్తువు సమాచారం తెలుసుకోవాలంటే గూగుల్ సెర్చ్‌లో అందుకు సంబంధించిన వందలకొద్ది లింక్‌లు వస్తాయి. ఇందులో అలా ఉండదు. కేవలం మనం సెర్చ్ చేసిన అంశం గురించి ఒకటే సమాధానం మొత్తం టెక్స్ట్ రూపంలో చూపిస్తుంది. ఏదైనా ప్రోగ్రామ్స్ వంటివి కూడా ఇందులో అందుబాటులో ఉంటాయి. అందుకే లాంచ్ చేసిన ఐదు రోజుల్లోనే రికార్డు స్థాయిలో ఉపయోగించారు. దీని వల్ల విద్యార్థులకు అడ్వాంటేజ్, డిస్ అడ్వాంటేజ్ ఉన్నాయి. ఉదాహరణకు మాథ్స్‌కు సంబంధించిన ప్రాబ్లెమ్ ఏదైనా అడిగితే పాయింట్ టు పాయింట్ థియరీ ఉదహరించుకుంటూ వెళుతుంటుంది. దీని వల్ల ఎగ్జామ్స్‌లో మిస్ యూజ్ చేసుకునే అవకాశం ఉంటుంది.

ప్రపంచ వ్యాప్తంగా వినియోగం..

అమెరికా, తూర్పు ఆసియా, యూరోప్‌లతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారులున్నారు. ఫోయర్ – మెర్లిన్‌ను ప్రారంభించిన ఆరు నెలల్లోనే దాదాపు లక్షల్లో వినియోగదారులు 750,000 ఇన్‌స్టాల్‌లలో దూసుకుపోయింది. ఇందులో 85 నుంచి 90 శాతం మంది వినియోగదారుల వారి బ్రౌజర్‌లలో మెర్లిన్‌ను ఎనేబుల్ చేసిన వారేనని పేర్కొన్నారు.

YouTubeకు సంబంధించి 'మెర్లిన్'ను 'యూట్యూబ్ సమ్మరైజర్'గా ఉపయోగించు కుంటున్నారు వినియోగదారులు. ఉదాహరణకు, ఎవరైనా YouTubeలో వీడియోను చూస్తున్నట్లయితే లేదా పోడ్‌క్యాస్ట్ (కంప్యూటర్ లేదా మొబైల్ పరికరానికి సమాచారాన్ని బదిలీ చేయడానికి ఇంటర్నెట్లో అందుబాటులో ఉన్న ఒక అంకం కలిగిన ఆడియో ఫైల్)ని వింటున్న సమయంలో ఆడియో లేదా వీడియో నిడివి ఎక్కువగా ఉంటే, అందులో కంటెంట్ కోల్పోకుండా మెర్లిన్ ద్వారా వినియోగదారులు అందులోని సారాంశాన్ని పొందవచ్చు. అంటే వీడియోను పూర్తిగా చూడనవసరం లేకుండానే దానిలోని ముఖ్యమైన సెగ్మెంట్ల గురించి 'మెర్లిన్' చెబుతుంది. పర్సనలైజ్డ్ ప్రాంప్ట్ విషయంలోనూ 'మెర్లిన్' ఉపయోగపడుతుంది.

మెర్లిన్ సక్సెస్‌కు కారణం దానిపై యూజర్లకు కుదిరిన నమ్మకమే'. "వాస్తవానికి, మా దృష్టి డెవలపర్‌లపై చాలా లోతుగా ఉంది, కానీ ప్రజలు మా ఉత్పత్తిని చాలా ఆసక్తికరమైన మార్గాల్లో ఉపయోగిస్తున్నారని మేం గ్రహించాం - మార్కెటర్లు మెర్లిన్‌ను కేవలం కమాండ్ బార్ ఇంటర్‌ఫేస్‌గా ఉన్నప్పటి నుండి ఉపయోగిస్తున్నారు" అని రాయ్ గుర్తు చేసుకున్నారు.

ఈ సక్సెస్‌తో వాళ్ళు ఆగిపోవాలనుకోవడం లేదు. ఇందులో ఇంకొన్ని సబ్ ఫీచర్లు తీసుకురావాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సంస్థ బెంగళూరు కేంద్రంగా పనిచేస్తోంది.

ప్రేమ మేఘం



ఒక మేఘంలా తాను నాపై
ప్రేమ వర్షాన్ని కురిపించినపుడు
నా పెదవంచుల తేనె చిగురు పూస్తుంది

నా గుండెకు దగ్గరగా చేరినపుడు
తన శ్వాసా రవళి చెవిని తాకుతుంటే
కొమ్మల్లో రక్తం నింపుకున్న గులాబీలా
హృదయం వికసిస్తుంది

నల్లని దెయ్యం లాంటి చీకటిలో
ఆమని లా విరబూసిన తన చూపులు
తీయని రాగాలు మోసుకొచ్చి
శ్వాసలో ఏకమైపోతాయి

ప్రతీ క్షణం నన్ను చీల్చి చెండాడే ఈ లోకం
నా దరికి రాదాక్షణం
మరో లోకం లో మమ్మల్ని ఒంటరిని చేస్తుంది
దారి తప్పుతూ తీరం వెతుక్కుంటాం ఆ క్షణం

- పి.సురేంద్ర, 9346704966

చెదరని గురుతులు



దినకరుడి కాళ్ళకి
నా కళ్ళనతికించుకుని మరీ
వెతుకుతాను నీ జాడ కోసం

నిశి రాత్రిలో
మిణుకు మిణుకు మిణుగురులు
తళుకు తళుకు చుక్కలు
తోడు నడుస్తాయి నా బాధ చూడలేక
అప్పుడప్పుడూ....
పున్నమి వెన్నెల నా చేతిలో
లాంతరై దారి చూపుతుంది

ఏ పొన్నపూలో వాసనలొదిలి
మనం ఏకాంతంగా కలుసుకునే చోట
నీవున్నవనే జాడ తెలుప చూస్తాయి
ఆ వాసనల దారం అంచుల పట్టుక
నేనొస్తుంటే
అకస్మాత్తుగా ఓ పాడు గాలి
దాన్ని మాయం చేసి
నన్ను దిక్కులేని దాన్ని చేస్తుంది సఖుడా...

అలసిపోయి
కొండ కొసల కూచుండి
దీర్ఘాలోచనలో ఉంటున్నపుడు
అక్కడే... అక్కడే...
మనం ఒకరి పాదాలతో
ఒకరం చేసుకున్న బాసలు గురుతొచ్చి
ఒళ్లు జలదరిస్తుంది


దూప చేసి కాసింత గొంతు
తడుపుదామని
గబగబా కిందకి దిగి
ఏటి ఒడ్డుకు చేరుతాన
ఇరువురమే కమలాల మధ్య
దోబూచులాడుకున్న
జ్ఞాపకమొకటి గురుతొచ్చేసరికి
దాహం మరింత పెరిగి
గొంతెండి పోతుంది

నీ జ్ఞాపకాల వడగాలి
నా ఒంటిలో రాజేసిన వేడికి
నా నోటిలో
లాలాజలం కూడా ఆవిరైపోతుంది

ఎటూ పాలుపోకా...
నీ జ్ఞాపకాల నుండి తప్పించుకోడానికి
ఓ కూని రాగం తీద్దామని గొంతెత్తితే
చివరికి నీతో కలిసి పాడుకున్న
ప్రణయ విరహ రాగమొకటి గురుతొచ్చి
గొంతు పెగలక
మౌన రాగమే నా తోడు నడుస్తుంది...

- దిలీప్.వి, 8464030808

దిగాలు



మనం బాటసారులమై
మన పనిమీద మనం నడిచెల్లిపోతుంటే
తెల్లబట్టగప్పుకొని సెండుపూల పరుపుపై
శవాన్ని నల్గురు మోసుకొస్తుంటే
ఓ కన్నీటి చుక్క రాల్చకపోతే
అప్పటికప్పుడే మనలో మనం శవమైనట్లే.

ఊరిలో చివరి గుడిసె కాలిపోతే
కొంగు అడ్డం పెట్టుకోకుండా
బాహాటంగా ఏడుస్తున్న ఆ అమ్మ దుఃఖానికి
నేను కూడా కారణమే కదా అనీ
తననీ తాను నిందితుడిగా ప్రకటించుకోనోడు
మనిషిగా ఎప్పటికీ మనిషి కాలేడు.

నువ్వు మూడు పూటల బువ్వతిని
మెతుకుల కోసం చేసే పోరులో
నీ పిడికిలొక్కటి లేయకపోతే
ఈ సమాజమంత గుర్తుపెట్టుకునే
ఉద్యమ ద్రోహివి నువ్వే.


రాత్రి కురిసిన వాన వరదగా మారి
ఊరు ఊరంత పీకలోతు మునిగిపోతే
నీవు దాసుకున్న బియ్యం గింజలను
ఓ మూటగట్టి శరణార్థుల శిబిరానికి
తీసుకెళ్లకపోతే
ఆ వరద నీటిలో మునిగిపోయే
రేపటి పక్షివి నువ్వే ఐతావు.

నడిరోడ్డు మీద
ప్రాణం గిలగిల కొట్టుకుంటుంటే
దోసిట్లో నీళ్ళుదెచ్చి నోట్లో పోయకుండా
రక్తం మరకలు బట్టలకు అంటుతాయని
చూస్తూ ఉండిపోయిన
మనిషిని మనిషిగా పిలవకూడదు.

అన్యాలమని తెలిసి కూడా
వందమందిలో నీ నోరు
బాధితుడి వైపు పెగలకపోతే
నీలోని గడ్డకట్టుకపోయిన పిరికితనం
ఒకనాడు పదిమంది చూస్తుండగా
నిన్ను కాల్చుక తింటది చూడు..

ఆపతొచ్చినప్పుడు
మనిషి గొప్ప మనిషిగా మారాలి
సమయం వచ్చినప్పుడు
మరొక మనిషిలోకి మనం జొరబడి
మానవత్వపు దన్నెడగట్టి
నీ దిగాలుతనాన్ని ఆరేసుకోవాలి.

- అవనిశ్రీ, 9985419424



మార్గదర్శకులు

జ్ఞాన ప్రధాత గురువు
విజ్ఞాన విధాత గురువు
గురువు లేని విద్య
గుర్తింపు లేని విద్య

సూచనలిస్తూ సన్మార్గం నడిపించే
ఒడవని విజ్ఞాన సూత్రదారి

ప్రశ్నకు జవాబులు ఇస్తూ
కాటిన్యాన్ని సులభతరం చేస్తూ
కొండ గుర్తులను అపాదించి
మెదడుకు మేత వేసే మ్యాతరి

అమ్మ నాన్నలు జన్మ కర్తలు
గురువు భవిష్యత్తు కర్త
సూక్ష్మ నుంచి మోక్షాన్ని ప్రసాదిస్తాడు
సోపాను క్రమ విద్యకు
గట్టి పునాది నిర్మిస్తాడు
కర్త కర్మ క్రియలకు మార్గదర్శి

- ఆర్కల రాజేష్, 9177909700

అలా



నవ్వునెత్తుకొని
కనిపిస్తాం కానీ
లోలోపల పగిలిపోయిన నదులు
చాలా ఉంటాయి.
వొదులు వొదులు బట్టలతో
బయటపడుతాం కానీ
లోపల బిగుసుగా
బరువుగా ముడేసుకొనే జీవిస్తాం.

కుండలు మోయాలి
జొన్నలు మోయాలి
మందు బస్తలు
నారు కట్టలు
నాలుగు గుండెల్ని
నలభై దుఃఖపు కుండల్ని
మోయాలి
ఒళ్ళు పూనమైనా
బతుకు
తాకుడు రాళ్ళ గాయాలైనా
సన్నని చీకటిలో
ఊపిరి దారి వెతకాలి.

వెనకొక ఆశ చిగురిస్తూ
ముందొక చీరికల భూమి కనిపిస్తూ
బురదలో నడుస్తూన్నట్లు
జీవితాన్ని వ్యవసాయం చేసే
రైతులు భలే ఉంటారయ్యా!.

ఈ బరువైన గాలి
తేలికెలా అవ్వాలి
చినుకుపిట్టలు
నా గుండెపొలం మడిలో
రేపు వాలుతాయి కదా?.

- పేర్ల రాము